# భవిష్యత్ ప్రజాపాలన

మా వార్త రేపటి భవిష్యత్‌కు నిదర్శనం

bhavishyatprajapalana.in / epaper.bhavishyatprajapalana.in

తెలుగు దినపత్రిక

ASN NEWS

ఎడిటర్ : చిట్ల విజయ్‌కుమార్ రెడ్డి తెలంగాణ - రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 204 శనివారం , ఆగస్టు 22, 2026 , పేజీలు - 12 వెల : 1 /-


## రాజకీయ పర్యటనలకు ప్రాధాన్యం ఇవ్వం

**- అందుకే సిఎం రేవంత్ పర్యటనకు అనుమతి నిరాకరణ**

**- విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ వివరణ**



**న్యూఢిల్లీ,ఆగస్టు 21 :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి ఇవ్వలేదు. దీనిపై విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ స్పందించింది. శుక్రవారం న్యూఢిల్లీలో ఆ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ వివరణ ఇచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి బ్రిటన్ పర్యటనకు కేంద్రం క్లియరెన్స్ ఇచ్చిందని గుర్తు చేశారు. అయితే సీఎంలు, ఇతర ప్రముఖుల పర్యటనలను.. రాజకీయ క్లియరెన్స్ కోసం అంచనా వేస్తామని ఆయన వివరించారు. ప్రతిపాదిత కార్యక్రమం పదవికి, పర్యటన ఉద్దేశానికి అనుగుణంగా ఉండాలని ఈ సందర్భంగా జైస్వాల్ స్పష్టం చేశారు. అమెరికా పర్యటన అంశంలో అలా లేదన్నారు. ఈ నేపథ్యంలో మిగతా2లో...



## చిత్ర పరిశ్రమలో విషాదం..

**దిగ్గజ నటి 'షావుకారు జానకి' కన్నుమూత!**

**హైదరాబాద్,ఆగస్టు 21 :** భారతీయ చలనచిత్ర పరిశ్రమ మరో గొప్ప దిగ్గజాన్ని కోల్పోయింది. నాలుగు తరాల ప్రేక్షకులను తన అద్భుతమైన అభినయంతో మంత్రముగ్ధులను చేసిన అలనాటి ప్రముఖ సీనియర్ నటి 'షావుకారు' జానకి (94) తుదిశ్వాస విడిచారు. వయోభారంతో పాటు శ్వాసకోశ సంబంధిత మిగతా2లో...

## గ్లోబల్ సమ్మిట్ నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

**- అధికారులకు సంజయ్ జాజు ఆదేశం**



**హైదరాబాద్,ఆగస్టు 21 :** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న తెలంగాణ రైజింగ్ ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ను విజయవంతంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. డిసెంబర్‌లో హైదరాబాద్‌లో నిర్వహించనున్న తెలంగాణ రైజింగ్ ? ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై శుక్రవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో మిగతా2లో...

## తెలంగాణ ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసు

**హైకోర్టులో ముగిసిన వాదనలు: 16న తీర్పు వెలవరించనున్న హైకోర్టు**


2లో

## పెల్లెట్ గన్స్ ఉదంతంపై కేసు నమోదు



**న్యూఢిల్లీ,21:** ఢిల్లీ పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్ ఎదుట ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ ధర్నా చేపట్టిన విషయం తెలిసిందే. తాజాగా రాహుల్ గాంధీ డిమాండ్ మేరకు పెల్లెట్ గన్స్ ఉదంతంపై ఢిల్లీ పోలీసులు కేసు నమోదు చేసినట్లు సమాచారం. బాధితుని వైద్య నివేదిక ఆధారంగా కేసు నమోదు చేయనున్నట్లు జాతీయ మీడియా కథనాలు వెలువరించాయి. గత నెల జూలై 20న నీట్ పేపర్ లీక్ ను వ్యతిరేకిస్తూ విద్యార్థులు పార్లమెంట్ మార్చ్ కు శాంతియుత నిరసన చేపట్టిన విషయం తెలిసిందే. విద్యార్థులపై పెల్లెట్ గన్ లతో భద్రతా బలగాలు కాల్పులు జరిపాయి. ఈ కాల్పుల్లో 19 ఏళ్ల సాహిల్ కు తీవ్ర గాయాలైయ్యాయి. బాధిత యువకుడితో కలిసి కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ పార్లమెంట్ స్ట్రీట్ మిగతా2లో...



## క్రమశిక్షణా కమిటీకి చెప్పాల్సింది చెప్ప..

**- కొత్తగా చెప్పాల్సింది ఏమీ లేదు: కొండా సురేఖ**

**హైదరాబాద్,ఆగస్టు 21 :** కాంగ్రెస్ షోకాజ్ నోటీసుల అంశంలో తాను చెప్పాల్సింది క్రమశిక్షణ కమిటీకి చెప్పానని మంత్రి కొండా సురేఖ అన్నారు. ఈ విషయంపై ఇప్పుడు మీడియాతో మాట్లాడబోనని చెప్పారు. 'నేను చెప్పాల్సింది నిన్ననే క్రమశిక్షణ మిగతా2లో...

## ఎల్‌నినో సవాళ్లను సమష్టిగా ఎదుర్కొందాం

**సవాళ్లను అవకాశంగా మార్చుకోవాలి: వర్క్‌షాపులో పలువురు మంత్రుల సూచన**


2లో




## జిఒ 150ను రద్దు చేయాలి: కల్వకుంట్ల కవిత

**హైదరాబాద్,ఆగస్టు 21 :** తెలంగాణ స్థానిక విద్యార్థులకే ఎంబిబిఎస్ సీట్లు కేటాయించాలని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో శుక్రవారం నీట్ ర్యాంకులు సాధించిన తెలంగాణ రాష్ట్రానికి చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు కవితతో భేటీ అయ్యారు. ప్రభుత్వం 2024లో తీసుకువచ్చిన 150 జిఒ కారణంగా ఇతర రాష్ట్రాలకు మిగతా2లో...

## ఫీల్డ్ అసిస్టెంట్‌ల సమస్యల పరిష్కారానికి కృషి

**ఎక్కువ సంఖ్యలో కూలీలను నమోదు చేయాలి: మంత్రి సీతక్క వెల్లడి**


2లో


2లో

## హత్య కేసులో 105 ఏళ్ల వృద్ధుడికి ఊరట

**- జీవిత ఖైదును రద్దు చేసిన సుప్రీం కోర్టు**

భవిష్యత్ ప్రజాపాలన
తెలుగు దినపత్రిక



# హత్య కేసులో 105 ఏళ్ల వృద్ధుడికి ఊరట

**న్యూఢిల్లీ,ఆగస్టు 21 :**హత్యకేసులో జీవిత ఖైదు శిక్ష పడిన 105 ఏళ్ల వృద్ధుడికి సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. మిగిలిన శిక్షా కాలాన్ని రద్దు చేస్తూ శుక్రవారం సుప్రీంకోర్టు కీలక తీర్పును వెలువరించింది. ఆ వివరాల్లోకి వెళితే.. పశ్చిమ బెంగాల్‌లోని మల్ద జిల్లాకు చెందిన రసిక్ చంద్ర మొండల్ 1920లో జన్మించారు. 1988లో మర్డర్ కేసులో ఆయన జైలు పాలయ్యారు. 1994లో కోర్టు అతడిని దోషిగా తేల్చి జీవిత ఖైదు విధించింది. తనకు పడ్డ శిక్షను సవాల్ చేస్తూ మొండల్ 2018లో కోల్‌కతా హైకోర్టులో పిటిషన్ వేశారు. హైకోర్టు ఆయన పిటిషన్‌ను కొట్టేసింది.

తర్వాత అపెక్స్ కోర్టుకు వెళ్లగా.. అక్కడ కూడా మొండల్‌కు నిరాశే ఎదురైంది. దీంతో మొండల్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. వయసును దృష్టిలో ఉంచుకుని శిక్షా కాలం ముగియటానికంటే ముందే తనను రిలీజ్ చేయాలంటూ ఆయన పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన సుప్రీంకోర్టు 2024 నవంబర్ 29వ తేదీన మొండల్‌కు మధ్యంతర బెయిల్ మంజూర్ చేసింది. శుక్రవారం మరోసారి సుప్రీంకోర్టులో మొండల్ పిటిషన్‌పై విచారణ జరిగింది. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ వీ మోహనలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం పిటిషన్‌పై విచారణ జరిపింది. పిటిషనర్ వయసును దృష్టిలో ఉంచుకుని కేసును ముగిస్తున్నట్లు ధర్మాసనం స్పష్టం చేసింది. మిగిలిన శిక్షాకాలాన్ని కూడా రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. సుప్రీంకోర్టు తీర్పుతో 105 ఏళ్ల వయసులో రసిక్ చంద్ర మొండల్ జీవిత ఖైదు నుంచి విముక్తి పొందారు.

# జిఒ 150ను రద్దు చేయాలి: కల్వకుంట్ల కవిత

(మొదటి పేజీ తరువాయి)

చెందిన విద్యార్థులకు ఎక్కువ సీట్లు వస్తున్నాయని.. ఫలితంగా తెలంగాణ ప్రాంత బిడ్డలకు అన్యాయం జరుగుతోందని వివరించారు. కవిత స్పందిస్తూ, వారం రోజుల్లో ఎంబిబిఎస్ సీట్లు అలకేట్ చేసే అవకాశ ఉండటంతో ప్రభుత్వం తెలంగాణ స్థానిక విద్యార్థులకు అన్యాయం జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. వచ్చే విద్య సంవత్సరం నాటికి తెలంగాణ విద్యార్థులకు అన్యాయం చేసే జిఒ 150ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 9వ తరగతి నుంచి ఇంటర్మీడియేట్ వరకు నాలుగేళ్లు తెలంగాణలో చదివితే స్థానికత వర్తించేలా జిఒ 150 తేవడంతో ఇతర రాష్ట్రాల నుంచి ఇక్కడికి వచ్చి చదువుతోన్న విద్యార్థులకే ఎక్కువ ఎంబిబిఎస్ సీట్లు దక్కుతున్నాయని తెలిపారు. ఏటా సుమారు 1,500 నుంచి 2 వేల సీట్లు ఇతర రాష్ట్రాల విద్యార్థులకే దక్కుతున్నాయని, ఆ మేరకు తెలంగాణ విద్యార్థులకు నష్టం జరుగుతోందని పేర్కొన్నారు. ఒకటి నుంచి పదో తరగతి వరకు ఏడేళ్లు ఏ రాష్ట్రంలో జరిగితే అక్కడ స్థానికత వర్తించేలా పాత జిఒను పునరుద్ధరించాలని సూచించారు. నీట్ కారణంగా ఇప్పటికే 15 శాతం సీట్లు కోల్పోతున్నామని, ఏ రాష్ట్రంలో మెడికల్ సీట్ల భర్తీకి ఆ రాష్ట్రమే ఎంట్రన్స్ నిర్వహిస్తే సీట్లు కోల్పోవాల్సిన ఆస్కారమే ఉండదన్నారు. విద్యార్థుల భవిష్యత్ ముడిపడి ఉన్న ఈ అంశం అత్యంత సెన్సిటివ్ అని.. ప్రభుత్వం వారం రోజుల్లో ఒక నిర్ణయం తీసుకోకుంటే తెలంగాణ విద్యార్థులకు మళ్లీ అన్యాయం జరుగుతుందనే విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలన్నారు. విదేశీ పర్యటనలో ఉన్న సిఎం రేవంత్ రెడ్డి వెంటనే ఈమేరకు చర్యలు చేపట్టేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

# గ్లోబల్ సమ్మిట్ నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

(మొదటి పేజీ తరువాయి)

సీఎస్ ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమ్మిట్ నిర్వహణకు సంబంధించి వివిధ అంశాలపై అధికారులతో సమీక్షించారు. దేశంలోని వివిధ దేశాల రాయబారులు, హైకమిషనర్లకు ప్రత్యేక ఆహ్వానాలు పంపాలని, ఆయా దేశాల్లోని ప్రముఖ పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులను కూడా సమ్మిట్‌కు ఆహ్వానించాలని సీఎస్ సూచించారు. అదేవిధంగా, దేశంలోని వివిధ రంగాలకు చెందిన ప్రముఖ పారిశ్రామిక సంస్థలు, శాస్త్ర?సాంకేతిక, వైద్య, విద్య, మౌలిక వసతులు తదితర రంగాల ప్రముఖులను సమ్మిట్‌లో పాల్గొనేలా ముందుగానే ఆహ్వానాలు పంపాలని ఆదేశించారు. సమ్మిట్‌ను సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన వివిధ కమిటీలను ఏర్పాటు చేయాలని, ప్రతి కమిటీకి స్పష్టమైన బాధ్యతలను అప్పగించి సమన్వయంతో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వివిధ రంగాల సామర్థ్యాన్ని, పెట్టుబడి అవకాశాలను ప్రపంచానికి చాటిచెప్పేలా వివిధ రంగాలకు సంబంధించిన ఎక్స్‌పోలను ఏర్పాటు చేయాలని, వాటిలో ప్రముఖ కంపెనీలు, సంస్థలు భాగస్వామ్యమయ్యేలా చర్యలు తీసుకోవాలని సీఎస్ పేర్కొన్నారు. అలాగే, తెలంగాణ రైజింగ్ ? ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ నిర్వహణకు మార్గదర్శకత్వం అందించేందుకు వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, నిపుణులతో కూడిన సలహా మండలి ను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. సమ్మిట్‌ను అత్యున్నత ప్రమాణాలతో నిర్వహించి, తెలంగాణను ప్రపంచస్థాయి పెట్టుబడుల గమ్యస్థానంగా మరింతగా ప్రతిష్ఠించేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సీఎస్ సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కమిషనర్ శ్రీ శశాంక, పరిశ్రమలశాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓ అజిత్ రెడ్డి, పరిశ్రమల డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌నినో సవాళ్లను సమష్టిగా ఎదుర్కొందాం

**హైదరాబాద్,ఆగస్టు 21 :**ఎల్‌నినో ప్రభావంతో రానున్న సవాళ్లను ముందుగానే గుర్తించి తెలంగాణ రాష్ట్రాన్నిఅన్ని విధాలుగా సన్నద్ధం చేయాల ని పలువురు మంత్రులు అధికారులకు సూచించారు. ఎల్‌నినో సాధారణ పరిస్థితి కాదని, ముఖ్యంగా అక్టోబర్, నవంబర్ నెలల్లో పంటలు చేతికొచ్చే సమయంలో నీటి లభ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. శుక్రవారం రాజేంద్రనగర్‌లో ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు సమీకృత వ్యవసాయ కుంటల పాత్రపై నిర్వహించిన వర్క్‌షాప్‌లో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శ్రీమతి సీతక్క, పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి శ్రీ వాకిటి శ్రీహరి, సీఎస్ సంజయ్ జాజు, వ్యవసాయం, పశుసంవర్ధక, పంచాయతీరాజ్ శాఖల సెక్రటరీలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాకా మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు మాట్లాడుతూ, ఈ విధంగా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో సమావేశం ఏర్పటు చేయడం హర్షనీయమని అన్నారు. ప్రస్తుతం భూగర్భ జలాలు పెరిగే స్థాయిలో వర్షపాతం నమోదు కాలేదని, ప్రధాన జలాశయాల్లోకి కూడా ఆశించిన స్థాయిలో నీరు చేరలేదని మంత్రి తెలిపారు. రాబోయే రోజుల్లో అందుబాటులో ఉండే భూగర్భ జలాలపై రోజువారీగా అంచనాలు రూపొందించి, వాటిని జాగ్రత్తగా వినియోగించేలా అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆటో స్టార్టర్లతో రేయింబవళ్లు మోటార్లు నడిపి భూగర్భ జలాలను వృథా చేయకుండా, పంటకు అవసరమైన మేరకే నీటిని వినియోగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షపు నీటిని గరిష్ఠంగా నిల్వ చేసుకునేలా రాష్ట్రంలోని 44 వేల చెరువులను సంరక్షించాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. చెరువుల్లోకి వర్షపు నీటిని మళ్లించేలా చర్యలు చేపట్టి, వాటిలో నీటిని నిల్వ చేస్తే చుట్టుపక్కల ప్రాంతాల్లో భూగర్భ జలాలు పెరిగి బోర్లు పనిచేసే అవకాశం ఉంటుందన్నారు. వాగులు, నదుల్లో అవసరమైన ప్రాంతాల్లో ట్రెంచ్‌లు, రాక్‌ఫిల్ డ్యామ్‌లు ఏర్పాటు చేయడం ద్వారా నీటిని భూగర్భంలోకి ఇంకేలా చేసి భూగర్భ జలాల నిల్వ సామర్థ్యాన్ని పెంచవచ్చన్నారు. ఎల్‌నినో వంటి ప్రకృతి వైపరీత్యాలను సవాలుగా కాకుండా అవకాశంగా మలచుకోవాలని మంత్రి అన్నారు. కొత్త సాంకేతికత కోసం ఎదురుచూడాల్సిన అవసరం లేదని, గతంలో మన తాతలు, తండ్రులు అనుసరించిన నీటి సంరక్షణ పద్ధతులను తిరిగి ఆచరణలోకి తీసుకురావాలని సూచించారు. వ్యవసాయం, పశుసంవర్ధక, మత్స్య, అటవీ, పంచాయతీరాజ్, నీటిపారుదల తదితర శాఖలు సమన్వయంతో పనిచేస్తే ఎలాంటి విపత్కర పరిస్థితినైనా సమర్థంగా ఎదుర్కోవచ్చన్నారు. జిల్లా స్థాయిలో అధికారులు ప్రతిరోజూ సమన్వయ సమావేశాలు నిర్వహించి తమ జిల్లాలో చేపట్టాల్సిన చర్యలపై స్పష్టమైన ప్రణాళిక రూపొందించుకోవాలని మంత్రి సూచించారు. మండల స్థాయిలో మండల అధికారులు, జిల్లా స్థాయిలో జిల్లా అధికారులు సమన్వయంతో పనిచేయాలని, రైతులు, ప్రజలకు అధికారులు నమ్మకమైన మార్గదర్శకత్వం అందించాలని కోరారు. నిజాయితీగా, నిబద్ధతతో పనిచేసే అధికారుల మాటను రైతులు, ప్రజలు విశ్వసిస్తారని, అధికారులు ప్రజలతో మానవీయ కోణంలో వ్యవహరించాలని అన్నారు.

# క్రమశిక్షణా కమిటీకి చెప్పాల్సింది చెప్పా..

(మొదటి పేజీ తరువాయి)

కమిటీకి చెప్పా. ఇప్పుడు కొత్తగా చెప్పాల్సిన విషయాలేమీ లేవు. సీఎం రేవంత్ విదేశీ పర్యటన నుంచి వచ్చాక మాట్లాడతాను'అని కొండా సురేఖ అన్నారు. ఇటీవల వరంగల్ జిల్లా గీసుకొండలో కొండా సురేఖ కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో మంత్రికి కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ షోకాజ్ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్‌కు వివరణ పంపారు. సుస్మిత వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతమని.. ఈ విషయంలో తనను బాధ్యురాలిని చేయొద్దని అందులో కోరారు. మరోవైపు కొండా సురేఖ కుమార్తె చేసిన వ్యాఖ్యలపై సీఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. కాంగ్రెస్ అధిష్ఠానం కూడా సీరియస్‌గా తీసుకొన్నట్లు సమాచారం. నేరుగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై మంత్రి కుమార్తె చేసిన విమర్శలు, ఆరోపణలు కాంగ్రెస్‌లో తీవ్ర స్థాయిలో చర్చనీయాంశంగా మారాయి. క్రమశిక్షణా రాహిత్యంగా భావించి నోటీసులివ్వడంతో పరిమితం కాకుండా చర్యలకు కూడా ఉపక్రమించే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

# ఫీల్డ్ అసిస్టెంట్‌ల సమస్యల పరిష్కారానికి కృషి

**హైదరాబాద్,ఆగస్టు 21 :**ఫీల్డ్ అసిస్టెంట్‌ల సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం సానుకూలంగా ఉందని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి సీతక్క స్పష్టం చేశారు. గ్రామాల్లో ఉపాధి హామీ పనులను పెంచడంలో ఫీల్డ్ అసిస్టెంట్ల పాత్ర కీలకమైనదని ఈ సందర్భంగా మంత్రి సీతక్క అభివర్ణించారు. మీరు ఎక్కువ సంఖ్యలో కూలీలను నమోదు చేసి.. వారితో పనులు చేయించాలని స్పష్టం చేశారు. ప్రస్తుతం ప్రతిరోజు రెండు లక్షల కంటే తక్కువగా కూలీల నమోదు ఉందని వివరించారు. శుక్రవారం హైదరాబాద్ లో ఫీల్డ్ అసిస్టెంట్ ప్రతినిధులతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. చాలా ఏళ్లుగా వారి సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. గత ప్రభుత్వం ఫీల్డ్ అసిస్టెంట్‌లను విధుల నుంచి తప్పించిందని మండిపడ్డారు. వారిని తిరిగి ఫీల్డ్ అసిస్టెంట్లుగా తమ ప్రభుత్వం విధుల్లోకి తీసుకుందని గుర్తు చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్‌ల మధ్య వేతనంలో వ్యత్యాసం ఉందని పేర్కొన్నారు.

గ్రామ పంచాయతీ సైజు, పనుల కల్పనకు ముడి పెట్టకుండా ఫీల్డ్ అసిస్టెంట్‌లందరికీ ఒకే విధంగా వేతనం ఉండేలా చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా వారికి హామీ ఇచ్చారు. అలాగే ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పిస్తామని భరోసా కల్పించారు. ఫీల్డ్ అసిస్టెంట్లు.. తమను ఎఫ్‌టీఈలుగా గా కన్వర్ట్ చేయాలని కోరుతున్నారని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కలతో చర్చించి.. త్వరలో తమ నిర్ణయాన్ని ప్రకటిస్తామని వెల్లడించారు. ఆ సంఖ్యను కనీసం12 లక్షలకు పెంచాల్సిన అవసరం ఉందని సందర్భంగా మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ఇతర రాష్ట్రాలు కూలీలతో పనులు చేయించినప్పుడు.. మనం ఎందుకు చేయించ లేకపోతున్నామని ఫీల్డ్ ప్రతినిధుల బృందాన్ని మంత్రి సీతక్క సూటిగా ప్రశ్నించారు.

# చిత్ర పరిశ్రమలో విషాదం..

(మొదటి పేజీ తరువాయి)

అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆమెను కుటుంబ సభ్యులు కొద్ది రోజుల క్రితం చెన్నైలోని కావేరి ఆసుపత్రిలో చేర్పించారు.

అక్కడ ఐసీయూలో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతూ ఆమె పరిస్థితి విషమించడంతో శుక్రవారం మధ్యాహ్నం 1:59 గంటలకు కన్నుమూసినట్లు వైద్యులు వెల్లడించారు. ఆమె మరణవార్తతో తెలుగు, తమిళ, కన్నడ సినీ పరిశ్రమల్లో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి.

# పెల్లెట్ గన్స్ ఉదంతంపై కేసు నమోదు

(మొదటి పేజీ తరువాయి)

పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. తన ఫిర్యాదుపై ఢిల్లీ పోలీసులు ఇప్పటివరకు ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని సాహిల్ ఆరోపించాడు. అయితే ఎఫ్ఐఆర్ నమోదు కాలేదని రాహుల్ గాంధీ పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నాకు దిగారు.కేసు నమోదు చేసేవరకు స్టేషన్ నుంచి కదిలేది లేదని, నెల రోజులైనా, ఆరు నెలలైన ధర్నా చేస్తానని రాహుల్ గాంధీ భీష్మించారు.

మరోవైపు ఆనాటి ఘటనపై సుప్రీంకోర్టు గురువారం ఐదుగురు సభ్యులతో కూడిన ఉన్నత స్థాయి నిపుణుల కమిటీని (హెచ్‌పిఇసి) ఏర్పాటు చేసింది.

ఈ కమిటీకి సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఆర్. సుభాష్ రెడ్డి నేతృత్వం వహిస్తున్నారు .ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్‌లు జయమల్య బాగ్చి, వి. మోహనలతో కూడిన ధర్మాసనం, ఈ కమిటీలో పంజాబ్, హర్యానా హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి రవిశంకర్ ఝా, ఢిల్లీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ శాలిందర్ కౌర్, మాజీ సీబీఐ డైరెక్టర్ రిషి కుమార్ శుక్లా, రిటైర్డ్ మేఘాలయ డీజీపీ ఎల్.ఆర్. బిష్ణోయ్ కూడా సభ్యులుగా ఉంటారని తెలిపింది.

# రాజకీయ పర్యటనలకు ప్రాధాన్యం ఇవ్వం

(మొదటి పేజీ తరువాయి)

సీఎం రేవంత్ రెడ్డి యూఎస్ పర్యటనకు క్లియరెన్స్ నిరాకరించామని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారి రణధీర్ జైస్వాల్ పేర్కొన్నారు. 10 రోజుల విదేశీ పర్యటన కోసం సీఎం రేవంత్ రెడ్డి లండన్‌కు బయలుదేరి వెళ్లారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం కోసం న్యూఢిల్లీ వెళ్లిన ఆయన బుధవారం అర్ధరాత్రి తర్వాత అక్కడి నుంచి బయలుదేరి విదేశాలకు వెళ్లారు. ముందుగా అనుకున్న ప్రకారం.. ఆగస్టు 30వ తేదీ వరకు బ్రిటన్, అమెరికాల్లో సీఎం బృందం పర్యటించ నుంది. ఈ రెండు దేశాల్లోని వివిధ యూనివర్సిటీలను సందర్శించి తెలంగాణలో ఉన్నత విద్య, క్రీడల అభివృద్ధిపై ఈ బృందం చర్చించనుంది. అలాగే లండన్‌లోని ఆక్స్‌ఫర్డ్ వర్సిటీలోని బ్లావట్నిక్ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్‌ను సీఎం బృందం సందర్శించనుంది. అక్కడి ఎమిరేట్స్ స్టేడియంలో ఫుట్‌బాల్ ప్రజెంటేషన్‌లో పాల్గొనుంది. అనంతరం యూఎస్‌కు సీఎం బృందం బయలుదేరి వెళ్లాల్సి ఉంది. కానీ సీఎం రేవంత్ అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి ఇవ్వ లేదు. దాంతో ఆయన లండన్ పర్యటన ముగించుకుని హైదరాబాద్‌కు తిరిగి రానున్నారు. అయితే యూఎస్ పర్యటనకు వెళ్లాలని అధికారుల బృందాన్ని సీఎం రేవంత్ ఆదేశించినట్లు తెలుస్తోంది.

# తెలంగాణ ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసు

**హైదరాబాద్,ఆగస్టు 21 :** తెలంగాణలో ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుల వ్యవహారంపై దాఖలైన పిటిషన్లపై హైకోర్టులో విచారణ జరిగింది. ఎమ్మెల్యేల అనర్హతపై హైకోర్టులో ఇరుపక్షాల వాదనలు ముగిశాయి. దీంతో సెప్టెంబర్ 16న తీర్పును వెల్లడించనున్నట్లు న్యాయస్థానం తెలిపింది. పార్టీ మారిన పది మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని బీఆర్‌ఎస్ తరఫు న్యాయ వాదులు హైకోర్టులో వాదనలు వినిపించారు. కాంగ్రెస్‌కు అనుకూలంగా ఆయా ఎమ్మెల్యేలు ప్రచా రం చేసిన వీడియోలను న్యాయస్థానానికి సమర్పించారు. అభివృద్ధి కోసం మాత్రమే ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నామని ఫిరాయింపు ఎమ్మెల్యేలు అంటున్నారని బీఆర్‌ఎస్ తరఫు న్యాయవాది గండ్ర మోహన్ రావు కోర్టుకు తెలియజేశారు. ఏఐసీసీ అధికారిక కార్యక్రమాల్లో ఫిరాయింపు ఎమ్మెల్యేలు పాల్గొన్నారని, వీరి వీడియోలు ంఃఔ ఆంధ్రజ్యోతిలో ప్రసారం అయ్యాయని తెలిపారు. ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకుని.. జాతీయ జెండాగా చెబుతున్నారని, జాతీయ జెండాలో అశోక చక్రం ఉంటుందని గండ్ర మోహన్ రావు.. కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే దానం నాగేందర్.. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేగా ఎన్నికై, ఎమ్మెల్యే పదవిలో కొనసాగుతూనే కాంగ్రెస్ పార్టీ తరఫున ఎంపీగా పోటీ చేశారని కోర్టుకు వివరించారు. పార్టీ సభ్యత్వం లేని వ్యక్తులకు ఎన్నికల్లో టికెట్ ఇవ్వడం సాధ్యం కాదని అన్నారు. ప్రధాన పత్రికలు, టీవీ ఛానళ్లలో ప్రసారమైన వార్తా కథనాలు, వీడియోలను కూడా బీఆర్‌ఎస్ తరఫు న్యాయవాది గండ్ర మోహన్ రావు న్యాయస్థానం ముందు ఉంచారు. ఇరుపక్షాల వాదనలు పూర్తవడంతో సెప్టెంబర్ 16న తీర్పును వెల్లడించనున్నట్లు హైకోర్టు పేర్కొంది.

# కక్షతోనే అడ్డుకున్నారు: మంత్రి వాకిటి



**హైదరాబాద్,ఆగస్టు 21 :**
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనకు రాజకీయ కక్షతోనే కేంద్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించిందని మంత్రి వాకిటి శ్రీహరి ఆరోపించారు. సిఎం అమెరికా పర్యటనకు అ నుమతి నిరాకరణపై కేంద్ర మంత్రు లు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లు ప్రజలకు సమాధానం చె ప్పాలని మంత్రి డిమాండ్ చేశారు. పేద, బడుగు, బలహీన, దళిత, మైనార్టీ వర్గాల పిల్లలకు ప్రపంచస్థా యి విద్యను అందించాలనే లక్ష్యంతోనే ముఖ్యమం త్రి అమెరికా పర్యటనకు వెళ్లాలని నిర్ణయించుకున్నారని మంత్రి తెలిపారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం సి ఎం చేపడుతున్న ప్రతి కార్యక్రమానికి అడ్డంకులు సృష్టించడంద్వారా తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోలేరని వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు. విద్యార్థుల భవిష్యత్తుపై రాజకీయాలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. తెలంగాణకు ప్రపంచస్థాయి విశ్వవిద్యాలయాలను తీసుకురావడం, విద్యా రంగంలో పెట్టుబడులు, అత్యుత్తమ విద్యా సంస్థల భాగస్వామ్యాలను రాష్ట్రానికి తీసుకురావడం వంటి అంశాల పై చర్చించాలన్నది సీఎం లక్ష్యమని పేర్కొన్నారు. అ మెరికా పర్యటనకు సంబంధించిన అన్ని వివరాలను రాష్ట్ర ప్రభుత్వం ముందుగానే కేంద్ర ప్రభుత్వానికి అ ధికారికంగా పంపించినప్పటికీ అనుమతి నిరాకరించడం దురదృష్టకరమని మంత్రి అన్నారు.

భవిష్యత్ ప్రజాపాలన
తెలుగు దినపత్రిక
శనివారం , ఆగస్టు 22 , 2026


# అవినీతి అధికారుల పై ఉక్కుపాదం మోపాలి,

## "ఇబ్రహీంపట్నం "ఆర్.డి.ఓ" ఆఫీస్"లో భారీ అవినీతి తిమింగలం





**రంగారెడ్డి జిల్లా,ఇబ్రహీంపట్నం,భవిష్యత్ ప్రజాపాలన సీనియర్ జర్నలిస్ట్ వినోద్ కుమార్:** ప్రజలకు సేవ చేయాల్సిన ప్రభుత్వ అధికారులు అవినీతికి పాల్పడుతున్నారనే ఆరోపణలు ప్రజల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. ఇబ్రహీంపట్నం ఆర్.డి.ఓ కార్యాలయంలో ఏసీబీ దాడి జరిగిన నేపథ్యంలో ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి వ్యవహారాలపై మరింత లోతైన దర్యాప్తు చేపట్టాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి. గతంలో మహేశ్వరం మండలంలో ఎమ్మార్వో గా పనిచేసిన శ్రీనివాస్ రెడ్డి ప్రస్తుతం ఇబ్రహీంపట్నంలో ఏఓగా విధులు నిర్వహిస్తున్న సమయంలో అవినీతికి పాల్పడుతున్నారనే ఆరోపణలు, ఆయనపై గతంలోనూ చర్యలు జరిగినప్పటికీ పరిస్థితిలో మార్పు రాలేదనే ప్రచారం తీవ్ర చర్చకు దారితీస్తోంది. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత దర్యాప్తు సంస్థలు పూర్తి స్థాయిలో విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వ ఉద్యోగం అంటే ప్రజలకు సేవ చేయాల్సిన బాధ్యత. కానీ కొందరు అధికారులు తమ హోదాను అడ్డుపెట్టుకుని ప్రజల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వస్తే, అది మొత్తం ప్రభుత్వ వ్యవస్థ పై ప్రజల నమ్మకాన్ని దెబ్బతీస్తుంది. ముఖ్యంగా సామాన్య ప్రజలు తమ పనుల కోసం ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లినప్పుడు లంచం ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడకూడదు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారుల పై "ఏసీబీ" అధికారులు పూర్తిస్థాయి విచారణ చేపట్టి,



ఆరోపణలు రుజువైతే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అక్రమంగా ఆస్తులు కూడబెట్టినట్లు ఆధారాలు లభిస్తే వాటిపైనా సమగ్ర దర్యాప్తు జరిపి, చట్టబద్ధమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అంతేకాకుండా రంగారెడ్డి జిల్లా పరిధిలోని ప్రతి మండలంలోని కీలక ప్రభుత్వ కార్యాలయాలపై ఏసీబీ నిరంతర నిఘా వ్యవస్థను బలోపేతం చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. లంచం డిమాండ్ చేసే అధికారులపై ఫిర్యాదులు స్వీకరించేందుకు ప్రజలకు సులభమైన మార్గాలు కల్పించి, ఫిర్యాదులపై వేగంగా స్పందించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రజల నుంచి వసూలు చేసే ప్రతి రూపాయి ప్రజల కష్టార్జితం. ఆ డబ్బును అక్రమంగా తీసుకునే అధికారం ఎవరికీ లేదు.హోదా ఎంత పెద్దదైనా అవినీతికి పాల్పడితే చట్టం ముందు అందరూ సమానమే అనే సందేశం బలంగా వెళ్లేలా అధికారులు వ్యవహరించాలి. ఇబ్రహీంపట్నం ఘటనను కేవలం ఒక కార్యాలయానికి పరిమితం చేయకుండా, జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి పరిస్థితులపై సమగ్రంగా దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. "ప్రజలకు సేవ చేయాల్సిన అధికారులు అవినీతికి పాల్పడితే ఉపేక్షించకూడదుఅవినీతిపై ఉక్కుపాదం మోపాలి..ప్రతి మండలంలో ఏసీబీ నిఘా మరింత పెంచాలి"అంటూ రంగారెడ్డి జిల్లా ఏసీబీ అధికారులకు ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఈసారైనా ఇందిరమ్మ ఇళ్లు అర్హులకు దక్కేనా?

- ఎన్నికల హామీలు నీటి మూటలేనా..!
- గ్రామ సభ ద్వారా అర్హుల ఎంపిక జరిగేనా?
- మరిపడిగలో అర్హత కలిగిన కుటుంబాల ఎదురుచూపులు.. ఎంపికపై పలు రకాల అనుమానాలు



**గుండాల, ఆగస్టు 21(భవిషత్ ప్రజాపాలన స్టేట్ బ్యూరో విజయ్ )** పేదల సొంతింటి కల నెరవేరుతుందన్న ఆశ నిరుపేదలకు కలగానే మిగిలిపోతుందా? ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అర్హులైన వారికి న్యాయం జరుగుతుందా? నిరాశ ఎదురవుతుందా అన్న సందేహాలు ఆలేరు నియోజకవర్గం గుండాల మండలం మరిపడిగ గ్రామంలో వ్యక్తమవుతున్నాయి. గ్రామ పంచాయతీ ఎన్నికల సమయంలో ప్రచారం లో ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోవడం లేదని పలువురు యువకులు గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**హామీలు ఏమయ్యాయ్?**

పంచాయతీ ఎన్నికల ప్రచారంలో గ్రామాభివృద్ధి, పేదల సమస్యల పరిష్కారం, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులకు అందిస్తామని హామీలు ఇచ్చారని గ్రామస్థులు చెబుతున్నారు. ఎన్నికలు ముగిసిన తర్వాత వాటి అమలుపై పెద్దగా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఓట్ల ముందు చెప్పిన మాటలు.. ఇప్పుడు నీటి మూటలుగా మారనున్నాయా? అని ప్రశ్నిస్తున్నారు.

**అర్హులకు అందేనా?**

ఇందిరమ్మ ఇళ్ల పథకంపై ఎన్నో ఆశలు పెట్టుకున్న పేద కుటుంబాలు తమ పేరు లబ్ధిదారుల జాబితాలో ఉంటుందో లేదోనని ఎదురు చూస్తున్నారు. ఇల్లు లేని వారు శిథిలావస్థలో ఉన్న వారు స్థానిక నాయకుల చుట్టు చెప్పులరిగేలా తిరుగుతున్నారు. అర్హులను ఎంపిక చేసే క్రమంలో నిజమైన ఇండ్లు లేని పేదవారిని గుర్తించి ప్రాధాన్యం ఇవ్వాలని కోరుతున్నారు. రాజకీయ సిఫార్సులు, పలుకుబడులకు తావులేకుండా అర్హత ఆధారంగానే ఎంపిక జరగాలని డిమాండ్ చేస్తున్నారు.

**ఎంపికపై పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి.**

లబ్ధిదారుల ఎంపికలో కొందరికి ప్రాధాన్యం దక్కే అవకాశం ఉందన్న అనుమానాలు గ్రామస్థుల్లో వ్యక్తమవుతున్నాయి. తమకు అనుకూలమైన వారిని ఎంపిక చేసే పరిస్థితి రాకుండా అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలని కోరుతున్నారు. అర్హుల జాబితాను గ్రామసభ నిర్వహించి ఎంపిక చేయాలని పలువురు కోరుతున్నారు.

**ఎమ్మెల్యే జోక్యం చేసుకోవాలి**

ఇందిరమ్మ ఇళ్ల ఎంపికపై స్థానిక ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి సారించి అర్హులైన నిరుపేదలకు న్యాయం చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. అధికారులు గ్రామంలో పర్యటించి వాస్తవ పరిస్థితులను పరిశీలించి, అర్హులైన ప్రతి కుటుంబానికి పథకం అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు కార్యరూపం దాల్చి.. ఈసారైనా పేదల గడపకు ఇందిరమ్మ ఇల్లు చేరుతుందా? లేక హామీలు మరోసారి మాటలకే పరిమితమవుతాయా? అన్నది మరిపడిగలో చర్చనీయాంశంగా మారింది.

# వసూళ్లు ఫుల్.. వెలుగులు నిల్!




- తై బజార్ డబ్బులు వసూలు.. మార్కెట్‌లో కనీస సౌకర్యాలు కరువు
- గురువారం మార్కెట్‌లో చీకట్లు.. మహిళలు, వృద్ధులు, వ్యాపారుల అవస్థలు

**పటాన్‌చెరు, ఆగస్టు 21:** ఒకవైపు తై బజార్ పేరుతో వసూళ్లు.. మరోవైపు ప్రజలకు, వ్యాపారులకు కనీస సౌకర్యాలు లేకపోవడం. ఇదీ పటాన్‌చెరు గురువారం మార్కెట్‌లో కనిపిస్తున్న పరిస్థితి. ప్రతి గురువారం వేలాది మంది కొనుగోళ్ల కోసం తరలివచ్చే మార్కెట్‌లో వీధి దీపాలు వెలగకపోవడంతో చీకట్లు అలుముకున్నాయి. రద్దీ సమయంలోనే వెలుతురు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కూరగాయలు, పండ్లు, నిత్యావసర సరుకులు కొనుగోలు చేసేందుకు వచ్చిన ప్రజలు చీకట్లోనే సరుకులు ఎంచుకోవాల్సి వచ్చింది. ఏది నాణ్యమైనదో, ఏది పాడైందో సరిగా కనిపించక వినియోగదారులు ఇబ్బంది పడ్డారు. వ్యాపారులు సైతం సరుకులు సర్దుకోవడం, విక్రయాలు నిర్వహించడం కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.

**చీకట్లోనే మహిళలు.. వృద్ధులకు తిప్పలు**

మార్కెట్‌కు మహిళలు, వృద్ధులు, చిన్నారులతో వచ్చే కుటుంబాల సంఖ్య అధికంగా ఉంటుంది. వీధి దీపాలు పనిచేయకపోవడంతో చీకట్లో నడవాల్సి రావడం ప్రమాదకరంగా మారింది. రద్దీ మధ్య చిన్నపిల్లలు తప్పిపోయే అవకాశం ఉందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. నేలపై గుంతలు, చెత్త, నీరు ఉన్న ప్రాంతాలు చీకట్లో కనిపించక జారిపడే ప్రమాదం ఉందని స్థానికులు చెబుతున్నారు.



వసూళ్లలో వేగం.. సౌకర్యాల్లో నిర్లక్ష్యం! 'తై బజార్' పేరుతో వ్యాపారుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నప్పటికీ, మార్కెట్‌లో కనీస సదుపాయాలు ఎందుకు కల్పించడం లేదని వ్యాపారులు ప్రశ్నిస్తున్నారు. వసూళ్లు చేయడంలో ఉన్న శ్రద్ధ.. వీధి దీపాలు వెలిగించడంలో ఎందుకు కనిపించడం లేదని నిలదీస్తున్నారు. మార్కెట్‌లో విద్యుత్ వెలుతురు, పారిశుధ్యం, తాగునీరు, భద్రత వంటి ప్రాథమిక సదుపాయాలు అందుబాటులో



ఉండాలని వ్యాపారులు కోరుతున్నారు. డబ్బులు చెల్లిస్తున్న తమకు కనీస వసతులు కల్పించడం అధికారుల బాధ్యత అని స్పష్టం చేస్తున్నారు.

**సిబ్బందికీ కష్టాలే..**

మార్కెట్ యార్డులో విధులు నిర్వహించే సిబ్బందికి కూడా సరైన సౌకర్యాలు లేవని పలువురు చెబుతున్నారు. వర్షం, తడి వాతావరణంలో సిబ్బంది ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే వారు లేరని ఆరోపిస్తున్నారు. మార్కెట్ నిర్వహణపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరుతున్నారు. కోట్ల అభివృద్ధి మాటలు.. మార్కెట్‌లో మాత్రం చీకట్లు!

పటాన్‌చెరు అభివృద్ధికి కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నామని చెబుతున్న పాలకులు.. ప్రజలు పెద్ద సంఖ్యలో ఉపయోగించే మార్కెట్‌లో కనీస వెలుతురు సౌకర్యం కల్పించకపోవడంపై స్థానికులు మండిపడుతున్నారు. ప్రజల నుంచి వసూళ్లు చేస్తున్నప్పుడు వారికి అవసరమైన మౌలిక సదుపాయాలు అందించాల్సిన బాధ్యత కూడా ఉందని అంటున్నారు.

**ఇకనైనా మేల్కొంటారా?**

గురువారం మార్కెట్ ప్రారంభమయ్యే ముందు పనిచేయని వీధి దీపాలను గుర్తించి మరమ్మతులు చేయాలని, మార్కెట్ మొత్తం వెలుతురుతో ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు, వ్యాపారులు డిమాండ్ చేస్తున్నారు. పారిశుధ్యం, భద్రత, సిబ్బందికి అవసరమైన సౌకర్యాలపై కూడా అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. వసూళ్లు మాత్రం కొనసాగుతుంటే.. సౌకర్యాలు మాత్రం ఎందుకు కనిపించడం లేదన్న ప్రశ్నకు అధికారులు సమాధానం చెప్పాల్సిన పరిస్థితి నెలకొంది.

## VDN A/C కన్వెన్షన్ హాల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో

# పాల్గొన్న ఎమ్మెల్యే బాలు నాయక్

**కొండమల్లేపల్లి భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి తిరుపతి వద్య :** కొండమల్లేపల్లి మండలం, చిన్నఅడిశర్లపల్లి స్టేజీ వద్ద దేవరకొండ మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీ వద్య దేవేందర్ నాయక్ గారు నూతనంగా ఏర్పాటు చేసిన VDN A/C కన్వెన్షన్ హాల్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శాసన మండలి చైర్మన్ శ్రీ గుత్తా సుఖేందర్ రెడ్డి గారు మరియు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీ పున్న కైలాష్ నేత గార్లతో కలిసి దేవరకొండ ఎమ్మెల్యే శ్రీ నేనావత్ బాలు నాయక్ గారు ముఖ్య అతిథిగా హాజరై కన్వెన్షన్ హాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు శ్రీ వద్య దేవేందర్ నాయక్ గారికి ఎమ్మెల్యే బాలు నాయక్ గారు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అన్ని సౌకర్యాలతో కన్వెన్షన్ హాల్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ నూతన వేదిక ప్రజలకు



వివాహాలు, శుభకార్యాలు, ఇతర సామాజిక కార్యక్రమాలకు ఎంతో ఉపయోగకరంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో దేవరకొండ మార్కెట్ కమిటీ చైర్మన్ నాయిని జమున మాధవరెడ్డి, మాల్ మార్కెట్ కమిటీ చైర్మన్ దొంతం అలివేలు సంజీవరెడ్డి, దేవరకొండ మునిసిపల్ చైర్మన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు, మాజీ చైర్మన్ ఆలంపల్లి నరసింహ, దేవరకొండ నియోజకవర్గంలోని మండలాల అధ్యక్షులు, మండలాల ముఖ్య నాయకులు, సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## అభాగ్యులకు అండగా.. నూతన భవన నిర్మాణానికి

# రూ.1.25 లక్షల ఆర్థిక సహాయం



- తల్లిదండ్రుల జ్ఞాపకార్థం మాతృదేవోభవ అనాథ ఆశ్రమానికి విరాళం
- ఆశ్రమ నిర్వాహకులు గట్టుగిరి సేవలు అభినందనీయం: మర్రి నరసింహారెడ్డి

**రంగారెడ్డి జిల్లా, మహేశ్వరం భవిష్యత్ ప్రజాపాలన:** సమాజంలో ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం, అనాథలు, అభాగ్యులకు ఆత్మీయతతో ఆశ్రయం కల్పించడం గొప్ప మానవతా సేవ అని పలువురు కొనియాడారు. సంతోష్‌నగర్‌లోని మాతృదేవోభవ అనాథ ఆశ్రమం నూతన భవన నిర్మాణానికి మర్రి నరసింహారెడ్డి కుటుంబ సభ్యులు తమ వంతు సహాయాన్ని అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. మర్రి నరసింహారెడ్డి తన తల్లిదండ్రులు కీ.శే. మర్రి ముత్యం రెడ్డి, కీ.శే. మర్రి పెంటమ్మ జ్ఞాపకార్థం ఆశ్రమం నూతన భవన నిర్మాణం కోసం రూ.1,25,000 ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా మర్రి నరసింహారెడ్డితో పాటు సంతోష, అల్లుళ్లు, కూతుళ్లు, మనవళ్లు, మనవరాళ్లు, కుటుంబ సభ్యులు పాల్గొని ఆశ్రమ నిర్వాహకులకు తమ సహకారాన్ని అందించారు.

**150 మంది అభాగ్యులకు అండగా..**

ప్రస్తుతం సమాజంలో కొంతమంది సొంత తల్లిదండ్రులను కూడాపట్టించుకోని పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో, 150 మంది అనాథలు, అభాగ్యులకు ఆశ్రయం కల్పిస్తూ, వారికి అన్నం, వసతి, ఆప్యాయత అందిస్తూ మాతృదేవోభవ అనాథ ఆశ్రమం నిర్వాహకులు గట్టుగిరి చేస్తున్న సేవలు ఎంతో గర్వించదగ్గవని మర్రి నరసింహారెడ్డి అన్నారు. "అనాథ అనే పదం ఎవరి జీవితంలోనూ ఉండకూడదు.. ఆపదలో ఉన్న ప్రతిఒక్కరికీ ఒక గూడు, ఒక ఆప్యాయత, ఒక కుటుంబం లభించాలనే సంకల్పంతో గట్టుగిరి చేస్తున్నసేవలు అభినందనీయం" అని ఆయన పేర్కొన్నారు. ఆశ్రమంలో ఉంటున్న అభాగ్యుల కోసం నూతన భవన నిర్మాణం చేపట్టడం గొప్ప కార్యక్రమమని,ఈ నిర్మాణానికి మరింత మంది దాతలు ముందుకు వచ్చి తమ వంతు సహకారం అందించాలని మర్రి నరసింహారెడ్డి కోరారు. సమాజంలో సేవా భావం ఉన్న ప్రతి ఒక్కరూ ఆశ్రమాన్ని సంప్రదించి సహాయం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

**వస్తు రూపంలోనూ సహాయం చేయొచ్చు**

మాతృదేవోభవ ఆశ్రమం వ్యవస్థాపకులు గట్టుగిరి మాట్లాడుతూ.. అభాగ్యుల కోసం చేపట్టిన నూతన భవన నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమకు తోచిన విధంగా సహాయం అందించాలని కోరారు. ఆర్థిక సహాయంతో పాటు సిమెంట్, స్టీల్, ఇటుకలు, ఇసుక తదితర నిర్మాణ సామగ్రిని వస్తు రూపంలో కూడా అందించవచ్చని తెలిపారు. ఒక గదిని నిర్మించేందుకు సుమారు రూ.1,25,000 ఖర్చు అవుతుందని, గది నిర్మాణానికి సహకరించే దాతల పేర్లు,ఫొటోలను శిలా ఫలకంపై ఏర్పాటుచేసి వారిసేవను శాశ్వతంగా గుర్తుండేలా చేస్తామని గట్టుగిరి తెలిపారు. "మన దగ్గర ఉన్నదాంట్లో కొంత భాగాన్ని అవసరంలో ఉన్నవారికి అందిస్తే అదే నిజమైన మానవత్వం. ఒక గది నిర్మాణానికి అందించే సహాయం ఒక కుటుంబానికి గూడు కల్పించినంత గొప్ప సేవ" అని ఆయన పేర్కొన్నారు. మాతృదేవోభవ ఆశ్రమం నూతన భవన నిర్మాణానికి దాతలు, సేవా సంస్థలు, ప్రజలు ముందుకు వచ్చి సహకరించాలని గట్టుగిరి విజ్ఞప్తి చేశారు. అభాగ్యులకు అండగా నిలిచే ఈ మహత్తర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.ఈ కార్యక్రమంలో మాతృదేవోభవ ఆశ్రమం వ్యవస్థాపకులు గట్టుగిరి, వారి బృందం, మర్రి నరసింహారెడ్డి, సంతోష, కుటుంబ సభ్యులు, అల్లుళ్లు, కూతుళ్లు, మనవళ్లు, మనవరాళ్లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం

## 2026 సందర్భంగా దత్తపు దేవా కు అరుదైన అవార్డు



- 15 ఏళ్ల ఫోటో జర్నలిజానికి గుర్తింపు.. హైదరాబాద్ యూనివర్సిటీ నుంచి రెండోసారి సత్కారం
- ప్రజా సమస్యలు, సామాజిక అన్యాయాలను వెలుగులోకి తెచ్చిన దత్రపు దేవా
- కెమెరాతో సామాజిక బాధ్యతకు బాటలు.. దేవాకు జర్నలిస్టుల అభినందనలు

**ఉప్పల్, ఆగస్టు 21(భవిష్యత్తు ప్రజా పాలన):** గత 15 ఏళ్లుగా ఫోటో జర్నలిస్టుగా సేవలందిస్తున్న ఈనాడు జర్నలిస్టు దత్రపు దేవాకు మరో ప్రతిష్ఠాత్మక గౌరవం దక్కింది. ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం-2026 సందర్భంగా యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ డిపార్ట్ మెంట్ ఆఫ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనకు అవార్డు అందజేశారు. యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్, కార్యక్రమ కన్వీనర్ డా. చెల్లి జనార్ధన్‌రావు చేతుల మీదుగా దత్రపు దేవా అవార్డును అందుకున్నారు. యూనివర్సిటీ నుంచి ఆయనకు అవార్డు రావడం ఇది రెండోసారి. ప్రజా సమస్యలు, సామాజిక అన్యాయాలను తన కెమెరా ద్వారా వెలుగులోకి తీసుకువస్తూ దత్రపు దేవా ఫోటో జర్నలిజంలో ప్రత్యేక గుర్తింపు పొందారు. సామాజిక బాధ్యతతో పనిచేస్తున్న ఆయనకు మరోసారి అవార్డు దక్కడంపై జర్నలిస్టులు, మీడియా ప్రతినిధులు అభినందనలు తెలిపారు.



# ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో భాగంగా స్వయంగా పరిశీలించిన మంత్రి జూపల్లి కృష్ణారావు



**పెంట్లవెల్లి మండలం:** పెంట్లవెల్లి మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో భాగంగా గౌరవ మంత్రివర్యులు శ్రీ జూపల్లి కృష్ణారావు గారు లబ్ధిదారులు ప్రస్తుతం నివసిస్తున్న ఇళ్ల స్థితిగతులను స్వయంగా పరిశీలించి, అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా గౌరవ మంత్రివర్యులు మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ముఖ్యంగా గుడిసెల్లో నివసిస్తున్న నిరుపేదలకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. అదేవిధంగా, ఇప్పటికే గోడలు నిర్మించుకుని స్లాబ్ వేసుకునే స్థితిలో ఉన్న అర్హులైన లబ్ధిదారులకు రూ.2 లక్షల ఆర్థిక సహాయం అందించే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. అలాగే, ఇల్లు నిర్మాణంలో బేస్ లెవెల్ వరకు పూర్తి చేసుకుని, ఆర్థిక ఇబ్బందుల కారణంగా మిగతా నిర్మాణాన్ని కొనసాగించలేకపోతున్న అర్హులైన లబ్ధిదారులకు రూ.4 లక్షల ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా లబ్ధి చేకూర్చుతున్నామని వెల్లడించారు. అర్హత, ఇంటి ప్రస్తుత స్థితిగతులు మరియు లబ్ధిదారుల ఆర్థిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక చేపడుతున్నట్లు మంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రామన్ గౌడ్, హౌసింగ్ డీఈ రాజవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఫిషరీస్ పోస్టుకు దరఖాస్తు చేసుకోండి

**ప్రిన్సిపల్ మదన్ మోహన్**



**నాగర్‌కర్నూల్ :** భవిష్యత్ ప్రజా పాలన జర్నలిస్ట్ రఘు సాగర్ : జిల్లా కేంద్రంలోని నెల్లికొండ ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో ఫిషరీస్ & ఆక్వాకల్చర్ సబ్జెక్ట్ బోధించేందుకు అతిథి అధ్యాపక పోస్ట్ మంజూరైందని కళాశాల ప్రిన్సిపాల్ మదన్ మోహన్ తెలిపారు.ఫిషరీస్ సబ్జెక్టులో పీజీ ఉత్తీర్ణులై లేదా ఎంఎస్సీ జువాలజీ చేసి ఉండి కనీసం 55 శాతం మార్కులు (SC/STలకు 50 శాతం) సాధించిన వారు అర్హులని తెలిపారు. నెట్, సెట్ లేదా పీహెచ్‌డీ అర్హత కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆగస్ట్ 24న మధ్యాహ్నం 12 గంటలలోపు నెల్లికొండ ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో హాజరు కావాలని వెంటనే ఎంపిక ప్రక్రియ నిర్వహించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాల కోసం కళాశాలలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ మదన్ మోహన్ తెలిపారు.

# KPHBలో చిలకలూరిపేట యువతి ఆత్మహత్య



**భవిష్యత్ ప్రజా పాలన, హైదరాబాద్:** కూకట్‌పల్లి ఖానదీలో విషాద ఘటన చోటుచేసుకుంది. రోడ్ నంబర్--1లోని ఓ ప్రైవేట్ హాస్టల్‌లో ఓ యువతి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు జిల్లా చిలకలూరిపేట పరిధిలోని పండరీపురానికి చెందిన యామిని (24) కొంతకాలంగా హైదరాబాద్‌లో ఉంటూ ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఉద్యోగం రాకపోవడంతో ఆమె తీవ్ర మనస్తాపానికి గురైనట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ క్రమంలోనే ఖానదీ రోడ్ నంబర్-1లోని ప్రైవేట్ హాస్టల్‌లో యువతి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని పరిశీలించారు. అనంతరం యువతి మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. యువతి ఆత్మహత్యకు అసలు కారణాలు ఏమిటన్నది దర్యాప్తులో తేలాల్సి ఉంది. ఉద్యోగ ప్రయత్నాల్లో ఎదురైన పరిస్థితులు ఆమెను ఈ నిర్ణయానికి దారితీశాయా? లేక మరేదైనా కారణం ఉందా? అనే కోణాల్లో పోలీసులు వివరాలను సేకరిస్తున్నారు. ఘటనకు సంబంధించి హాస్టల్ నిర్వాహకులు, పరిచయస్తులు, కుటుంబ సభ్యుల నుంచి కూడా సమాచారం సేకరించే అవకాశం ఉంది. ఈ ఘటనతో హాస్టల్ పరిసరాల్లో విషాద వాతావరణం నెలకొంది. యువతి మృతిపై కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్లు తెలిసింది.

# మాదిగ లాయర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడికి సన్మానం




**జనగామ, ఆగస్టు 21 (భవిషత్త్ ప్రజాపాలన ):** నూతనంగా ఎన్నికైన మాదిగ లాయర్స్ ఫెడరేషన్ జనగామ జిల్లా అధ్యక్షుడు రాగల్ల శ్రీహరిని మాదిగ మేధావుల ఫోరం జనగామ జిల్లా కోఆర్డినేటర్, అధ్యక్షుడు యాసారపు కరుణాకర్, గౌంగళ్ల కుమార్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా యాసారపు కరుణాకర్ మాట్లాడుతూ మాదిగ, మాదిగ ఉపకులాలకు చెందిన సామాన్య ప్రజలకు పోలీస్‌స్టేషన్లు, కోర్టులు, ప్రభుత్వ కార్యాలయాల్లో న్యాయం అందని పరిస్థితుల్లో వారి తరపున పనిచేసి అండగా నిలవాలని శ్రీహరిని కోరారు. బాధితులకు న్యాయ సహాయం అందించడంలో చొరవ చూపాలన్నారు. గౌంగళ్ల కుమార్ మాట్లాడుతూ మంద కృష్ణ మాదిగ అడుగుజాడల్లో నడుస్తూ జనగామ జిల్లా ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని ఆకాంక్షించారు. శ్రీహరి భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని అభిలషించారు. కార్యక్రమంలో గండి ప్రవీణ్‌కుమార్, మహమ్మద్ అబ్దుల్ గఫ్ఫార్ పాల్గొన్నారు.

# గాంధీ భవన్ మీడియా సమావేశంలో టీపీసిసి స్పోక్ పర్సన్ సామ రామ్మోహన్ రెడ్డి




కేటీఆర్ పిల్లలే రాష్ట్రంలో స్కూళ్లు, కాలేజీలు బాగాలేవని అంటున్నారు. పదేళ్ల పాలనలో స్కూళ్లు, కాలేజీల దుస్థితిని వారి పిల్లలే చెప్తున్నారు. స్కిల్ యూనివర్సిటీ, తెలంగాణ పబ్లిక్ స్కూల్, అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లను కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొస్తే, విద్యార్థులను పక్కదారి పట్టిస్తూ బీఆర్ ఎస్, బీజేపీ దిక్కుమాలిన రాజకీయాలు చేస్తున్నాయి. వాళ్ల పిల్లలు విదేశాల్లో బాగా చదువుకోవాలి, ఇక్కడ విద్యార్థుల జీవితాలు నాశనం కావాలా, విద్యార్థులను రెచ్చ గొట్టి వారిని పక్క దారి పట్టించే నీచ రాజకుయాలు ఇక మానుకోవాలి. ఉన్నత విద్యను రాష్ట్రానికి తీసుకొచ్చేందుకు సీఎం విదేశీ పర్యటన చేస్తున్నారు. అమెరికాలో అందిస్తున్న విద్యను ఇక్కడికి తీసుకురావాలని సీఎం భావిస్తున్నారు. కానీ కేంద్రం నిరాకరణతో సీఎం అమెరికా పర్యటన రద్దు అయ్యింది మూసి ప్రక్షాళన, మెట్రో విస్తరణ, హిల్ట్ పాలసీని అడ్డుకున్న బీ ఆర్ ఎస్ బీజేపీ విద్యను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారు. పాలిటెక్నిక్ విద్యార్థులకు ఇంజనీరింగ్ ప్రవేశం లేదంటూ తప్పుడు ప్రచారాలతో విద్యార్థులను రెచ్చ గొట్టారు. విద్యార్థుల నైపుణ్యాలను పెంచేందుకు ప్రభుత్వం శక్తి స్కీం ను తీసుకొచ్చింది. ప్రభుత్వం తీసుకొస్తున్న మార్పులతో పాలిటెక్నిక్ అడ్మిషన్లు పెరుగుతున్నాయి. అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ల ద్వారా ఉద్యోగ అవకాశాలు పెరుగుతున్నాయి . పిల్లలకు మంచి చేయాల్సింది పోయి బీ ఆర్ ఎస్, బీజేపీ పాపం చేస్తున్నాయి. స్కూళ్లకు బీజేపీ ఎప్పుడైనా ప్రాధాన్యత ఇచ్చిందా.

# కొండమల్లేపల్లిలో కోలాహలంగా VDN కన్వెన్షన్ హాల్ ప్రారంభోత్సవం - ప్రముఖుల సందడి



● శుభారంభం.. శుభాకాంక్షల వెల్లువ - ఘనంగా కన్వెన్షన్ హాల్ ప్రారంభోత్సవం

**కొండమల్లేపల్లి భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి తిరుపతి వద్య:** దేవరకొండ నియోజకవర్గం కొండమల్లేపల్లి - సాగర్ ప్రధాన రహదారి పక్కన మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీ వద్యా




దేవేందర్ నాయక్ గారి నూతన VDN A/c కన్వెన్షన్ హాల్ ప్రారంభోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ శాసనమండలి చైర్మన్ శ్రీ గుత్తా సుఖేందర్ రెడ్డి గారు, దేవరకొండ ఎమ్మెల్యే శ్రీ నేనావత్ బాలు నాయక్ గారు, నల్గొండ డీసీసీ అధ్యక్షులు శ్రీ పున్న కైలాస్ నేతగారు హాజరై రిబ్బన్ కట్ చేసి హాల్‌ను లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు రామవత్ రవీంద్ర కుమార్ గారు, గార్లపాటి జితేందర్ రెడ్డి గారు, బిల్యా నాయక్ గారు, లాలు నాయక్ గారు, వివిధ రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, బంధుమిత్రులు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని దేవేందర్ నాయక్ గారికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ముఖ్య అతిథులు మాట్లాడుతూ.. కొండమల్లేపల్లి ప్రాంత ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అన్ని వర్గాల వారికి అందుబాటులో ఉండేలా, ఆధునిక సౌకర్యాలతో ఎణచీ కన్వెన్షన్ హాల్ ను నిర్మించడం ఎంతో అభినందనీయమన్నారు. ఈ ప్రాంతంలో ఇటువంటి అత్యాధునిక కన్వెన్షన్ హాల్ రావడం శుభపరిణామమని కొనియాడారు.

# గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం






**హైదరాబాద్, ఆగస్టు 21(భవిష్యత్ ప్రజాపాలన):** సుమారు 35-40 సంవత్సరాల వయస్సు కలిగిన గుర్తుతెలియని భిక్షాటన చేసే వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉండగా, స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అంబులెన్స్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా, అప్పటికే సదరు వ్యక్తి మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి వివరాలు, ఆచూకీకి సంబంధించిన ఎలాంటి సమాచారం లభించలేదు. ఘటనపై పోలీసులు క్రైమ్ నంబర్ 502/2026, సెక్షన్ 194 దీచీూా కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడిని గుర్తించేందుకు పోలీసులు చర్యలు చేపడుతున్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు లేదా అతని కుటుంబ సభ్యులు ఎవరైనా ఉంటే సంబంధిత పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని పోలీసులు కోరారు.

# కాలే శ్రీకాంత్‌కు ఘన సన్మానం.. జన్మదిన శుభాకాంక్షల వెల్లువ



**భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి ఆర్. శ్రీనివాస్ ఆగస్టు 21:** చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య తనయుడు, మొయినాబాద్ మాజీ జెడ్పీటీసీ కాలే శ్రీకాంత్ జన్మదినాన్ని పురస్కరించుకుని చేవెళ్లలో శంకర్‌పల్లి మున్సిపల్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ చంద్రమౌళి, శంకర్‌పల్లి మండల కాంగ్రెస్ ప్రెసిడెంట్ బొల్లారం వెంకటరెడ్డి, డీసీసీ వైస్ ప్రెసిడెంట్ చేకూర్తి గోపాల్‌రెడ్డి శ్రీకాంత్‌ను ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కాలే శ్రీకాంత్ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో మరెన్నో జన్మదిన వేడుకలు జరుపుకోవాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో శంకర్‌పల్లి మున్సిపల్ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, సర్పంచులు, ఉపసర్పంచులు, మాజీ సర్పంచులు,మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, మైనారిటీ నాయకులు, శంకర్‌పల్లి మున్సిపల్, మండల కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి అవినీతి జరగలేదు



**మచ్చ స్వాతి**

**భవిష్యత్ ప్రజాపాలన జనగాం జిల్లా:** కొడకండ్ల మండలంలోని ఏడునుతుల గ్రామం లో ఐకేపి ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అక్రమాలు జరుగుతున్నాయంటూ నవోదయ వివో గ్రూప్ సభ్యురాలు మచ్చా యకమ్మ కోడలు మచ్చా స్వాతి గత వారంలో అవినీతి జరిగిందంటూ ఆరోపించారు

**మచ్చ స్వాతి మాట్లాడుతూ...,**

నేను గ్రూప్ సభ్యురాలు కాదని మా ఆత్మమ్మ గ్రూప్ సభ్యురాలు అనీ మా అత్తమ్మకు ఆరోగ్యం బాగాలేందున నేను వెళ్లాను అనీ కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి అవినీతి జరగలేదని ఐకెపి సెంటర్ నిర్వహిస్తున్న సమయంలో బస్తాలు లెక్కపెట్టే క్రమంలో రాయి తగిలి కింద పడిపోవడం వలన నాకు గాయమై 15 రోజుల వరకు నేను ఇంటి వద్దనే రెస్టు తీసుకుని ఉండడం వలన లెక్కలు మిస్ అయ్యాయి అనుకుని తప్పుడు ఆరోపణలు చేశానని ఈరోజు మేము మా గ్రూప్ సభ్యులను కూర్చొని లెక్కలు చేసుకోవడం జరిగిందని ఎలాంటి అవినీతి జరగలేదని తెలిసింది అన్నారు.

# వినియోగదారుల మన్ననలు అందుకోవాలి మలాబార్ రీ లాంచ్‌లో కే.జి.ఎఫ్ ఫేమ్ శ్రీనిధి శెట్టి






**హైదరాబాద్, ఆగస్టు 21(భవిష్యత్ ప్రజాపాలన):** నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ వినియోగదారుల మన్ననలు అందుకోవాలని పంజాగుట్టలోని మలబార్ డైమండ్ అండ్ జ్యువలరీ షోరూం రీ లాంచ్ లో పాల్గొన్న కేజిఎఫ్ ఫేమ్ శ్రీనిధి శెట్టి అన్నారు.సోమాజిగూడలో నూతన హంగులతో ఆధునీకరించిన మలబార్ షో రూం ను ముఖ్య అతిధిగా హాజరైన ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మలబార్ గోల్డ్ బ్రాండ్ అంబాసిడర్ గా ఉన్న శ్రీనిధి శెట్టి మాట్లాడుతూ బంగారం ధరలు ఆకాశాన్ని అంటుతున్నందున నాణ్యతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని నిర్వాహకులకు సూచించారు. ఆభరణాలతో మగవలు మహిళల అందం రెట్టింపు అవుతుందని అన్నారు. శ్రావణ శుక్రవారం ఆభరణాల షోరూంలో ప్రారంభించడం ఎంతో ఆనందంగా ఉందని తెలియజేశారు.

# జన్వాడ గేటు వద్ద గంజాయి పట్టివేత.. నిందితుడి అరెస్ట్





**భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి మోకిల ఆగస్టు 20 చేవెళ్ల నియోజకవర్గం :** మోకిల పోలీసులకు అందిన విశ్వసనీయ సమాచారంతో జన్వాడ గేటు సమీపంలో పోలీసులు తనిఖీలు నిర్వహించగా, ఏపీ 29 బీఎక్స్ 3751 నంబర్ గల స్ప్లెండర్ ప్లస్ బైక్‌పై వస్తున్న జగన్నాథ్ మండల్ (42)ను అదుపులోకి తీసుకుని తనిఖీ చేశారు. అతని వద్ద ఉన్న హ్యాండ్ బ్యాగ్‌లో రెండు పార్సిళ్లుగా ఉన్న మొత్తం 2 కిలోల 80 గ్రాముల ఎండు గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అలాగే నిందితుడి మొబైల్ ఫోన్, బైక్‌తో పాటు గంజాయి తరలించేందుకు ఉపయోగించిన హ్యాండ్ బ్యాగ్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.విచారణలో నిందితుడు ఒడిశా ప్రాంతం నుంచి గంజాయిని తీసుకు వచ్చి జన్వాడ ప్రాంతంలోని కూలీలకు విక్రయించేందుకు తరలించినట్లు వెల్లడైంది. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి న్యాయస్థానం ముందు హాజరుపరచగా రిమాండ్‌కు తరలించారు. ఘటనపై తదుపరి దర్యాప్తు కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు.

# పాము కాటుతో దుక్కిటేద్దు మృతి



**భవిష్యత్ ప్రజాపాలన పాలకుర్తి రిపోర్టర్ రమేష్:** పాలకుర్తి మండలంలోని దర్దపల్లి గ్రామము దుబ్బ తండ గ్రామపంచాయతీ పరిధిలో గుగులోత్ మూన్య తండ్రి సర్యా కు చెందిన, దుక్కి టేద్దు పాము కాటుతో మృతి చెందిన ఘటన మండలంలోని దుబ్బ తండాలో శుక్రవారం చోటు చేసుకుంది. రోజు వారి మాదిరిగా మేత మేసిన అనంతరం పాము కాటుకు గురైందని, బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశారు. దాని విలువ సుమారు లక్ష రూపాయలు విలువ ఉంటుందన్నారు. ప్రభుత్వం వారికి కొంత ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని స్థానికులు కోరారు.

# కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ అనుమతి నిరాకరించిన నేపథ్యంలో

## ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం అమెరికా పర్యటన రద్దయింది



**హైదరాబాద్ భవిష్యత్ ప్రజాపాలన సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ మొకిరాల ఉద్రాసీన్ ఆగస్టు 21 :** ముఖ్యమంత్రి నేతృత్వంలోని ప్రతినిధి బృందం యూకే, అమెరికా దేశాల పర్యటనకు వెళ్లాల్సి ఉండగా, రాజకీయ కోణంలో అనుమతి నిరాకరించబడిందని కేంద్రం తెలియజేసిన నేపథ్యంలో రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనను రద్దు చేసుకున్నారు. విధివిధానాలు, ప్రోటోకాల్ ప్రకారం ముఖ్యమంత్రి యూకే, అమెరికా పర్యటనకు రాష్ట్రం కేంద్ర అనుమతి కోరింది. తొలుత యూకే పర్యటనకు మాత్రమే అనుమతి లభించింది. అధికారిక ప్రతినిధి బృందం యూకేకు చేరుకున్న తర్వాత అమెరికా పర్యటనకు అనుమతి ఇవ్వడం లేదని కేంద్రం రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేసింది. తెలంగాణ అభివృద్ధి, విద్యా రంగ పురోగతికి, అలాగే వికసిత్ భారత్ నిర్మాణానికి తోడ్పడే ఈ పర్యటనకు "రాజకీయ కారణాలతో అనుమతి నిరాకరించడం" పట్ల ముఖ్యమంత్రి తీవ్ర విస్మయం వ్యక్తం చేశారు. అయినప్పటికీ కేంద్ర నిర్ణయాన్ని గౌరవిస్తూ లండన్ నుంచి హైదరాబాద్‌కు తిరిగి రావాలని, బోస్టన్, అమెరికా పర్యటనకు వెళ్లకూడదని నిర్ణయించుకున్నారు. కేంద్ర నిర్ణయంపై ముఖ్యమంత్రి స్పందిస్తూ, "ఈ పర్యటన ఉద్దేశం ఒక్కటే. కేంద్రం తీసుకొచ్చిన నూతన విద్యా విధానంలో భాగంగా ప్రపంచంలోని ప్రఖ్యాత విద్యా సంస్థలను భారత్‌కు, తెలంగాణకు, హైదరాబాద్‌కు తీసుకురావడం. అత్యుత్తమ ఐవీ లీగ్ విశ్వవిద్యాలయాలను, ప్రపంచంలోని అగ్రశ్రేణి విద్యాసంస్థల నుంచి విద్య, నైపుణ్యాలు, శిక్షణ పొందాలన్న మన యువత ఆకాంక్షలకు ఇవి సమాధానంగా నిలిచేవి" అని పేర్కొన్నారు. "దేశ నిర్మాణం, యువత భవిష్యత్తు విషయానికి వస్తే అందరూ రాజకీయాలు, ఎన్నికలకు అతీతంగా ఆలోచించాలని నేను ఎప్పుడూ విశ్వసిస్తాను" అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. వివిధ విశ్వవిద్యాలయాలతో ఇప్పటికే సంప్రదింపులు జరిపిన నేపథ్యంలో అమెరికా పర్యటనకు సంబంధించిన కార్యక్రమాలను అధికారుల బృందం కొనసాగించాలని, ఆయా విశ్వ విద్యాలయాలతో అవసరమైన అన్ని అవగాహన ఒప్పందాలు, భాగస్వామ్య ఒప్పందాలను పూర్తి చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. "హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దుతాం. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి హెచ్‌సీయూ, జేఎన్‌టీయూ తదితర విశ్వవిద్యాలయాల ఏర్పాటు హైదరాబాద్‌ను అత్యుత్తమ మానవ వనరుల కేంద్రంగా మార్చింది. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్... ఒక పాఠశాల ప్రపంచానికి నాయకత్వం వహించగలమని నిరూపించింది. అక్కడి నుంచి ప్రపంచంలోని గొప్ప టెక్ నాయకుల్లో కొందరు రూపుదిద్దుకున్నారు. ఐఐటీ, ఐఎస్‌బీ, ఐఐఐటీ, నల్సార్ వంటి సంస్థల ఏర్పాటుతో హైదరాబాద్ అగ్రశ్రేణి కార్పొరేషన్లు, వాటి గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లను ఆకర్షించగలిగింది. ఇప్పుడు ప్రపంచంలోని ప్రఖ్యాత విద్య, నైపుణ్య సంస్థలకు హైదరాబాద్‌ను కేంద్రంగా మార్చి, 21వ శతాబ్దపు మన ప్రగతి ప్రయాణానికి శక్తినిస్తాం" అని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పేర్కొన్నారు. షెడ్యూల్ ప్రకారం యూకేలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, లండన్ బిజినెస్ స్కూల్, యూనివర్సిటీ ఆఫ్ లండన్ తదితర సంస్థలను సందర్శించి, వాటి ప్రతినిధులతో సమావేశాలు కొనసాగించనున్నారు. యునైటెడ్ కింగ్‌డమ్‌లోని ప్రముఖ క్రీడా సంస్థలు, నైపుణ్యాభివృద్ధి రంగ నాయకులతో సమావేశమై, తెలంగాణతో భాగస్వామ్యాలను అధికారికంగా ఖరారు చేసేందుకు ఈ పర్యటనలో ప్రయత్నిస్తారు. "హైదరాబాద్‌ను ప్రపంచంలోని అగ్రశ్రేణి నగరాల్లో ఒకటిగా తీర్చిదిద్దాలన్నది నా సంకల్పం, ప్రయత్నం. ఒక సాధారణ భారతీయుడు హైదరాబాద్‌లోనే హార్వర్డ్, ఆక్స్‌ఫర్డ్ లేదా ఎంఐటీ, ఎల్‌బీఎస్, ఎల్ఎస్ఈ వంటి ప్రపంచ స్థాయి సంస్థల నుంచి విద్య, సర్టిఫికేషన్ పొందగలగాలి. ఎందుకంటే చాలా మంది నాయకులు తమ పిల్లలను విదేశాలకు పంపాలని కోరుకున్నారు. కానీ నేను ప్రపంచంలోని అత్యుత్తమ విద్యా సంస్థలను భారత్‌కు తీసుకురావాలని అభిలషిస్తున్నాను" అని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# ఐదేళ్లకోసారి వచ్చే అపురూపం..

# మొలకల జాతర!







- **తీజ్ అంటేనే తీయని సంబురం.. చేతిలో మొలకలు.. మదిలో మొక్కులు!**
- **పలుతండాలో తీజ్ సందడి.. సంప్రదాయ దుస్తుల్లో మెరిసిన చిన్నారులు**

**నల్లగొండ జిల్లా :** చింతపల్లి మండల పరిధిలోని పలు గ్రామపంచాయతీల్లో బంజారా గిరిజనుల అత్యంత పవిత్రమైన తీజ్ పండుగ సంబరాలు అంబరాన్నంటాయి. ఐదేళ్లకోసారి వచ్చే ఈ అపురూప పండుగను తండావాసులు 9 రోజుల పాటు అత్యంత నిష్ఠతో, ఘనంగా జరుపుకోవడం ఆనవాయితీ. పెళ్లికాని యువతులు పవిత్రంగా జరుపుకునే ఈ పండుగను 'మొలకల పండుగ' అని కూడా పిలుస్తారు. గోధుమలతో మొలకలను పెంచి, వెదురు బుట్టల్లో చేతిలో పట్టుకొని ఆడపడుచులు చేసే ప్రత్యేక పూజలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ పండుగ కోసం చిన్నారుల నుండి వృద్ధుల వరకు స్కూళ్లు, కాలేజీలకు సెలవు పెట్టి మరీ తండాలకు చేరుకుంటారు. తీజ్ వేడుకల్లో భాగంగా చిన్నారులు, పెద్దలు తమ ప్రత్యేక సాంప్రదాయ దుస్తులతో మెరిశారు. మీరు ఫోటోలో చూస్తున్నట్లుగా వయసు మళ్లిన అవ్వల నుండి చిన్నారుల వరకు చేతిలో మొలకల బుట్టలతో పాల్గొని సందడి చేశారు. చిన్నా పెద్దా తేడా లేకుండా తండా అంతా ఒకే కుటుంబంలా కలిసి ఈ వేడుకను జరుపుకోవడం విశేషం, బంజారా సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టే ఈ తీజ్ పండుగ, వారి ఐక్యతకు ప్రతీకగా నిలుస్తోందని చింతపల్లి భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి తిరుపతి వద్య తెలిపారు.

# అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటరు జాబితాలో నమోదు చేయాలి

## ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా, వేగవంతంగా పూర్తి చేయాలి

- **క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్**











**నాగర్ కర్నూల్ :** తెల్కపల్లి భవిష్యత్ ప్రజా పాలన జర్నలిస్ట్ రఘు సాగర్ : అర్హత కలిగిన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ ఆదేశించారు. ఓటరు జాబితా, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను ఎలాంటి లోపాలకు తావులేకుండా పకడ్బందీగా, పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ నియోజకవర్గ పరిధిలోని తెలకపల్లి మండల కేంద్రంలో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ క్షేత్రస్థాయిలో పర్యటించారు. మండలంలోని 197, 201 పోలింగ్ కేంద్రాల పరిధిలో 2002 నాటి ఓటరు జాబితాను ప్రస్తుత ఓటరు జాబితాతో అనుసంధానం చేసే క్రమంలో గుర్తించిన మ్యాపింగ్ కాని ఓటర్లు, అనామలీస్ జాబితాలో ఉన్న ఓటర్లకు నోటీసులు జారీ చేస్తున్న ప్రక్రియను ఆయన స్వయంగా పరిశీలించారు. 197వ పోలింగ్ కేంద్రం పరిధిలోని ఓటరు ఎం.డి. అక్బర్‌కు నోటీసు జారీ చేస్తున్న ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. 2002 నాటి ఓటరు జాబితాలో నమోదైన పేరుకు, ప్రస్తుతం ఉన్న ఓటరు జాబితాలో నమోదైన పేరుకు సరిపోలిక లేకపోవడంతో సంబంధిత ఓటరును అనామలీస్ జాబితాలో గుర్తించి నోటీసు జారీ చేసినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. నోటీసుల జారీ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూడాలని కలెక్టర్ సూచించారు. ప్రతి ఓటరుకు సరైన సమాచారం అందేలా, సంబంధిత వ్యక్తికి నోటీసు చేరేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఓటరు తన అర్హతను నిరూపించుకునేందుకు అవసరమైన ధ్రువపత్రాలను సమర్పించేందుకు తగిన అవకాశం కల్పించాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ మాట్లాడుతూ....... ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా బీఎల్‌వోలు పోలింగ్ కేంద్రాల పరిధిలోని ఓటర్లకు నోటీసులు జారీ చేసినప్పుడు, సంబంధిత ఓటర్లు ప్రభుత్వం జారీ చేసిన, ఎన్నికల సంఘం నిర్దేశించిన 11 రకాల అధికారిక ధ్రువపత్రాల్లో తమకు వర్తించే ఆధారాలను బీఎల్‌వోలకు సమర్పించాలని సూచించారు. ఓటర్లు సమర్పించిన ధ్రువపత్రాలను అధికారులు నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించాలని కలెక్టర్ తెలిపారు. ఆధారాలు సక్రమంగా ఉన్నట్లు నిర్ధారణ అయిన అనంతరం సంబంధిత వివరాలను భారత ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసి, అర్హులైన వారి పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసే ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. ఓటర్ల నుంచి ధ్రువపత్రాలు స్వీకరించిన అనంతరం వాటి పరిశీలన, ఆన్‌లైన్‌లో వివరాల నమోదు, తదుపరి ప్రక్రియలో ఎలాంటి జాప్యం జరగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. తెలకపల్లి మండల పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో 2002 నాటి ఓటరు జాబితా ఆధారంగా ఇప్పటికే గుర్తించిన మ్యాపింగ్ కాని ఓటర్లు, అనామలీస్ జాబితాలో ఉన్న ఓటర్లకు సంబంధించి జనరేట్ చేసిన దరఖాస్తులు, నోటీసులు సంబంధిత ఓటర్లకు చేరేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తహసీల్దార్‌ను ఆదేశించారు. ఎవరైనా ఓటరు అందుబాటులో లేకపోతే, వారికి సమాచారం చేరేలా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. నోటీసుల జారీ ప్రక్రియ పూర్తయిందా లేదా, ఓటర్లు తమ ఆధారాలను సమర్పించారా లేదా, సమర్పించిన ధ్రువపత్రాలను పరిశీలించారా లేదా అనే అంశాలపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఓటరు జాబితాలోని ప్రతి పేరును నిబంధనల ప్రకారం పరిశీలిస్తున్నప్పటికీ, అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరు పేరు కూడా అనవసరంగా జాబితా నుంచి తొలగిపోకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. అదే సమయంలో అర్హత లేని లేదా అనుమానాస్పదంగా ఉన్న నమోదులను నిబంధనల ప్రకారం పరిశీలించి, సంబంధిత ఓటర్లకు తమ వివరణ, ఆధారాలు సమర్పించుకునే అవకాశం కల్పించాలని, ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా మొత్తం ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఓటర్లు సమర్పించిన ధ్రువపత్రాలను సంబంధిత అధికారులు ఆలస్యం చేయకుండా పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. పరిశీలన పూర్తయిన వెంటనే అర్హత కలిగిన ఓటర్ల వివరాలను ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసి నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిని అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షించాలని, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను గుర్తించి త్వరితగతిన పరిష్కరించాలని తెలిపారు. బీఎల్‌వోలు, బిఎల్ఏలు, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పరస్పర సమన్వయంతో పనిచేసి ప్రక్రియను నిర్దేశిత సమయంలో పూర్తి చెయ్యాలని కలెక్టర్ తెలిపారు. ఓటరు జాబితా సవరణకు సంబంధించి క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను అక్కడికక్కడే గుర్తించి పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఓటర్లకు ఎస్ఐఆర్ ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించాలని, నోటీసులు అందుకున్న వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, తమకు సంబంధించిన ఆధారాలను సమర్పించి ప్రక్రియలో సహకరించేలా వారికి వివరించాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియలో ఓటరు జాబితా అత్యంత కీలకమైనదని, జాబితా సవరణలో ఖచ్చితత్వం, పారదర్శకత, నిబంధనల అమలుకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు స్పష్టం చేశారు. తెలకపల్లి మండల పరిధిలో ఉన్న అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో 2002 ఓటర్ జాబితా ప్రకారం మ్యాపింగ్ కానీ వారు 582 మంది, అనాలిసిస్ జాబితా ప్రకారం 6974 మందిని గుర్తించడం జరిగిందని 7566 మందికి నోటీసులు జనరేటర్ చేసి వారందరికీ నోటీసులను అందజేస్తున్నట్లు తాహసిల్దార్ కలెక్టర్‌కు తెలిపారు.

# న్యాయపరమైన గిరిజన సమస్యలను వెంటనే పరిష్కరించుకొనుటక

## ప్రత్యేక ఎస్టీ కమిషన్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర అధ్యక్షులు అంగోత్ రాంబాబు నాయక్ డిమాండ్ చేశారు





**హైదరాబాద్ భవిష్యత్ ప్రజాపాలన సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ ఆగస్టు 21 :** శుక్రవారం నాడు బషీర్బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నూతన తండ పంచాయతీలను రెవెన్యూ పంచాయతీలుగా గుర్తించే ప్రక్రియను పరిశీలించి వెంటనే ప్రారంభించాలని ప్రతి తండా పంచాయితీకి జనాభా విస్తరా విస్తరణ అవసరల ఆధారంగా ప్రత్యేక అభివృద్ధికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు సర్పంచులకు ఏ విధంగా గౌరవేతను ఇస్తున్నారో అదే విధంగా గ్రామపంచాయతీలో గెలుపొందిన వార్డ్ మెంబర్లను గుర్తించి ప్రతి నెల గౌరవ వేతనం ఇవ్వాలని ఆయన ముఖ్యమంత్రిని రేవంత్ రెడ్డిని కోరారు ఈ సమావేశంలో సేవాలాల్ సేన రాష్ట్ర నేతలు ప్రధాన కార్యదర్శి వి రేఖ నాయక్, ఉపాధ్యక్షులు పరుశురాం, పి. రాణి నాయక్, జిహెచ్ గణేష్ నాయక్, శ్రీనివాస్ నాయక్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

# వ్యాధి బారిన పడకముందే జాగ్రత్తలు తీసుకోవాలి



- **'ప్రివెన్షన్ ఈజ్ ది ఓన్లీ క్యూర్'.. దేశవ్యాప్తంగా ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు: ఆచార్య మనీష్**

**హైదరాబాద్, ఆగస్టు 21 (భవిష్యత్ ప్రజాపాలన):** వ్యాధులు వచ్చిన తర్వాత చికిత్స పొందడం కంటే, వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడమే ఉత్తమమని ఆయుర్వేద నిపుణులు ఆచార్య మనీష్ అన్నారు. దేశవ్యాప్తంగా ప్రజలకు ఆరోగ్యం, ఆహారపు అలవాట్లు, జీవనశైలిపై అవగాహన కల్పించేందుకు తాను, తన వైద్య బృందంతో కలిసి ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆచార్య మనీష్ మాట్లాడుతూ.. దేశంలో కిడ్నీ, లివర్, గుండె సంబంధిత వ్యాధులు, క్యాన్సర్, మధుమేహం, రక్తపోటు వంటి సమస్యలు పెరుగుతున్నాయని అన్నారు. ప్రజలు అనారోగ్యానికి గురైన తర్వాత చికిత్స కోసం పరుగులు పెట్టకుండా, ముందుగానే ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని సూచించారు. 'ప్రివెన్షన్ ఈజ్ బెటర్ ద్యాన్ క్యూర్' కంటే 'ప్రివెన్షన్ ఈజ్ ది ఓన్లీ క్యూర్' అనే నినాదంతో తమ ప్రచారాన్ని కొనసాగిస్తున్నామని చెప్పారు. దేశవ్యాప్తంగా తమకు 120కి పైగా ఆయుర్వేద క్లినిక్‌లు, ఆసుపత్రులు, వెల్‌నెస్ కేంద్రాలు ఉన్నాయని ఆచార్య మనీష్ తెలిపారు. హైదరాబాద్‌తో పాటు బెంగళూరు, చెన్నై, పాట్నా, కోల్‌కతా, ఢిల్లీ, ముంబై, చండీగఢ్, లూధియానా, డెహ్రాడూన్ తదితర నగరాల్లో ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఒక బ్లడ్ క్యాన్సర్ బాధితుడి కేసును ప్రస్తావించిన ఆయన.. వైద్యులు తక్కువ కాలం మాత్రమే జీవించే అవకాశం ఉందని చెప్పిన వ్యక్తి తమ వద్దకు వచ్చిన తర్వాత ఆహారం, జీవనశైలిలో మార్పులు చేసుకున్నారని, ప్రస్తుతం ఆరోగ్యంగా ఉన్నారని తెలిపారు. చికిత్సతో పాటు ఆహార నియమాలు, జీవనశైలి మార్పులు ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయని అన్నారు. అయితే క్యాన్సర్ వంటి తీవ్రమైన వ్యాధులకు సంబంధించి వ్యక్తిగత అనుభవాలను సాధారణ వైద్యపరమైన నిర్ధారణగా పరిగణించరాదని, అర్హత కలిగిన వైద్యుల సలహా తీసుకోవాలని సూచించారు. వేల సంవత్సరాల క్రితమే ఆయుర్వేదంలో ఆరోగ్య పరిరక్షణకు సంబంధించిన విధానాలను సూచించారని, పంచకర్మ వంటి విధానాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ఆచార్య మనీష్ అన్నారు. రాత్రి వేళల్లో ఆలస్యంగా భోజనం చేయకుండా, ఆహారపు అలవాట్లపై నియంత్రణ పాటించాలని, క్రమం తప్పకుండా శారీరక వ్యాయామం చేయాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం కూడా ఆయుర్వేద వైద్యాన్ని ఆరోగ్య పథకాల్లో మరింత విస్తృతంగా చేర్చాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు, సాధారణ ప్రజలకు ఆయుర్వేద చికిత్స అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. హైదరాబాద్‌లో తమ ఆయుర్వేద కేంద్రం సోమాజిగూడలోని రాజ్‌భవన్ రోడ్ లో ఉందని తెలిపారు. ప్రజలు అక్కడ వైద్యులను సంప్రదించి ఆరోగ్యానికి సంబంధించిన సలహాలు, సూచనలు పొందవచ్చని చెప్పారు. వ్యాధి తీవ్రత పెరిగిన తర్వాత చికిత్స పొందడం కంటే ముందుగానే ఆరోగ్యంపై దృష్టి పెట్టడం ద్వారా అనేక సమస్య



# తెలంగాణ రాష్ట్ర మెడికల్ సీట్లు స్థానికులకే ఇవ్వాలని

## నీట్ పేరెంట్స్ పోరాటకమిటీ రాష్ట్ర నేతలు మధుబాబు, కంచర్ల శివారెడ్డి డిమాండ్ చేశారు






**హైదరాబాద్ భవిష్యత్ ప్రజాపాలన సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ ఆగస్టు 21 :** శుక్రవారం నాడు బషీర్బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 150 జీవో వల్ల తెలంగాణ రాష్ట్రానికి తీరని అన్యాయం జరుగుతుందని మన సీట్లను కన్వీనర్ కోట కింద 6000 సీట్లను ఇతర రాష్ట్రాల వారు నాలుగు సంవత్సరాలు తెలంగాణ రాష్ట్రంలో జీవించి 9, 10 ,11, 12 తరగతి చదివి సీట్లు కొట్టుకుపోతున్నారని వారు ఆరోపించారు తమిళనాడు కేరళ కర్ణాటక మధ్యప్రదేశ్ రాజస్థాన్ ఢిల్లీకి చెందినవారు ఎక్కువగా తెలంగాణ రాష్ట్రంలో సీట్లను కొట్టుకుపోతున్నారని వారు ఆరోపించారు తల్లిదండ్రులను ఆధారాలతో కొడుకులకు బిడ్డలకు స్థానికత ఆధారంగా సీట్లు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు బస్సు ఎక్కినప్పుడు ఆధార్ కార్డు కావాలని ప్రజలు ఆధార్ కార్డు కావాలని ఆర్టీసీ అధికారులు కోరుతున్నారని, తెలంగాణ రాష్ట్రంలో చెందిన వారికి ఒకటి నుంచి 12వ తరగతి వరకు చదివిన వారిని స్థానికులుగా గుర్తించి వారికి 60 సీట్ల కన్వీనర్ కోట ఇవ్వాలని వారు కోరారు అదేవిధంగా ఈ విషయంలో ముఖ్యమంత్రిని వేడుకోవడం జరుగుతుందని తమ పిల్లలకు న్యాయం చేయాలని వారు కోరారు తెలంగాణ నీడ్స్ పేరెంట్స్ అసోసియేషన్ న్యాయమైన డిమాండ్లను ముఖ్యమంత్రి పరిష్కరించాలని వారు కోరారు ఈ పాత్రికేయుల సమావేశంలో శ్రీకాంత్ రాజేంద్ర ప్రసాద్, లక్ష్మయ్య చర్ల సాయిలు వారు మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని వారు కోరారు.

# వరాల తల్లి మమ్మల్ని దీవించమ్మా..

- ●సాయిమందిరంలో శాస్త్రోక్తంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలు
- ●49 మహిళా కుటుంబాలచే వరలక్ష్మి వ్రతాలు
- ●వరలక్ష్మి మాతను పూజించిన వారికి అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయి-సాయి సంస్థ కన్వీనర్ బాలరాజు
- ●భక్తి శ్రద్ధలతో పాల్గొన్న మహిళలు,భక్తులు









**నాగర్ కర్నూల్: భవిష్యత్ ప్రజా పాలన జర్నలిస్ట్ రఘు సాగర్ :** జిల్లా కేంద్రంలోని భగవాన్ శ్రీ సత్యసాయి మందిరంలో శ్రావణమాస మూడవ శుక్రవారం వేద మంత్రోచ్చారణల మధ్య సామూహిక వరలక్ష్మీ వ్రతాలు భక్తిశ్రద్ధలతో మహిళలు నిర్వహించినట్లు సత్యసాయి సేవా సమితి కన్వీనర్ తెలిపారు. సత్యసాయి మందిర ఆలయ అర్చకుడు రాజశేఖర్ శర్మ వరలక్ష్మీ వ్రతాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆయన వ్రత విశిష్టతను వివరిస్తూ..పరమ శివుడిని పార్వతి దేవి వరంగా కోరిన వ్రతమే వరలక్ష్మీ వ్రతం అని ఆయన అన్నారు. శ్రీసూక్తం ప్రధానంగా చారుమతి బ్రాహ్మణ మహిళ మొదట ఆచరణతోపూజించి,భారతీయులకు అందించిన వరమని తెలిపారు. అమ్మవారిని వివిధ విశేష పూజాద్రవ్యాలు, ప్రత్యేక మంత్రములతో పూజించిన వారికి అష్టైశ్వర్యాలు వారి కుటుంబం సౌభాగ్యం, ఆరోగ్యంగా ఉంటుందని ధన,ధాన్య, ధైర్య, సిద్ధి, శౌర్య, విద్య, సంతానం, వరాలు, ఐశ్వర్యాలు పొందుటకు అత్యంత సులభమైన మార్గం వరలక్ష్మీ వ్రతం అని శ్రావణ మాసంలో మహా విష్ణువు జన్మనక్షత్రమైన శ్రవణా నక్షత్రం,శ్రావణ పౌర్ణమి ముందు వచ్చే శుక్రవారం నాడు అమ్మవారిని వరలక్ష్మీ రూపంలో పూజించడం విశిష్ట పుణ్య ఫలితం అందుతుందని వివరించారు. అమ్మవారిని కొలచడం,కొలిచిన వారికి కొంగు బంగారంగా వరాలు ప్రాప్తిస్తుందని తెలిపారు. అనంతరం ఆలయంలో భజనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు ఒకరికి ఒకరు సాంప్రదాయంగా,వాయనాలు, పసుపు, కుంకుమలు, అందజేసుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ సామూహిక భోజనాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ కొండూరు బాలరాజు,మహిళా కన్వీనర్ ఏం.సువర్ణ, సాయి గీత, సుప్రజా, కళ్యాణి, బలమని, అర్చన, నాగలక్ష్మి శ్రీ సాయి ప్రశాంతి చారిటబుల్ ట్రస్ట్ కన్వీనర్ హాకీం విశ్వ ప్రసాద్, కార్యదర్శి ఎలిమే ఈశ్వరయ్య, సాయి భక్తులు ఇందిరమ్మ, శోభా, అరుణ,శారద లలిత, పావని, సరిత, శ్రీను, భాస్కర్, పాండురంగా రెడ్డి, సతీష్, లక్మిపతి,మన్నెపు రెడ్డి,ప్రసాద,రాజు మహిళలు చిన్నారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కూకట్‌పల్లిలో ప్రజల ఆవేదన.. 22A జాబితాలో ప్రభుత్వ అనుమతులతో నిర్మించిన అపార్ట్‌మెంట్లు!

**భవిష్యత్ ప్రజా పాలన, హైదరాబాద్:** కూకట్‌పల్లి పరిధిలోని పలు బహుళ అంతస్తుల నివాస సముదాయాలను 22A జాబితాలో చేర్చడంపై ఫ్లాట్ యజమానులు, నివాసితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ శాఖల నుంచి అవసరమైన అనుమతులు పొందిన అనంతరం ఫ్లాట్లను కొనుగోలు చేసి, బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుని నివసిస్తున్న తమకు ఇప్పుడు 22A నిబంధనలు వర్తింపజేయడం తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నివాసితుల వివరాల ప్రకారం.. కూకట్‌పల్లి పరిధిలోని పలు సర్వే నంబర్లలో ఉన్న రెయిన్బో విస్టాస్ ఫేజ్-1లో 450 ఫ్లాట్లు, రాక్ గార్డెన్‌లో 2,572 ఫ్లాట్లు, మెరీనా స్కైలో 1,280 ఫ్లాట్లు ఉన్నాయని తెలిపారు. ఈ నివాస సముదాయాలను 22ఏ జాబితాలో చేర్చడంతో ఆయా అపార్ట్‌మెంట్లలో నివసిస్తున్న వందలాది కుటుంబాల్లో ఆందోళన నెలకొందని పేర్కొన్నారు.



**ప్రభుత్వ అనుమతులతో కొనుగోలు చేశాం**

ప్రభుత్వ నిబంధనల ప్రకారం అనుమతులు పొందిన ప్రాజెక్టుల్లో తమ జీవితకాల పొదుపుతో ఫ్లాట్లు కొనుగోలు చేశామని, కొంతమంది బ్యాంకుల నుంచి గృహ రుణాలు తీసుకుని ఇళ్లను కొనుగోలు చేశారని నివాసితులు చెబుతున్నారు. అన్ని అనుమతులు ఉన్నాయని భావించి ఫ్లాట్లు కొనుగోలు చేసిన తమపై ఇప్పుడు 22A నిబంధనలు విధించడం వల్ల తమ ఆస్తుల భవిష్యత్తుపై ఆందోళన ఏర్పడిందన్నారు.

**ఫ్లాట్ యజమానుల్లో పెరుగుతున్న ఆందోళన**

22A జాబితాలో తమ నివాస సముదాయాలు చేరడంతో ఫ్లాట్ల క్రయవిక్రయాలు, రిజిస్ట్రేషన్లు, ఆస్తి హక్కులు, బ్యాంకు రుణాలకు సంబంధించిన వ్యవహారాలపై ప్రభావం పడుతుందేమోనని యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాము ఎలాంటి అక్రమ నిర్మాణాలు చేపట్టలేదని, సంబంధిత అనుమతులు ఉన్న ప్రాజెక్టుల్లోనే ఫ్లాట్లు కొనుగోలు చేశామని వారు చెబుతున్నారు. ప్రభుత్వ అనుమతులు, భవన నిర్మాణ అనుమతులు, సంబంధిత రికార్డులను పరిశీలించి వాస్తవ పరిస్థితిని స్పష్టం చేయాలని నివాసితులు అధికారులను కోరుతున్నారు. 22A జాబితాలో ఆయా సముదాయాలను చేర్చడానికి గల కారణాలను ప్రభుత్వం స్పష్టంగా వెల్లడించాలని డిమాండ్ చేస్తున్నారు.

**సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి**

తమ ఆస్తుల విషయంలో నెలకొన్న అనిశ్చితిని తొలగించి, ఫ్లాట్ యజమానులకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు. ప్రభుత్వ అనుమతులతో నిర్మించిన నివాస సముదాయాలకు సంబంధించిన రికార్డులను సమగ్రంగా పరిశీలించి, తప్పులు ఉంటే సరిదిద్దాలని విజ్ఞప్తి చేస్తున్నారు. బ్యాంకు రుణాలు తీసుకుని ఫ్లాట్లు కొనుగోలు చేసిన కుటుంబాలు కూడా ఈ పరిణామంతో తీవ్ర ఆందోళనకు గురవుతున్నాయని నివాసితులు పేర్కొన్నారు. తమ జీవితకాల పొదుపుతో కొనుగోలు చేసిన ఇళ్ల విషయంలో భవిష్యత్తులో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలని వారు కోరుతున్నారు. ప్రభుత్వ అనుమతులతో నిర్మించిన నివాస సముదాయాలను 22ఏ జాబితాలో చేర్చిన అంశంపై పూర్తి స్థాయి పరిశీలన జరిపి, ఫ్లాట్ యజమానుల ఆందోళనలను పరిష్కరించాలని కూకట్‌పల్లి నివాసితులు డిమాండ్ చేస్తున్నారు.

## మూడు గంటల్లోనే దొంగతనం కేసును ఛేదించిన రాయదుర్గం పోలీసులు

# ఇద్దరు నిందితుల అరెస్ట్, బంగారు ఆభరణాలు స్వాధీనం

**హైదరాబాద్:** రాయదుర్గం పోలీసు స్టేషన్ పరిధిలో జరిగిన ఓ దొంగతనం కేసును పోలీసులు కేవలం మూడు గంటల వ్యవధిలోనే ఛేదించి, ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుండి చోరీకి గురైన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. బాధితురాలు మాధురి తెలిపిన వివరాల ప్రకారం... ఆమె తన భర్తతో కలిసి ఉదయం ఆలయానికి వెళ్లి, సాయంత్రం తిరిగి వచ్చేసరికి ఇంటి తాళం మార్చి ఉండటాన్ని గమనించారు. లోపలికి వెళ్లి చూడగా బీరువాలోని నగదు, బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించి వెంటనే డయల్-100కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే పెట్రోల్ మొబైల్ సిబ్బంది చెన్నయ్య, ఖదీర్ సంఘటనా స్థలానికి చేరుకుని ప్రాథమిక పరిశీలన జరిపారు. అనంతరం డీఏ రామ్‌రెడ్డి ఆధ్వర్యంలోని క్రైమ్ బృందం రాత్రిపూట పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలించింది. ఫుటేజ్ ఆధారంగా ఒక మహిళ, ఒక పురుషుడు ఈ చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. అనుమానాస్పదంగా తిరుగుతున్న మహిళను మహిళా కానిస్టేబుల్ సహాయంతో అదుపులోకి తీసుకుని విచారించగా, ఆమె నేరాన్ని అంగీకరించింది. తన దూరపు బంధువు శివ రాఘవేందర్‌తో కలిసి ఈ దొంగతనానికి పాల్పడినట్లు వెల్లడించింది. ఆ సమాచారం, సాంకేతిక ఆధారాల సహాయంతో శివ రాఘవేందర్‌ను కూడా పోలీసులు వెంటనే అదుపులోకి తీసుకున్నారు.




**అరెస్టయిన నిందితుల వివరాలు:**

**కామేటి లక్ష్మి (37): వంటమనిషి, నివాసం:** మణికొండ మర్రిచెట్టు, రాయదుర్గం (స్వస్థలం: జాలిహాల్ క్యాంప్, సింధనూర్, రాయచూర్, కర్ణాటక).

**వాకలపూరి శివ రాఘవేందర్ (29):** సెక్యూరిటీ గార్డ్, నివాసం: శ్రీ మేధా మెన్స్ హాస్టల్, దర్గా, రాయదుర్గం (స్వస్థలం: రాయచూర్, కర్ణాటక).

**స్వాధీనం చేసుకున్న సొత్తు:**

2 బంగారు బ్రాస్‌లెట్లు

2 బంగారు గొలుసులు (చైన్లు)

బాధితుల నుండి పిర్యాదు అందిన వెంటనే సమర్థవంతంగా స్పందించి, సాంకేతిక పరిజ్ఞానం మరియు సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా తక్కువ సమయంలోనే కేసును ఛేదించిన రాయదుర్గం ఇన్స్పెక్టర్, డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ మరియు క్రైమ్ బృందాన్ని కూకట్‌పల్లి డిసిపి మేడమ్, ఉన్నతాధికారులు అభినందించారు. నిందితులను జ్యుడీషియల్ రిమాండ్ నిమిత్తం గౌరవ న్యాయస్థానంలో హాజరుపరిచారు. ఇల్లు ఖాళీ చేసి బయటకు వెళ్లే సమయంలో తగిన భద్రతా చర్యలు తీసుకోవాలని, ఏవైనా అనుమానాస్పద దృశ్యాలు లేదా వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని రాయదుర్గం పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# అదిలాబాద్ సిమెంటు పరిశ్రమను వెంటనే పునరుద్ధరించాలి

- ●కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు పలువురు వక్తల డిమాండ్

**భవిష్యత్తు ప్రజాపాలన/ హైదరాబాద్:** సీసీఐ పునరుద్ధరణ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యత అని పలువురూ వక్తులు పేర్కొన్నారు శుక్రవారం తెలంగాణ అధ్యయన సమాలోచన కేంద్రం టాస్క్ ఆధ్వర్యంలో హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రం లో టాస్క్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎర్రోజు శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో సిసిఐ ఆదిలాబాద్ సాధన కమిటీ సభ్యులు, నిర్వాసితులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, మేధావులు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు హాజరై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో సిమెంట్ పరిశ్రమను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ ఆదిలాబాద్ సిసిఐ పరిశ్రమను వెంటనే తెరిపించాలని దాని కోసం జరిగే ఉద్యమానికి జన సమితి పార్టీ పూర్తి మద్దతు ప్రకటిస్తుందని తెలిపారు. సిసిఐ పరిశ్రమ పునరుద్ధరించ డానికి కోసం అవసరమైన ప్రాతినిధ్యాన్ని రాష్ట్ర ప్రభుత్వంతో చేయడానికి తాను సదాసిద్ధమని, సీసీఐ సాధన కమిటీ సభ్యులను, జేఏసీ సభ్యులను రాష్ట్ర పరిశ్రమల మంత్రి శ్రీధర్ బాబు దగ్గరికి తీసుకువెళ్లి ప్రాతినిధ్యం చేయడంతో పాటు తన వంతు పాత్రను పోషిస్తానని తెలియజేశారు. ప్రొఫెసర్ కె నాగేశ్వర్ మాట్లాడుతూ ఆదిలాబాద్ సిమెంట్ పరిశ్రమ ఏర్పాటుకు అన్ని రకాల సౌకర్యాలు, వనరులు, ఇతర ప్రాంతాలతో పోల్చితే అతి చౌకగా ఇక్కడ సిమెంట్ ఉత్పత్తి చేయవచ్చని వివరించారు. రాబోయే వంద సంవత్సరాలు సరిపోయే 48లక్షల మెట్రిక్ టన్నుల సున్నపురాయి ఇక్కడ అందుబాటులో ఉన్నదన్నారు. దక్షిణ భారతదేశంలో సిమెంట్ డిమాండ్ అత్యధికమని అందువల్ల ఇక్కడ పరిశ్రమ ఏర్పాటు అవసరం అన్నారు. మాజీ మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ సాక్షాత్తు కేంద్ర హోంమంత్రి అమిత్ షా గారు బిజెపి ఎమ్మెల్యేలను ఎంపీలను గెలిపిస్తే ఆదిలాబాద్ సిమెంట్ పరిశ్రమలు తెరిపిస్తామని ప్రజలను మభ్యపెట్టి ఇప్పటివరకు ఒక అడుగు కూడా ముందుకు వేయలేదని విమర్శించారు. ఇప్పుడు హైదరాబాద్ సిమెంట్ పరిశ్రమ పునరుద్ధరణ కోసం రోడ్డెక్కవలసిన పరిస్థితి వచ్చింది అని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతానికి కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం మీద వేస్తూ కాలయాపన చేస్తూ ఆదిలాబాద్ ప్రజలకు తీవ్ర అన్యాయం చేస్తుందని దుయ్యబట్టారు. ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఎప్పుడూ తెలంగాణ పైన కక్షపూరితంగానే వ్యవహరిస్తుందన్నారు. తెలంగాణ ప్రజలకు బిజెపి పార్టీ చేసింది ఏమీ లేదనన్నారు. ఆదిలాబాద్ సిమెంట్ పరిశ్రమ తెరిచే వరకు నిరంతర ఉద్యమానికి తమ పార్టీ ముందుండి నడుస్తుందని ప్రకటించారు. జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ ఆరు నెలల్లో ఆదిలాబాద్ సిమెంట్ పరిశ్రమలు తెరిపించే బాధ్యత బిజెపి ఎమ్మెల్యేలు ఎంపీలు తీసుకోవాలని, లేనియెడల రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ మాట్లాడుతూ సిసిఐ ఆదిలాబాద్ ని ప్రైవేట్ పాతశాల వ్యక్తులకు అప్పనంగా కట్టబెట్టడానికి కుట్ర జరుగుతుందని ఆరోపించారు. 6వేల మందికి ఉపాధి అవకాశాలు కల్పించే ఈ పరిశ్రమను పునరుద్ధ రించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తు న్నారని ఆరోపించారు. సమావేశంలో ఎన్ జి ఓ సంఘం మాజీ అధ్యక్షులు కారం రవీందర్ రెడ్డి గారు ప్రొఫెసర్ రవీందర్ యాదవ్,సిపిఐ ఎంల్ న్యూ డెమోక్రసీ నుండి జేవీ చలపతిరావు, మాస్ లైన్ ప్రతినిధి నందిరామయ్య, ఏఐఎఫ్బి రాష్ట్ర కార్యదర్శి జోజి రెడ్డి, పి.డి.ఎస్.యు నాయకుడు నవీన్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, టాస్క్ ప్రతినిధులు ఎస్ వి సి ప్రకాష్, గుడిసె రూబీ స్టీవెన్ సన్, పెద్దూరి వెంకన్న, మాధవ్, భాను దాస్ తదితరులు పాల్గొన్నారు.




# మైసిగండిలో వైభవంగా సాక్షి శిల్ప తిరుపతి నాయక్‌ల వివాహ వేడుక

- ●ఆత్మీయతకు చిరునామాగా నిలిచిన వివాహ మహోత్సవం.. నూతన దంపతులను ఆశీర్వదించిన ప్రముఖులు

**మహేశ్వరం భవిష్యత్ ప్రజాపాలన:** కడ్తాల్ మండలంలోని మైసిగండి గ్రామంలో సాక్షి శిల్ప--తిరుపతి నాయక్‌ల వివాహ మహోత్సవం శుక్రవారం వైభవంగా, సంప్రదాయబద్ధంగా జరిగింది. అనురాధ నక్షత్రయుక్త తుల లగ్న పుష్కరాంశ సుముహూర్తంలో ఉదయం 11.04 గంటలకు వేదమంత్రోచ్చారణల మధ్య వివాహ క్రతువు ఘనంగా నిర్వహించారు. రామావత్ పూజారి బిచ్యా నాయక్, కీర్తిశేషులు లక్ష్మీ దంపతుల దివ్య ఆశీస్సులతో రామావత్ దోళి--లక్ష్మణ్ నాయక్ దంపతుల ద్వితీయ పుత్రిక సాక్షి శిల్పకు, జనలగట్టు తాండాకు చెందిన వద్యావత్ సరోజ బాయి--తావుర్యా నాయక్ దంపతుల కనిష్ఠ పుత్రుడు తిరుపతి నాయక్‌తో వివాహం జరిగింది. మైసిగండి మైసమ్మ గుడి సమీపంలోని యం.ఆర్.జి. గార్డెన్స్ అండ్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈ వేడుకకు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, ప్రజాప్రతినిధులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో కళ్యాణ వేదిక సందడి వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ సందర్భంగా భగవాన్ ఫౌండేషన్ చైర్మన్ దూదుచౌహాన్, శ్రీనివాస్ గౌడ్, స్థానిక సర్పంచ్ ప్రేమ జవహర్ లాల్ నాయక్, మాజీ ఎంపీటీసీ దశరథ్ నాయక్, తెలంగాణ రాష్ట్ర మీడియా అధ్యక్షులు జర్నలిస్ట్ సింగ్, మాజీ సర్పంచ్ నరేందర్ నాయక్, రామ్ దాస్, అమర్ సింగ్ కుటుంబ సభ్యులు తదితరులు వివాహ వేడుకలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఆర్. పంత్య నాయక్, ఆర్. అమ్రు నాయక్, ఆర్. దశరథ్ నాయక్, ఆర్. శివకుమార్ నాయక్, యస్. రాజారాం చౌహాన్తో పాటు కుటుంబ సభ్యులు, సన్నిహితులు, బంధువులు హాజరై నూతన దంపతులకు ఆశీస్సులు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు మాట్లాడుతూ.. వివాహ బంధం ప్రేమ, పరస్పర విశ్వాసం, ఆత్మీయతలకు ప్రతీక అని పేర్కొన్నారు. నూతన దంపతులు జీవిత ప్రయాణంలో సుఖదుఃఖాలను సమానంగా పంచుకుంటూ, పెద్దల ఆశీస్సులతో ఆదర్శ దాంపత్య జీవితాన్ని కొనసాగించాలని ఆకాంక్షించారు. వారి జీవితం ఆనందం, ఐశ్వర్యం, సుఖసంతోషాలతో నిండాలని ఆశీర్వదించారు. వధూవరులను ఆశీర్వదించేందుకు వచ్చిన అతిథులకు కుటుంబ సభ్యులు ఆత్మీయ స్వాగతం పలికారు. బంధుమిత్రుల సందడి, కుటుంబ సభ్యుల ఆప్యాయత, సంప్రదాయబద్ధమైన కార్యక్రమాల మధ్య వివాహ వేడుక కన్నులపండువగా సాగింది. అనంతరం అతిథులకు కళ్యాణ విందు ఏర్పాటు చేసి ఆత్మీయంగా సత్కరించారు. నూతన దంపతుల దాంపత్య జీవితం నిండు నూరేళ్లు ప్రేమానురాగాలతో, ఆయురారోగ్య ఐశ్వర్యాలతో, సుఖసంతోషాలతో కొనసాగాలని కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు.



# జిఒ 150ను సవరించి

## 85 శాతం మెడికల్ సీట్లను స్థానికులకే ఇవ్వాలి

- ●తెలంగాణ నీట్ పేరంట్స్ అసోసియేషన్ డిమాండ్

**భవిష్యత్తు ప్రజాపాలన / హిమాయత్ నగర్ :** తెలంగాణ స్థానిక విద్యార్థులకు దక్కాల్సిన 85 శాతం మెడికల్ కోటా సీట్లు ఇతర రాష్ట్రాల విద్యార్థులు పొందకుండా రాష్ట్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని తెలంగాణ నీట్ పేరంట్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. శుక్రవారం హైదరాబాద్ బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్లో అసోసియేషన్ ప్రతినిధులు యాదగిరి, మధుబాబు, సిద్ధం లక్ష్మయ్య, రాజేంద్ర ప్రసాద్, చర్ల సాయిలు, కృష్ణ, రమేశ్ నాయక్ మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతం అమలులో ఉన్న జిఒ 150 ప్రకారం 9, 10, 11, 12 తరగతులు తెలంగాణలో చదివిన విద్యార్థులను స్థానిక అభ్యర్థులుగా పరిగణించే అవకాశం ఉండటంతో ఇతర రాష్ట్రాలకు చెందిన కొంతమంది విద్యార్థులు తెలంగాణలో 9 నుంచి 12 వ తరగతి వరకు చదివి స్థానిక విద్యార్థులుగా 85శాతం స్థానిక కోటాలో మెడికల్ సీట్లు పొందుతున్నారన్నారు. దీంతో చిన్నతనం నుంచి తెలంగాణలో చదువుతున్న విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. మూడేళ్లుగా ఈ సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తున్నామని, అయినా శాశ్వత పరిష్కారం లభించడం లేదన్నారు. ప్రతి ఏటా ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో తెలంగాణ విద్యార్థులు మరింత నష్టపోయే ప్రమాదం ఉన్నదని ఆందోళన వ్యక్తంచేశారు. రాష్ట్ర ప్రభుత్వం జిఒ 150ను సవరించి ఒకటితరగతి నుంచి 12వ తరగతి వరకు తెలంగాణలో చదివిన విద్యార్థులకు మాత్రమే 85శాతం తెలంగాణ స్థానిక కోటా మెడికల్ సీట్లలో అర్హత కల్పించే విధంగా నిబంధనలు రూపొందించాలని డిమాండ్ చేశారు. సిఎం రేవంత్‌రెడ్డి, వైద్యా ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహ తక్షణమే స్పందించి తెలంగాణ విద్యార్థుల హక్కులను కాపాడేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని వారు కోరారు. సమావేశంలో నీట్ విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## ప్రముఖ నటి, పద్మశ్రీ షావుకారు జానకి మరణించారని తెలిసి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు



**హైదరాబాద్ భవిష్యత్ ప్రజాపాలన సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ మొకిరాల ఉద్రాసీన్ ఆగస్టు 21:** చిన్నతనం నుంచే నాటకాల్లో వివిధ పాత్రలు పోషిస్తూ కెరీర్‌ను ప్రారంభించిన షావుకారు జానకి దాదాపు ఏడు దశాబ్దాల పాటు చలనచిత్ర రంగంలో తనదైన ముద్ర వేశారని అన్నారు. 'షావుకారు' సినిమాలో అసమాన ప్రతిభ కనబరిచి షావుకారు జానకిగా స్థిరపడ్డారని గుర్తుచేస్తూ, తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో దాదాపు 400 చిత్రాల్లోనే కాకుండా హిందీ, మలయాళ చిత్రాల్లో కూడా నటించి ప్రేక్షకులను మెప్పించారని అన్నారు. పలు మేటి చిత్రాల్లో షావుకారు జానకి పోషించిన పాత్రలు ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలుస్తాయని కొనియాడారు. చలనచిత్ర రంగంలో ఆమె లేని లోటు పూడ్చలేనిదని అన్నారు. భగవంతుడు ఆమెకు శాంతి చేకూర్చాలని ప్రార్థిస్తూ, అమె కుటుంబ సభ్యులకు, అభిమానులకు ముఖ్యమంత్రి గారు సంతాపాన్ని, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## ప్రపంచంలోనే అత్యంత పురాతన, ప్రతిష్ఠాత్మక విశ్వవిద్యాలయాల్లో ఒకటైన ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి సందర్శించారు









**హైదరాబాద్ భవిష్యత్ ప్రజాపాలన సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ మొకిరాల ఉద్రాసీన్ ఆగస్టు 21 :** దాదాపు 900 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ విశ్వవిద్యాలయంలో సీఎం ప్రతినిధి బృందంతో కలిసి పర్యటించారు. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ పరిధిలోని బ్లావాట్‌నిక్ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్‌ను కూడా ముఖ్యమంత్రి సందర్శించారు. ఆక్స్‌ఫర్డ్ అనుబంధ విద్యాసంస్థల్లోని నూతన సంస్థల్లో ఇది ఒకటి. ఈ సందర్భంగా ప్రొఫెసర్ మాయా ట్యూడర్, ప్రొఫెసర్ ఫైసల్ దేవ్జీ తెలంగాణ ప్రతినిధి బృందాన్ని క్యాంపస్‌లో కలిశారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావుతో పాటు ఇతర అధికారులు, ప్రతినిధులు. తెలంగాణకు సంబంధించిన పలు అంశాలు, పాలన, విద్య, ప్రజా విధానాలపై చర్చలు ప్రారంభమయ్యాయి. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీకి భారతదేశంతోనూ ప్రత్యేక అనుబంధం ఉంది. మాజీ ప్రధానమంత్రి దివంగత ఇందిరా గాంధీ ఆక్స్‌ఫర్డ్‌లో విద్యాభ్యాసం చేశారు.

# సర్కారు దూరదృష్టి... రాయదుర్గంలో భూముల ధర రికార్డు బ్రేక్

- **ప్లాట్ పీ1కు ఎకరాకు రూ.264 కోట్ల భారీ ధర**
- **ఇటీవల కాలంలో హైదరాబాద్‌లోనే అత్యధిక ధర ఇది**

**హైదరాబాద్ భవిష్యత్ ప్రజాపాలన సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ మొకిరాల ఉద్రాసీన్ ఆగస్టు 21 :** రాయదుర్గంలోని భూముల ధరలు మరోసారి రికార్డు సృష్టించాయి. తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీజీఐఐసీ) నిర్వహించిన ఈ-వేలంలో ప్లాట్ నంబర్ పీ1 ఎకరా రూ.264 కోట్ల రికార్డు ధర పలికింది. హైదరాబాద్‌లో ఇప్పటివరకు ప్రభుత్వ సంస్థ నిర్వహించిన భూముల వేలంలో ఇదే అత్యధిక ధరగా నిలిచింది. మొత్తం 5.25 ఎకరాల భూమి విక్రయం ద్వారా టీజీఐఐసీకి రూ.1,386 కోట్ల ఆదాయం సమకూరింది. రాయదుర్గంలోని పీ1 ప్లాట్‌కు ఎకరాకు రూ.175 కోట్ల రిజర్వ్ ధర నిర్ణయించారు. అయితే, పోటాపోటీగా సాగిన వేలంలో చివరకు ఎకరాకు రూ.264 కోట్ల ధర పలికింది. ఇది రిజర్వ్ ధర కంటే దాదాపు 51 శాతం అధికమని అధికారులు చెబుతున్నారు. హైదరాబాద్‌పై ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థలు, జాతీయ స్థాయి డెవలపర్ల విశ్వాసం ఎంతగా పెరిగిందో ఈ వేలం ఫలితం స్పష్టం చేస్తోందని అధికారులు పేర్కొన్నారు. రాయదుర్గంలో భూముల విలువ వేగంగా పెరుగుతున్నదానికి ఈ వేలం మరో ఉదాహరణగా నిలిచిందని స్పష్టం చేస్తున్నారు. ఇదే ప్రాంతంలో టీజీఐఐసీ గత మేలో నిర్వహించిన వేలంలో ఎకరాకు రూ.237 కోట్లు పలికింది. కేవలం మూడు నెలల్లోనే ఆ రికార్డును అధిగమిస్తూ ఇప్పుడు పీ1 ప్లాట్‌కు ఎకరాకు రూ.264 కోట్ల ధర రావడం విశేషం. హైదరాబాద్‌లోని కీలక వ్యాపార ప్రాంతాలు, మౌలిక సదుపాయాలపై పెట్టుబడిదారుల ఆసక్తి మరింత పెరుగుతున్నదానికి ఇది నిదర్శనమని భావిస్తున్నారు. ఎంఎస్‌టీసీ ఈ-ఆక్షన్ వేదిక ద్వారా పూర్తి పారదర్శకంగా వేలం నిర్వహించారు. ప్రముఖ అంతర్జాతీయ రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ సంస్థ జేఎల్‌ఎల్ ప్రత్యేక ట్రాన్సాక్షన్ అడ్వైజర్‌గా వ్యవహరించింది. జాతీయ స్థాయి ప్రముఖ డెవలపర్లు పోటీలో పాల్గొనడంతో వేలం అత్యంత పోటీతత్వంతో సాగింది. ఈ సందర్భంగా టీజీఐఐసీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె. శశాంక ఐఏఎస్ మాట్లాడుతూ.. పీ1 ప్లాట్ వేలం విజయవంతం కావడం తెలంగాణ భవిష్యత్తుపై డెవలపర్లకున్న విశ్వాసానికి నిలువెత్తు నిదర్శనమన్నారు. ఇది కేవలం భూమికి మంచి ధర రావడం మాత్రమే కాదని, పారదర్శకత, అత్యుత్తమ మౌలిక సదుపాయాలు, పెట్టుబడిదారులకు అనుకూల వాతావరణం కల్పిస్తున్న తెలంగాణ అభివృద్ధి విధానానికి లభించిన గుర్తింపు అని చెప్పుకొచ్చారు. హైదరాబాద్ అంతర్జాతీయ స్థాయి వ్యాపార, పెట్టుబడుల కేంద్రంగా వేగంగా ఎదుగుతున్నదని ఈ వేలం మరోసారి నిరూపించిందన్నారు. ఈ విజయానికి ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి, పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి డి. శ్రీధర్‌బాబు అందిస్తున్న దూరదృష్టితో కూడిన నాయకత్వమే కారణమని టీజీఐఐసీ కృతజ్ఞతలు తెలిపింది. పారదర్శకతకు పెద్దపీట వేస్తూ, పరిశ్రమలు, పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణాన్ని తెలంగాణ ప్రభుత్వం కల్పిస్తోందని పేర్కొంది. ఈ ఫలితాలతో హైదరాబాద్ దేశంలోని అగ్రశ్రేణి పెట్టుబడి కేంద్రాల సరసన మరింత బలంగా నిలిచిందని తెలిపింది.

# ఎల్‌నినో సవాళ్లను సమష్టిగా ఎదుర్కొందాం



- **ఎల్‌నినో సవాళ్లను విపత్తుగా కాకుండా అవకాశంగా మార్చుకోవాలి**
- **అక్టోబర్, నవంబర్ నెలలు అత్యంత కీలకం.. పంట చేతికొచ్చే సమయంలో నీటి కొరత రాకుండా ఇప్పటి నుంచే జాగ్రత్తలు తీసుకోవాలి**
- **భూగర్భ జలాలను అంచనా వేసి, ఉన్న నీటిని జాగ్రత్తగా వినియోగించాలి**
- **ఎల్‌నినో కాదు.. ఎల్‌నినో తాత వచ్చినా తెలంగాణ రైతులను నిలబెట్టగలిగే శక్తి రాష్ట్రానికి ఉంది**
- **అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి రైతుల కష్టాలను తీర్చాలి.. అధికారులు నిబద్ధతతో పనిచేయాలి**
- **రైతులకు మంచి చేయాలన్న చిత్తశుద్ధితో అధికారులు పనిచేస్తే ప్రజలు తప్పకుండా ఆదరిస్తారు**
- **ప్రయత్నం చేస్తే సాధించలేనిదంటూ ఏదీ లేదు.. అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలి**
- **తెలంగాణను ఎల్‌నినో ప్రభావం నుంచి కాపాడేందుకు ముందుగానే ప్రణాళికతో ప్రభుత్వం పనిచేస్తోంది**

**హైదరాబాద్ భవిష్యత్ ప్రజాపాలన సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ మొకిరాల ఉద్రాసీన్ ఆగస్టు 21:** ఎల్‌నినో ప్రభావంతో రానున్న సవాళ్లను ముందుగానే గుర్తించి తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని విధాలుగా సన్నద్ధం చేయాలని పలువురు మంత్రులు అధికారులకు సూచించారు. ఎల్‌నినో సాధారణ పరిస్థితి కాదని, ముఖ్యంగా అక్టోబర్, నవంబర్ నెలల్లో పంటలు చేతికొచ్చే సమయంలో నీటి లభ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. శుక్రవారం రాజేంద్రనగర్‌లోని లో ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు విబి-జి రామ్ - +, సమీకృత వ్యవసాయ కుంటల పాత్రపై నిర్వహించిన వర్క్‌షాప్‌లో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శ్రీమతి సీతక్క, పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి శ్రీ వాకిటి శ్రీహరి, సీఎస్ సంజయ్ జాజు, వ్యవసాయం, పశుసంవర్ధక, పంచాయతీరాజ్ శాఖల సెక్రటరీలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు మాట్లాడుతూ, ఈ విధంగా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో సమావేశం ఏర్పాటు చేయడం హర్షనీయమని అన్నారు. ప్రస్తుతం భూగర్భ జలాలు పెరిగే స్థాయిలో వర్షపాతం నమోదు కాలేదని, ప్రధాన జలాశయాల్లోకి కూడా ఆశించిన స్థాయిలో నీరు చేరలేదని మంత్రి తెలిపారు. రాబోయే రోజుల్లో అందుబాటులో ఉండే భూగర్భ జలాలపై రోజువారీగా అంచనాలు రూపొందించి, వాటిని జాగ్రత్తగా వినియోగించేలా అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆటో స్టార్టర్లతో రేయింబవళ్లు



మోటార్లు నడిపి భూగర్భ జలాలను వృథా చేయకుండా, పంటకు అవసరమైన మేరకే నీటిని వినియోగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షపు నీటిని గరిష్ఠంగా నిల్వ చేసుకునేలా రాష్ట్రంలోని 44 వేల చెరువులను సంరక్షించాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. చెరువుల్లోకి వర్షపు నీటిని మళ్లించేలా చర్యలు చేపట్టి, వాటిలో నీటిని నిల్వ చేస్తే చుట్టుపక్కల ప్రాంతాల్లో భూగర్భ జలాలు పెరిగి బోర్లు పనిచేసే అవకాశం ఉంటుందన్నారు. వాగులు, నదుల్లో అవసరమైన ప్రాంతాల్లో ట్రెంచ్‌లు, రాక్‌ఫిల్ డ్యామ్‌లు ఏర్పాటు చేయడం ద్వారా నీటిని భూగర్భంలోకి ఇంకేలా చేసి భూగర్భ జలాల నిల్వ సామర్థ్యాన్ని పెంచవచ్చన్నారు. ఎల్‌నినో వంటి ప్రకృతి వైపరీత్యాలను సవాలుగా కాకుండా అవకాశంగా మలచుకోవాలని మంత్రి అన్నారు. కొత్త సాంకేతికత కోసం ఎదురుచూడాల్సిన అవసరం లేదని, గతంలో మన తాతలు, తండ్రులు అనుసరించిన నీటి సంరక్షణ పద్ధతులను తిరిగి ఆచరణలోకి తీసుకురావాలని సూచించారు. వ్యవసాయం, పశుసంవర్ధక, మత్స్య, అటవీ, పంచాయతీరాజ్, నీటిపారుదల తదితర శాఖలు సమన్వయంతో పనిచేస్తే ఎలాంటి విపత్కర పరిస్థితినైనా సమర్థంగా ఎదుర్కోవచ్చన్నారు. జిల్లా స్థాయిలో అధికారులు ప్రతిరోజూ సమన్వయ సమావేశాలు నిర్వహించి తమ జిల్లాలో చేపట్టాల్సిన చర్యలపై స్పష్టమైన ప్రణాళిక రూపొందించుకోవాలని మంత్రి సూచించారు. మండల స్థాయిలో మండల అధికారులు, జిల్లా స్థాయిలో జిల్లా అధికారులు సమన్వయంతో పనిచేయాలని, రైతులు, ప్రజలకు అధికారులు నమ్మకమైన మార్గదర్శకత్వం అందించాలని కోరారు. నిజాయితీగా, నిబద్ధతతో పనిచేసే అధికారుల మాటను రైతులు, ప్రజలు విశ్వసిస్తారని, అధికారులు ప్రజలతో మానవీయ కోణంలో వ్యవహరించాలని అన్నారు. రైతులను ఒకే పంటపై ఆధారపడే పరిస్థితి నుంచి బయటకు తీసుకురావాల్సిన అవసరం ఉందని మంత్రి తెలిపారు. పంటల వైవిధ్యాన్ని ప్రోత్సహిస్తూ ధరల్లో హెచ్చుతగ్గులు వచ్చినా రైతుకు నష్టం రాకుండా చూడాలన్నారు. ముఖ్యంగా ఉద్యాన పంటలకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు ఆయిల్‌పామ్ సాగును విస్తరించాలని సూచించారు. ఆయిల్‌పామ్‌తో పాటు కోకో, వక్క, మిరియాలు వంటి అంతర పంటలను ప్రోత్సహించడం ద్వారా రైతులకు అదనపు ఆదాయ అవకాశాలు కల్పించవచ్చన్నారు. తెలంగాణను దేశంలోనే ఆయిల్‌పామ్ సాగులో అగ్రగామి రాష్ట్రంగా నిలిపేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి తెలిపారు. అన్ని జిల్లాల్లో ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని, రైతులకు లాభదాయకమైన వ్యవసాయాన్ని అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఉద్యాన రంగాన్ని కూడా సమగ్రంగా అభివృద్ధి చేసి తెలంగాణను పొరుగు రాష్ట్రాలకు దీటుగా ముందుకు తీసుకెళ్లాలని అధికారులకు సూచించారు. రైతుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ముందుగానే కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసిందని మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కోవడం, పంటల వైవిధ్యాన్ని పెంచడం తదితర అంశాలపై నిరంతరం అధికారులతో సమీక్షలు నిర్వహిస్తున్నారని చెప్పారు. గత ఆరు నెలలుగా వ్యవసాయ శాఖతో పాటు ఇతర శాఖల అధికారులు రైతాంగ సమస్యలపై నిరంతరం చర్చిస్తూ ముందస్తు ప్రణాళికలు రూపొందిస్తున్నారని పేర్కొన్నారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో పశువులు, అటవీ జంతువులకు కూడా నీటి లభ్యత ఉండేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. గతంలో కరువు పరిస్థితుల్లో గ్రామాల వెలుపల పశువుల కోసం నీటి తొట్లు ఏర్పాటు చేసినట్లుగానే, అవసరమైతే అటవీ ప్రాంతాల్లో వన్యప్రాణులకు కూడా నీటి సదుపాయం కల్పించాలని అన్నారు. జీవవైవిధ్యాన్ని కాపాడుతూ అన్ని జీవులు సమానంగా జీవించే వాతావరణాన్ని కల్పించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. "ఎల్‌నినో కాదు.. ఎల్‌నినో తాత వచ్చినా తెలంగాణ రైతులను నిలబెట్టగలిగే శక్తి రాష్ట్రానికి ఉండాలి" అనే లక్ష్యంతో అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు కలిసి పనిచేయాలని మంత్రి తుమ్మల పిలుపునిచ్చారు. "ప్రతి గ్రామానికి నీటి బడ్జెట్ - ప్రతి రైతుకు నీటి భద్రత - ప్రతి ఎకరానికి వాతావరణ మార్పులను తట్టుకునే సామర్థ్యం" అనే లక్ష్యంతో అన్ని శాఖలు సమన్వయంతో ముందుకు సాగాలని ఆయన కోరారు. మంత్రి వాకిటి శ్రీహరి కామెంట్స్... గతంలో కూడా దేశంలో ఎల్ నినో ప్రభావాలు వచ్చాయి. 1951 నుంచి నేటి వరకు 12సార్లు ఎల్ నినోను భారత దేశం ఎదుర్కొంది. కరువును ఎలా ఎదుర్కోవాలనే అవగాహన రైతులకు



ఉంటుంది కానీ ఆ అవగాహనను ఆచరించేలా చేసే బాధ్యత మనది. పంటల మార్పిడి ద్వారా వ్యవసాయ రంగంలో మార్పులు తీసుకురావచ్చనే విషయంలో రైతులకు సలహాలు ఇవ్వాలి. ఆస్ట్రేలియా వంటి దేశాలు ముందస్తు కార్యాచరణ ద్వారా ఎల్ నినోను సమర్థవంతంగా అధిగమించింది. కరవు పరిస్థితుల్లో పశువుల పెంపకం, సంరక్షణ వంటి వాటిపై అన్నదాతలకు అవగాహన కల్పించాలి.

# బాలాపూర్ మండల ప్రభుత్వ పాఠశాలల సాధన నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

- **ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యం.. విద్యార్థుల హక్కుల పరిరక్షణకు సమిష్టి కృషి**

**మహేశ్వరం భవిష్యత్ ప్రజాపాలన రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలం పరిధిలోని:** ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడమే లక్ష్యంగా బాలాపూర్ మండల ప్రభుత్వ పాఠశాలల సాధన నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బడంగ్‌పేట టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో సభ్యులు, తల్లిదండ్రులు, విద్యాభిమానులు, ప్రజా ప్రతినిధుల సమక్షంలో నూతన కమిటీని ప్రకటించారు. "ప్రభుత్వ పాఠశాల బలపడితే పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లల భవిష్యత్తు బలపడుతుంది.. ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందే వరకు ప్రజల భాగస్వామ్యంతో పోరాటం కొనసాగాలి" అనే లక్ష్యంతో కమిటీ ముందుకు సాగాలని సమావేశంలో నిర్ణయించారు. మెగా హైదరాబాద్ ప్రభుత్వ పాఠశాలల సాధన కమిటీ జనరల్ సెక్రెటరీ కొల్లూరు భీమేష్, ఎం.వి. ఫౌండేషన్ ప్రతినిధులు వెంకట్ స్వామి, సరిత సమక్షంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలాపూర్ మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు, విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, మౌలిక వసతుల పరిస్థితి తదితర అంశాలపై చర్చించారు. విద్యార్థుల విద్యా హక్కుల పరిరక్షణతో పాటు పాఠశాలల అభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలని నిర్ణయించారు.

**నూతన కమిటీ సభ్యులు**

సలహాదారు: జై ఇందిరా

కన్వీనర్: అమృత నాయుడు

ప్రధాన కార్యదర్శి: సూర్ణగంటి రంజిత్ కుమార్

సంయుక్త కార్యదర్శి: కే. పద్మశ్రీ

సహ కన్వీనర్లు: ఉపేందర్, కే. నరేందర్, పర్వియా బేగం, సంగీత, మంగమ్మ

కార్యవర్గ సభ్యులు: అరుణ, కల్లం పద్మ, కురుమూర్తి, రమాదేవి, ఆనంద్, ప్రభాకర్, రఘుపతి, వై. కాంత, బి. రవి, మహమ్మద్ బేగం, సబిర బేగం. నూతన కమిటీ ఎన్నిక కార్యక్రమంలో సీఆర్పీఎఫ్ బాలాపూర్ మండల కన్వీనర్ ఎం. నరేందర్, తల్లుల సంఘం బాలాపూర్ మండల కన్వీనర్ జె. కవిత, ఉస్మానియా విశ్వ విద్యాలయం నుంచి కంచర్ల బద్రి పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని వారు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రజలు, తల్లిదండ్రులు, విద్యాభిమానులు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

**మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి**

బాలాపూర్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన మౌలిక వసతుల కల్పన, తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, తరగతి గదుల నిర్వహణ, ప్రహరీలు తదితర సమస్యలను గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని నూతన కమిటీ నిర్ణయించింది. పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉంటే వాటి పరిష్కారానికి సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకోవాలని నిర్ణయించారు. అదేవిధంగా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం, బాలికలకు సురక్షితమైన వాతావరణం కల్పించడం, పాఠశాలల్లో విద్యార్థుల హాజరును పెంచడం, తల్లిదండ్రులను విద్యార్థుల విద్యాభివృద్ధిలో భాగస్వాములను చేయడం వంటి అంశాలపై



నిరంతరం పనిచేయాలని సమావేశంలో నిర్ణయించారు.

**విద్యార్థుల సమస్యలపై నిరంతర పోరాటం**

ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలు కేవలం విద్యను అందించే కేంద్రాలు మాత్రమే కాకుండా సమాజంలోని ప్రతి వర్గానికి సమాన అవకాశాలను అందించే వేదికలని పేర్కొన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్య అందించడంలో ప్రభుత్వ పాఠశాలల పాత్ర ఎంతో కీలకమన్నారు. "ప్రతి బాలుడికి నాణ్యమైన విద్య అందడం హక్కు. ఆ హక్కు అమలయ్యేలా చూడటం సమాజం బాధ్యత. పాఠశాలలో సమస్య ఉంటే అది ఒక్క విద్యార్థి సమస్య కాదు.. మొత్తం సమాజ భవిష్యత్తుకు సంబంధించిన సమస్య" అని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం కావాలంటే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజా సంఘాలు, ప్రజాప్రతినిధులు, విద్యాభిమానులు సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో పిలుపునిచ్చారు. పాఠశాలల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు అవసరమైన చోట ప్రజా ఉద్యమాల ద్వారా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నూతన కమిటీ సభ్యులు తెలిపారు.

**నూతన కమిటీకి అభినందనలు**

బాలాపూర్ మండల ప్రభుత్వ పాఠశాలల సాధన నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం పట్ల సమావేశానికి హాజరైన సభ్యులు, తల్లిదండ్రులు, విద్యాభిమానులు హర్షం వ్యక్తం చేశారు. నూతన కమిటీ సభ్యులను అభినందించి, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం చిత్తశుద్ధితో పనిచేయాలని ఆకాంక్షించారు. విద్యార్థుల సమస్యలను తమ సమస్యలుగా భావించి పరిష్కారం కోసం ముందుకు సాగాలని, ప్రతి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు కృషి చేయాలని సూచించారు. బాలాపూర్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి నూతన కమిటీ నిరంతరం కృషి చేస్తుందని, ప్రజల భాగస్వామ్యంతో విద్యా హక్కుల సాధన కోసం ముందుకు సాగుతుందని కమిటీ సభ్యులు స్పష్టం చేశారు. "పాఠశాల గడప దాటే ప్రతి చిన్నారి చేతిలో పుస్తకం.. కళ్లలో భవిష్యత్తుపై నమ్మకం.. ఆ నమ్మకానికి బలమైన పునాది ప్రభుత్వ పాఠశాల" అనే సంకల్పంతో బాలాపూర్ మండల ప్రభుత్వ పాఠశాలల సాధన కమిటీ పనిచేయాలని సమావేశంలో ప్రతినబూనారు.

శనివారం , ఆగస్టు 22 , 2026
భవిష్యత్ ప్రజాపాలన
తెలుగు దినపత్రిక



# సమ్మక్క-సారలమ్మ వీరగాథతో పాన్ ఇండియా చిత్రం




**సికింద్రాబాద్, ఆగస్టు 21 (భవిష్యత్ ప్రజాపాలన న్యూస్):** తెలంగాణ ఆరాధ్య వనదేవతలు సమ్మక్క-సారలమ్మ వీరగాథ ఆధారంగా ప్రముఖ నిర్మాణ సంస్థ మాస్ట్రో క్రియేషన్స్ భారీ బడ్జెట్‌తో పాన్ ఇండియా చారిత్రాత్మక చిత్రాన్ని తెరకెక్కిస్తోంది. భారతీయ సంస్కృతి, ఆధ్యాత్మికత, వీరత్వం, భావోద్వేగాలను అద్భుతమైన దృశ్యానుభూతిగా ఆవిష్కరించడమే లక్ష్యంగా సినిమా రూపొందిస్తున్నట్లు దర్శకుడు వెంకట్ తెలిపారు. భారీ స్థాయి విజువల్ ఎఫెక్ట్స్, ప్రీ-విజువలైజేషన్, వర్చువల్ ప్రొడక్షన్, గ్రాఫిక్స్ కోసం అమెరికా సహా విదేశాల్లోని ప్రముఖ స్టూడియోలతో సంప్రదింపులు జరుగుతున్నాయని వెల్లడించారు. ప్రతిష్ఠాత్మక నటీనటులను ఎంపిక చేసి, రాబోయే సమ్మక్క-సారలమ్మ మహాజాతర సమయానికి సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని చిత్రబృందం ప్రణాళిక సిద్ధం చేస్తోంది. నటీనటులు, సాంకేతిక బృందం, టైటిల్ తదితర పూర్తి వివరాలను త్వరలో అధికారికంగా ప్రకటించే అవకాశం ఉందని సినీ వర్గాలు చెబుతున్నాయి.

# ప్రతి ఇంటికీ ఇందిరమ్మ చీరలు అందించాలి



**కాంగ్రెస్ నాయకుడు ర్యాలే రాజేందర్ యాదవ్**

**సికింద్రాబాద్, ఆగస్టు 21 (భవిష్యత్ ప్రజాపాలన న్యూస్):** సికింద్రాబాద్ నియోజకవర్గం పరిధిలోని మెట్టుగూడ డివిజన్‌లో ముదిరాజ్ సంఘం వద్ద ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు ఇందిరమ్మ చీరలను అందజేశారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి ర్యాలే రాజేందర్ యాదవ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ చీరలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎలాంటి అర్హత ఉన్న కుటుంబం కూడా పథకం ప్రయోజనానికి దూరం కాకుండా పంపిణీ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని కోరారు. మహిళలకు ఉపయోగకరంగా ఉండేలా ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు కావాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రతి ఇంటికీ ఇందిరమ్మ చీరలు ఇందిరమ్మ చీరలు అందేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని రాజేందర్ యాదవ్ కోరారు.

# వరలక్ష్మీ వ్రతం నిర్వహించిన మాజీ కార్పొరేటర్ డా. సామల హేమ



**సికింద్రాబాద్ ఆగస్టు 21 (భవిష్యత్ ప్రజాపాలన న్యూస్):** వరలక్ష్మీ వ్రతం పర్వదినాన్ని పురస్కరించుకొని మాజీ కార్పొరేటర్ డా. సామల హేమ తన నివాసంలో కుటుంబ సభ్యులతో కలిసి భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, సాంప్రదాయబద్ధంగా వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహించి కుటుంబ సభ్యులతో కలిసి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అమ్మవారి కృపతో ప్రతి ఇంటా సుఖశాంతులు, సంతోషం, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం వెల్లివిరియాలని ప్రార్థించారు. వరలక్ష్మీ వ్రతం మహిళలకు ఎంతో పవిత్రమైన పండుగ అని, కుటుంబ సభ్యులందరూ సుఖసంతోషాలతో, ఆరోగ్యంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు డా. సామల హేమ తెలిపారు. ఈ సందర్భంగా సీతాఫలమండి డివిజన్ ప్రజలకు, మహిళలకు మరియు రాష్ట్ర ప్రజలందరికీ వరలక్ష్మీ వ్రత శుభాకాంక్షలు తెలియజేశారు.

# పండరీపూర్ విఠల్ రుక్మిణీ అమ్మవారిని దర్శించుకున్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్





**కంటోన్మెంట్, ఆగస్టు 21 (భవిష్యత్ ప్రజాపాలన న్యూస్):** శ్రావణ శుక్రవారం సందర్భంగా కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ శుక్రవారం మహారాష్ట్ర లోని కొల్హాపూర్ మహాలక్ష్మి దేవి అమ్మవారిని దర్శించుకున్న అనంతరం పండరీపూర్ విఠల్ రుక్మిణీ అమ్మవారిని దర్శించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి ప్రజలందరూ ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించారు. అధికారులు ఎమ్మెల్యే శ్రీగణేష్ కి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి వేద పండితులచే వేదాశీర్వచనం అందజేశారు.

# సికింద్రాబాద్‌లో బిలాల్ టెక్స్‌టైల్స్ 3వ శాఖ ప్రారంభం



**● బిలాల్ టెక్స్‌టైల్స్ - రోజువారీ అందం నుంచి బ్రైడల్ కలెక్షన్ల వరకు విస్తృత శ్రేణి.**
**● తయారీదారు నుంచి నేరుగా హోల్‌సేల్ ధరలు.. ట్రెండింగ్ కలెక్షన్లతో ప్రత్యేక ఆకర్షణ**
**● రూ.లక్ష షాపింగ్‌పై 10 గ్రాముల వెండి నాణెం.. రూ.50 వేల కొనుగోలుపై 5 గ్రాముల వెండి నాణెం ఉచితం**

**హైదరాబాద్, ఆగస్టు 21: (భవిష్యత్ ప్రజాపాలన న్యూస్)** దక్షిణ భారతదేశంలో ప్రముఖ టెక్స్‌టైల్ తయారీదారు, హోల్‌సేల్ వ్యాపార సంస్థగా గుర్తింపు పొందిన బిలాల్ టెక్స్‌టైల్స్ సికింద్రాబాద్‌లో తన మూడో శాఖను శుక్రవారం ఘనంగా ప్రారంభించింది. ఈ కార్యక్రమానికి రెడ్ రోజ్ మార్ట్ సీఈఓ జియా ఉర్ రెహ్మాన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. హాజీ మహమ్మద్ యహ్యా బచావ్ సాహెబ్, హాజీ మహమ్మద్ ఇర్షాద్ బచావ్ సాహెబ్, హాజీ అబ్దుల్ కరీమ్ బచావ్ సాహెబ్‌లు నూతన శాఖను ప్రారంభించారు.

హైదరాబాద్‌లోని ప్రముఖ బొటిక్‌లు, రిటైల్ దుకాణాలు, వస్త్ర వ్యాపార సంస్థలకు టెక్స్‌టైల్స్ సరఫరా చేస్తున్న బిలాల్ టెక్స్‌టైల్స్ తయారీదారు నుంచి నేరుగా సరఫరా చేసే విధానంతో పోటీ ధరలకు వస్త్రాలను అందిస్తోంది. మారుతున్న ఫ్యాషన్‌కు అనుగుణంగా ఆధునిక డిజైన్లు, ట్రెండింగ్ కలెక్షన్లు, సోషల్ మీడియాలో ఆదరణ పొందుతున్న డిజైన్లను ఎప్పటికప్పుడు అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు.

**వ్యాపారులకు ప్రత్యేకంగా..**





సికింద్రాబాద్‌లో ప్రారంభించిన కొత్త శాఖను ముఖ్యంగా బొటిక్ యజమానులు, రిటైలర్లు, దుకాణదారులు, వస్త్ర వ్యాపారంలోకి అడుగుపెట్టాలనుకునే ఔత్సాహిక పారిశ్రామికవేత్తల అవసరాలకు అనుగుణంగా ఏర్పాటు చేశారు. వివిధ రకాల నాణ్యమైన వస్త్రాలు, దుస్తుల కలెక్షన్లు ఒకే చోట లభించేలా ఏర్పాట్లు చేశారు. దీంతో వ్యాపారులు తమకు అవసరమైన వస్త్రాలను విస్తృతంగా ఎంపిక చేసుకోవడంతోపాటు హోల్‌సేల్ ధరల ప్రయోజనం పొందే అవకాశం ఉంటుందని సంస్థ తెలిపింది.

**ప్రారంభోత్సవ ఆఫర్లు**

కొత్త శాఖ ప్రారంభోత్సవం సందర్భంగా కస్టమర్లకు ప్రత్యేక బహుమతులను సంస్థ ప్రకటించింది. రూ.1,00,000 విలువైన వస్త్రాలు కొనుగోలు చేసిన వారికి 10 గ్రాముల వెండి నాణెం ఉచితంగా, రూ.50,000 విలువైన షాపింగ్ చేసిన వారికి 5 గ్రాముల వెండి నాణెం ఉచితంగా అందించనున్నట్లు పేర్కొంది. మూడో శాఖ ప్రారంభంతో హైదరాబాద్, సికింద్రాబాద్ ప్రాంతాల్లోని రిటైలర్లు, బొటిక్ యజమానులు, వస్త్ర వ్యాపారులకు మరింత విస్తృతమైన కలెక్షన్లు, నాణ్యమైన వస్త్రాలు, తయారీదారు స్థాయి ధరలను అందుబాటులోకి తీసుకురావడమే తమ లక్ష్యమని బిలాల్ టెక్స్‌టైల్స్ ప్రతినిధులు తెలిపారు. తాజా డిజైన్లు, హోల్‌సేల్ వస్త్ర కలెక్షన్ల కోసం వ్యాపారులు నూతన శాఖను సందర్శించాలని సంస్థ కోరింది.

# హమాలీ బస్తీ పాఠశాలను తరలిస్తే డీఈఓ కార్యాలయం ముట్టడిస్తాం

**● పద్మారావునగర్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి గుర్రం పవన్‌కుమార్ గౌడ్ హెచ్చరిక**

**సికింద్రాబాద్, ఆగస్ట్ 21 (భవిష్యత్ ప్రజాపాలన న్యూస్):** పేద ప్రజలు నివసించే హమాలీ బస్తీలో 50 ఏళ్లకు పైగా కొనసాగుతున్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను తరలించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తే చూస్తూ ఊరుకోబోమని పద్మారావునగర్ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి గుర్రం పవన్‌కుమార్ గౌడ్ హెచ్చరించారు. అవసరమైతే బస్తీవాసులతో కలిసి డీఈఓ, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయాలను ముట్టడిస్తామని స్పష్టం చేశారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం తక్కువగా ఉందనే కారణంతో పాఠశాలను తరలించేందుకు ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు బస్తీ కమిటీ సభ్యులు శుక్రవారం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వెంటనే స్పందించిన ఎమ్మెల్యే.. బస్తీకి వెళ్లి సమస్యను పరిశీలించాలని పద్మారావునగర్ పార్టీ ఇన్‌చార్జి పవన్‌కుమార్ గౌడ్‌ను ఆదేశించారు.




మాజీ మంత్రి స్థానిక ఎమ్మెల్యే తలసాని ఆదేశాల మేరకు పవన్‌కుమార్ గౌడ్ శుక్రవారం బస్తీవాసులతో కలిసి పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా బస్తీవాసులు పాఠశాల పరిస్థితులను ఆయనకు వివరించారు. గతంలో ఈ పాఠశాలలో సుమారు 200 మంది విద్యార్థులు చదువుకున్నారని తెలిపారు. విద్యార్థుల సంఖ్య తగ్గడంతో ప్రస్తుతం పాఠశాల భవనంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. పాఠశాల ఆవరణలో స్థలం అందుబాటులో ఉన్నప్పటికీ 6, 7 తరగతులను మంజూరు చేయాలని గతంలో పలుమార్లు డీఈఓకు వినతిపత్రాలు సమర్పించినా అధికారులు పట్టించుకోలేదని బస్తీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలలో తరగతులు పెంచాలని తాము కోరుతుంటే.. ఉన్న పాఠశాలను తరలించేందుకు ప్రభుత్వం ప్రయత్నించడం దారుణమని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పవన్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ పేద ప్రజలు నివసించే ప్రాంతాల్లోని పాఠశాలలను మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. హమాలీ బస్తీలో దశాబ్దాలుగా కొనసాగుతున్న పాఠశాలను తరలించే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. పాఠశాలను ఇక్కడి నుంచి తరలించేందుకు ప్రయత్నిస్తే బస్తీవాసులతో కలిసి ఉద్యమం చేపడతామని, అవసరమైతే డీఈఓ, హైదరాబాద్ కలెక్టర్ కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బస్తీ నాయకులు సత్యనారాయణ, కౌసల్య, రాజు, దుర్గా, అరుణ, అంబులెన్స్ సురేశ్, రవి, మహేందర్ గౌడ్, ముక్క శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# గ్లోబల్ స్థాయిలో ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్ నిర్వహణ





**సిఎస్ సంజయ్ జాజు**

**హైదరాబాద్ భవిష్యత్ ప్రజాపాలన సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ మొకిరాల ఉద్రాసీన్ ఆగస్టు 21:** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న తెలంగాణ రైజింగ్ - ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ను విజయవంతంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ సంజయ్ జాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. డిసెంబర్‌లో హైదరాబాద్‌లో నిర్వహించనున్న తెలంగాణ రైజింగ్ - ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై శుక్రవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో సీఎస్ ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమ్మిట్ నిర్వహణకు సంబంధించి వివిధ అంశాలపై అధికారులతో సమీక్షించారు. దేశంలోని వివిధ దేశాల రాయబారులు, హైకమిషనర్లకు ప్రత్యేక ఆహ్వానాలు పంపాలని, ఆయా దేశాల్లోని ప్రముఖ పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులను కూడా సమ్మిట్‌కు ఆహ్వానించాలని సీఎస్ సూచించారు. అదేవిధంగా, దేశంలోని వివిధ రంగాలకు చెందిన ప్రముఖ పారిశ్రామిక సంస్థలు, శాస్త్ర-



సాంకేతిక, వైద్య, విద్య, మౌలిక వసతులు తదితర రంగాల ప్రముఖులను సమ్మిట్‌లో పాల్గొనేలా ముందుగానే ఆహ్వానాలు పంపాలని ఆదేశించారు. సమ్మిట్‌ను సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన వివిధ కమిటీలను ఏర్పాటు చేయాలని, ప్రతి కమిటీకి స్పష్టమైన బాధ్యతలను అప్పగించి సమన్వయంతో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తెలంగాణలోని వివిధ రంగాల సామర్థ్యాన్ని, పెట్టుబడి అవకాశాలను ప్రపంచానికి చాటిచెప్పేలా వివిధ రంగాలకు సంబంధించిన ఎక్స్ పోలను ఏర్పాటు చేయాలని, వాటిలో ప్రముఖ కంపెనీలు, సంస్థలు భాగస్వామ్యమయ్యేలా చర్యలు తీసుకోవాలని సీఎస్ పేర్కొన్నారు. అలాగే, తెలంగాణ రైజింగ్ - ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ నిర్వహణకు మార్గదర్శకత్వం అందించేందుకు వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, నిపుణులతో కూడిన సలహా మండలి ను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. సమ్మిట్‌ను అత్యున్నత ప్రమాణాలతో నిర్వహించి, తెలంగాణను ప్రపంచస్థాయి పెట్టుబడుల గమ్యస్థానంగా మరింతగా ప్రతిష్ఠించేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సీఎస్ సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కమిషనర్ శశాంక, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓ అజిత్ రెడ్డి, పరిశ్రమల శాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

# వరలక్ష్మీ వ్రతానికి ఉజ్జయిని మహాకాళి ఆలయంలో భక్తుల సందడి

**సికింద్రాబాద్, ఆగస్టు 21 (భవిష్యత్ ప్రజాపాలన న్యూస్):** వరలక్ష్మీ వ్రతం సందర్భంగా సికింద్రాబాద్‌లోని శ్రీ ఉజ్జయిని మహాకాళి అమ్మవారి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. శ్రావణ శుక్రవారం, వరలక్ష్మీ వ్రతం కావడంతో మహిళలు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు.



ఈ సందర్భంగా అమ్మవారిని వివిధ రకాల రంగురంగుల గాజులతో ప్రత్యేకంగా అలంకరించారు. విద్యుత్ దీపాల వెలుగులు, పూల అలంకరణల నడుమ గాజుల అలంకరణలో అమ్మవారు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నారు. ఆలయ ప్రాంగణమంతా భక్తుల సందడి, భక్తిగీతాలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకుని ఆలయ కార్యనిర్వహణాధికారి గుత్తా మనోహర్ రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి వరలక్ష్మీ పూజలు చేసి భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయాన్ని వివిధ రకాల పూలు, గాజులతో సుందరంగా అలంకరించినట్లు కార్యనిర్వహణాధికారి గుత్తా మనోహర్ రెడ్డి తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయంలో ముందస్తు ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. వరలక్ష్మీ వ్రతం సందర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు పండుగ వాతావరణాన్ని సంతరించుకున్నాయి.



Edited,Printed,Published and Owend by CHITLA DIVYA ,Printed at POTHUGANTI RACHANA , G2, TSRINIVAS, ROAD NO : 4 , RANGAREDDY , Hyderabad- 500035 . Published at H.NO : 177/P , PLOT NO : 402 ANJAMMA RESIDENCY , MANIKONDA , Hyderabad - 500089, Telangana. Editor : CHITLA VIJAYKUMAR REDDY , RNI : TGTEL/26/A0153 e-mail : bhavishyatprajapalana@gmail.com , Cell : 81061 86888

శనివారం , ఆగస్టు 22 , 2026 | భవిష్యత్ ప్రజాపాలన తెలుగు దినపత్రిక | 9

# గాజుల అలంకరణలో జై శ్రీ సంతోషిమాత



- శ్రావణ రెండో శుక్రవారం ప్రత్యేక పూజలు.. భక్తులతో కిటకిటలాడిన జీరా ఆలయం

**సికింద్రాబాద్, ఆగస్టు 21: (భవిష్యత్ ప్రజాపాలన న్యూస్):** శ్రావణ మాసం రెండో శుక్రవారం సందర్భంగా సికింద్రాబాద్ రాంగోపాల్‌పేట్ డివిజన్ పరిధిలోని జీరా ప్రాంతంలో వెలసిన జై శ్రీ సంతోషిమాత ఆలయంలో ప్రత్యేక పూజలు, అలంకరణలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని వివిధ రకాల చేతి గాజులతో సర్వాంగ సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. శ్రావణ శుక్రవారం కావడంతో అమ్మవారి దర్శనం కోసం మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు భక్తుల సందడితో కిటకిటలాడాయి. అమ్మవారిని దర్శించుకున్న మహిళా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఒకరికొకరు పసుపు, బొట్టు, వాయనం అందజేసుకుంటూ శ్రావణ శుక్రవారం వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయ అంతర్గత ప్రాంతాలను సైతం ప్రత్యేకంగా అలంకరించారు.

**పెద్ద ఎత్తున అన్నదానం**

మధ్యాహ్నం ఆలయానికి విచ్చేసిన మహిళా భక్తులు, ఇతర భక్తుల కోసం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున మహా అన్నదాన ప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు.

**కోరిన కోరికలు నెరవేరుతాయనే నమ్మకం**

ఈ సందర్భంగా ఆలయ పూజారి భాస్కరాచారి మాట్లాడుతూ.. జై శ్రీ సంతోషిమాత అమ్మవారు భక్తుల కొంగుబంగారంగా, కోరిన కోరికలను తీర్చే తల్లిగా భక్తుల విశ్వాసాన్ని పొందారని తెలిపారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లిస్తే కల్యాణం, సంతానం తదితర కోరికలు నెరవేరుతాయని భక్తుల నమ్మకమన్నారు. ఈ నెల 28న రాఖీ పౌర్ణమి సందర్భంగా జై శ్రీ సంతోషిమాత జన్మదిన వేడుకలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ వేడుకలకు వేలాది మంది మహిళా భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్నందున వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఆ రోజున అమ్మవారికి అలంకరించిన గాజులను ముత్తయిదువులకు అందజేయనున్నట్లు వెల్లడించారు. రాఖీ పౌర్ణమి రోజున సంతోషిమాతను దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటే కోరిన కోరికలు తీరుతాయని భక్తుల విశ్వాసమని భాస్కరాచారి పేర్కొన్నారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మనోజ్ కుమార్ గౌడ్, నామాల ప్రేమ్ కుమార్, అనుపమ, గణేష్, సంజయ్, అరుణ్ గౌడ్, కుమార్ యాదవ్, రాజు, అంజనేయులు యాదవ్, తో పాటు పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు తదితరులు ఉన్నారు.



# కాలే శ్రీకాంత్ జన్మదిన వేడుకల్లో బద్దం కృష్ణారెడ్డి సందడి

- శ్రీకాంత్‌కు ఘన సన్మానం.. శాలువా కప్పి, బొకే అందజేసిన బద్దం కృష్ణారెడ్డి
- బొల్లారం వెంకటరెడ్డి సమక్షంలో టంగుటూరు కాంగ్రెస్ నాయకుల అభినందనలు



**భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి ఆర్. శ్రీనివాస్ ఆగస్టు 21:** చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య తనయుడు, మొయినాబాద్ మాజీ జెడ్పీటీసీ కాలే శ్రీకాంత్ జన్మదిన వేడుకల్లో శంకర్‌పల్లి మండలం టంగుటూరు గ్రామ సీనియర్ నాయకుడు బద్దం కృష్ణారెడ్డి ప్రత్యేకంగా పాల్గొని ఘనంగా అభినందించారు. ఈ సందర్భంగా బద్దం కృష్ణారెడ్డి కాలే శ్రీకాంత్‌కు శాలువా కప్పి సన్మానించడంతో పాటు బొకే అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేయించి శ్రీకాంత్‌కు కేక్ తినిపించి ఆనందాన్ని పంచుకున్నారు. ఆయన ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో మరెన్నో జన్మదిన వేడుకలు జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శంకర్‌పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొల్లారం వెంకటరెడ్డి కూడా పాల్గొని కాలే శ్రీకాంత్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. టంగుటూరు గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ అనిల్‌కుమార్, వార్డు సభ్యులు, సీనియర్ నాయకులు పాల్గొని శ్రీకాంత్‌ను అభినందించారు. టంగుటూరు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొని వేడుకలను ఘనంగా నిర్వహించారు.

# ప్రజల సుఖసంతోషాల కోసం

## శ్రీవారి ఆశీస్సులు కోరిన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే



**తిరుమల:** జూబ్లీహిల్స్ నియోజకవర్గ ప్రజల సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అభివృద్ధి, సంక్షేమం కోసం జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే శ్రీ వి. నవీన్ యాదవ్ గారు తిరుమల తిరుపతి దేవస్థానంలో శ్రీవెంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా శ్రీవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, జూబ్లీహిల్స్ నియోజకవర్గ ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు తనకు శక్తి, సామర్థ్యాలను ప్రసాదించాలని శ్రీవారిని వేడుకున్నారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తూ, నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే శ్రీ వి. నవీన్ యాదవ్ గారు పేర్కొన్నారు.

## మేము చెమట చిందించలేం

జపాన్‌లో చెమట సమస్య లక్షలాది మంది జీవితాలను నిశ్శబ్దంగా ప్రభావితం చేస్తున్నది. ఇటీవల కాకెన్, హిసామిట్సు, మారుహో అనే మూడు ప్రముఖ ఔషధ సంస్థలు 15 నుంచి 59 ఏండ్ల వయస్సు గల 9,459 మందిపై జరిపిన ఆన్‌లైన్ సర్వేలో ఆసక్తికరమైన, ఆందోళనకరమైన నిజాలు బయటపడ్డాయి. ఈ అధ్యయనంలో పాల్గొన్న సగం మంది (4,767 మంది) తమకు చెమట సమస్య ఉందనే విషయాన్ని ఒప్పుకొన్నారు. చెమట వల్ల కలిగే ఇబ్బందులు కేవలం శరీరానికే పరిమితం కాకుండా వారి ఆలోచనలను, రోజువారీ అలవాట్లను కూడా మార్చేస్తున్నాయట. ఆందోళన వ్యక్తం చేసిన వారిలో 58 శాతం మంది చెమట భయంతో తమకు ఇష్టమైన పనులను వదులుకుంటున్నట్లు వెల్లడించారు. చెమట మరకలు పడతాయనే భయంతో నచ్చిన



దుస్తులు వేసుకోవడం కూడా మానేశామని 27 శాతం మంది తెలిపారు. ఇతరులకు దగ్గరగా వెళ్లడానికి వెనుకాడేవారు 20 శాతం మంది ఉండగా, 16 శాతం మంది పగటిపూట బయటికి వెళ్లడం లేదా ప్రయాణాలను ప్లాన్ చేసుకోవడమే మానుకుంటున్నారు. చెమటను కేవలం ఒక శారీరక ప్రక్రియగా కాకుండా, సామాజిక అవమానంగా భావించే వైఖరి అకడ ఎకువగా కనిపిస్తున్నది. సర్వేలో పాల్గొన్న వారిలో 66 శాతం మంది తమ చెమటను 'అపరిశుభ్రమైనది'గా భావిస్తుండగా, 65 శాతం మంది తమ వల్ల ఇతరులకు అసౌకర్యం కలుగుతుందేమోనని నిరంతరం భయపడుతున్నారు. సమస్య తీవ్రంగా ఉన్నప్పటికీ పరిష్కారం వైపు అడుగులు పడటం లేదు. చెమట సమస్యతో బాధపడుతున్న వారిలో 69 శాతం మంది ఎలాంటి సహాయం కోరడానికి సిద్ధంగా లేరు. ఇది కేవలం ఒక శారీరక స్థితి మాత్రమే అని 19 శాతం మంది సరిపెట్టుకుంటే, దీనికి ఎలాగూ పరిష్కారం ఎలాగూ పరిష్కారం దొరకదనే నిరాశతో మరికొందరు (19 శాతం) మిన్నకుండిపోతున్నారు. మరోవైపు వైద్యులను సంప్రదించడానికి 48 శాతం మంది సంకోచిస్తున్నారు. దానికి ప్రధాన కారణం చికిత్సకు అయ్యే అధిక ఖర్చులేనని తేలడం విశేషం.

# తెలంగాణలో విద్యా కార్యక్రమాలు చేపట్టండి



- ఆక్స్‌ఫర్డ్ వర్సిటీకి సీఎం రేవంత్ ఆహ్వానం
- 900 ఏళ్ల చరిత్ర కలిగిన ఆక్స్‌ఫర్డ్ విద్యావేత్తలతో ముఖ్యమంత్రి సమగ్ర చర్చలు
- తెలంగాణ యువత, ఉద్యోగ నిపుణులతో కలిసి పనిచేసేందుకు ఆసక్తి వ్యక్తం చేసిన ఆక్స్‌ఫర్డ్ ప్రతినిధులు
- సోమర్‌విల్ కాలేజీలో దివంగత మాజీ ప్రధాని ఇందిరా చిత్రపటాన్ని సందర్శించిన సీఎం రేవంత్

**హైదరాబాద్ భవిష్యత్ ప్రజాపాలన సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ మొకిరాల ఉద్రాసీన్ ఆగస్టు 21:** తెలంగాణలో విద్యా కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపట్టాలని... లండన్ లోని ప్రపంచ ప్రఖ్యాత ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీకి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ ఆహ్వానం పలికారు. తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందంలో భాగంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి శుక్రవారం 900 ఏళ్ల చరిత్ర కలిగిన ప్రపంచ ప్రఖ్యాత లండన్, ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీని సందర్శించారు. తెలంగాణతో ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ భాగస్వామ్య అవకాశాలు, రాష్ట్ర యువతకు ప్రపంచస్థాయి విద్య, పరిశోధన అవకాశాలు కల్పించే అంశాలపై ప్రముఖ విద్యావేత్తలతో విస్తృతంగా చర్చించారు. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ పరిధిలోని బ్లావాట్‌నిక్ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్‌కు చెందిన



ప్రొఫెసర్ మాయా ట్యూడర్, బేలియోల్ కాలేజీకి చెందిన ప్రొఫెసర్ ఫైసల్ దేవ్జీతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా 'తెలంగాణ రైజింగ్' విజన్‌ను వారికి సమగ్రంగా వివరించారు. హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి విద్యా కేంద్రంగా తీర్చిదిద్దేందుకు తెలంగాణ ప్రభుత్వం రూపొందిస్తున్న ప్రణాళికలు, చేపడుతున్న చర్యలను వివరించారు. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ తమ ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ కార్యక్రమాలు, ప్రత్యేక పరిశోధన సామర్థ్యాలు, విస్తృతమైన విద్యా వ్యవస్థను హైదరాబాద్‌కు తీసుకురావాలని ముఖ్యమంత్రి ఆహ్వానించారు. హైదరాబాద్‌లో ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేసి, తెలంగాణ యువతకు, ఉద్యోగ నిపుణులకు ప్రపంచస్థాయి విద్యా, పరిశోధన అవకాశాలు అందించేందుకు ముందుకు రావాలని కోరారు. ఈ కీలక సమావేశంలో సీఎం కార్యాలయ సలహాదారు, ఎక్స్‌అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ జాతీయ విద్యా విధానం కింద విదేశీ విశ్వవిద్యాలయాలకు అందుబాటులో ఉన్న అవకాశాలపై ఆయన సమగ్ర ప్రజెంటేషన్ ఇచ్చారు. హైదరాబాద్, తెలంగాణలో విదేశీ విశ్వవిద్యాలయాలు ఏర్పాటు చేసుకునేందుకు ఉన్న అవకాశాలు, వాటికి లభించే ప్రయోజనాలను వివరించారు. తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు ప్రొఫెసర్లు మాయా ట్యూడర్, ఫైసల్ దేవ్జీ సానుకూలంగా స్పందించారు. రాష్ట్ర యువత, ఉద్యోగ నిపుణులతో కలిసి పనిచేయడానికి ఆసక్తి వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వంతో విద్య, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో భాగస్వామ్యానికి ఉన్న పలు అవకాశాలను ఈ సందర్భంగా వారు ప్రస్తావించారు. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లో జరగనున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు ప్రతినిధి బృందాన్ని పంపాలని ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రతినిధులను తెలంగాణ బృందం ఆహ్వానించింది. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చారిత్రక సోమర్‌విల్ కాలేజీని సందర్శించారు. ఈ కాలేజీలో విద్యాభ్యాసం చేసిన దివంగత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ చిత్రపటాన్ని సందర్శించారు. 2002లో సోనియా గాంధీ ఈ చిత్రపటాన్ని సోమర్‌విల్ కాలేజీకి బహూకరించిన విషయం తెలిసిందే. అనంతరం ముఖ్యమంత్రి, అక్కడే జీఎంఆర్



గ్రూప్ నిర్వహిస్తున్న యుటిలిటా బౌల్‌ను సందర్శించారు. జీఎంఆర్ గ్రూప్ కార్పొరేట్ చైర్మన్ కిరణ్ కుమార్ గ్రంథితో కలిసి అక్కడి సమగ్ర క్రీడా సదుపాయాలను పరిశీలించారు. ఈ ప్రాంగణంలో గోల్ఫ్ కోర్స్‌తో పాటు వివిధ క్రీడలకు సంబంధించిన మౌలిక సదుపాయాలు, హోటల్ ఉన్నాయి. తెలంగాణలో ప్రపంచస్థాయి క్రీడా మౌలిక సదుపాయాల ఏర్పాటుపై ముఖ్యమంత్రి జీఎంఆర్ ప్రతినిధులు, సంస్థ గ్లోబల్ స్పోర్ట్స్ యూనిట్‌తో మంతనాలు జరిపారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టి, ప్రపంచస్థాయి క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని వారిని ఆహ్వానించారు. శుక్రవారం సాయంత్రం ప్రస్తుత ప్రీమియర్ లీగ్ చాంపియన్స్ ఆర్సెనల్, కోవెంట్రీ మధ్య జరిగే ఈపీఎల్ మ్యాచ్‌ను వీక్షించేందుకు ముఖ్యమంత్రి ఎమిరేట్స్ స్టేడియాన్ని సందర్శించనున్నారు.

# కూకట్‌పల్లిలో కొరియన్ డెర్మా క్లినిక్ ప్రారంభం



**కూకట్‌పల్లి:** కూకట్‌పల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన కొరియన్ డెర్మా క్లినిక్‌ను జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే శ్రీ వి. నవీన్ యాదవ్ గారు ప్రారంభించారు. ఈ సందర్భంగా క్లినిక్ నిర్వాహకులు, ప్రముఖ చర్మవ్యాధి నిపుణులు డా. ప్రణయ్ రెడ్డి గారు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. క్లినిక్‌లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో చర్మవ్యాధులు, జుట్టు సమస్యలు, లేజర్ చికిత్స, సౌందర్య చికిత్సలు, జుట్టు మార్పిడి వంటి వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని ఎమ్మెల్యే శ్రీ వి. నవీన్ యాదవ్ గారు అన్నారు. కూకట్‌పల్లి ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంతో పాటు, ఆధునిక చికిత్సా విధానాలను అందుబాటులోకి తీసుకురావాలని ఆకాంక్షించారు. క్లినిక్‌ను ప్రారంభించిన డా. ప్రణయ్ రెడ్డి గారికి ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు.

## పిటిషనర్ జువ్వాడి ప్రణయ్ సింహారావు దాఖలు చేసిన పిటిషన్‌ను

# సుప్రీంకోర్టు కొట్టివేసింది

**హైదరాబాద్ భవిష్యత్ ప్రజాపాలన సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ మొకిరాల ఉద్రాసీన్ ఆగస్టు 21.** :రాయదుర్గ్‌లో నిర్వహిస్తున్న వేలం ప్రక్రియను సవాలు చేస్తూ పిటిషనర్ ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. అయితే, భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ జస్టిస్ మోహనతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌ను కొట్టివేసింది.

# ఐరన్ లోపంతో థైరాయిడ్‌పై ప్రభావమా?

## ఈ లక్షణాలను నిర్లక్ష్యం చేయొద్దు



శరీరంలో థైరాయిడ్ ఆరోగ్యం, ఐరన్ స్థాయిలు అనేక రోజువారీ శరీరక విధులతో సన్నిహితంగా సంబంధం కలిగి ఉంటాయి. వీటిలో ఏదైనా అసమతుల్యంగా ఉన్నప్పుడు అలసట, జుట్టు రాలడం, చలి ఎక్కువగా అనిపించడం, నిద్ర సరిగా లేకపోవడం, మెదడు మందగించినట్లుగా అనిపించడం లేదా బరువులో మార్పులు వంటి లక్షణాలు కనిపిస్తాయి. అయితే ఈ లక్షణాల్లో కొన్ని ఒకదానితో ఒకటి పోలిఉండటం వల్ల ఒక్క పరీక్ష ఫలితాన్ని మాత్రమే చూసి అసలు సమస్యను గుర్తించకుండా ఉండే అవకాశం ఉంటుంది. పోషకాహార నిపుణులు తెలిపిన ప్రకారం.. థైరాయిడ్ పరీక్షల్లో వచ్చే సంఖ్యలను మాత్రమే పరిశీలించడం కంటే, పూర్తి ఐరన్ ప్యానెల్‌తోపాటు థైరాయిడ్ సూచికలను పరిశీలించడానికే ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు.

# ఇనుప కండలు పెరగాలంటే!



ఐరన్ లోపం ఉంటే తక్కువగా శ్వాస తీసుకోవడం, నీరసం, ఎంతకీ తగ్గని తలనొప్పి లక్షణాలు ఉంటాయి. ఆ లోపాన్ని సరిచేసుకునేందుకు ఐరన్ అధికంగా ఉన్న ఆహారం తిన్నా కొంతమంది ఆ సమస్యల నుంచి బయటపడలేరు. తినే ఆహారంలో ఐరన్ అధికంగా ఉన్న పదార్థాలు చేర్చుతారు. కానీ, కొందరి శరీరం దానిని పూర్తి స్థాయిలో గ్రహించే సామర్థ్యం కలిగి ఉండదు. అప్పుడు ఎంత తిన్నా లాభం ఉండదు. ఈ విషయం పట్ల అవగాహన లేక, రక్తహీనతతో బాధపడేవాళ్లు మాంసం, గుడ్లు, బీట్‌రూట్ మొదలైనవి తినడం మీదనే దృష్టి పెడతారు. ఆ ఆహారంలోని ఐరన్‌ని జీర్ణ వ్యవస్థ గ్రహించాలంటే శరీరంలో విటమిన్-సి లోపం ఉండకూడదు. విటమిన్-సి ఇనుమును గ్రహించే సామర్థ్యాన్ని పెంచుతుంది. కాబట్టి మాంసం తినేటప్పుడు ఓ నిమ్మ చెక్క పిండుకుంటే మంచిది. శాకాహారులు ప్రతి ఉదయం నిమ్మ రసం తాగే అలవాటు చేసుకుంటే ఐరన్ సంగ్రహణే కాదు జీర్ణవ్యవస్థ కూడా సాఫీగా సాగిపోతుంది. ఈ అలవాటు లేకపోతే వారంలో రెండు (సార్లు) రోజులు బత్తాయి జ్యూస్ తాగితే మంచిది. ఐరన్ కోసం ప్రొటీన్ అధికంగా ఉండే ఆహారం తింటే శరీరం ఇనుప కండలతో రాటు దేలుతుంది!

# భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం



**మణికొండ:** శ్రావణ శుక్రవారం సందర్భంగా మణికొండలోని తమ నివాసంలో శ్రీ వరలక్ష్మీ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు, నైవేద్యాలు సమర్పించి భక్తి శ్రద్ధలను చాటుకున్నారు. అనంతరం మణికొండలో వరలక్ష్మీ వ్రత పూజలు నిర్వహించిన పలువురు మహిళలను కలిసి వారి ఆశీర్వాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా మహిళలు అందించిన తాంబూలాలను స్వీకరించారు. శ్రీ వరలక్ష్మీ అమ్మవారి కృపతో ప్రతి ఇంటా ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, ఐశ్వర్యం, శాంతి, సమృద్ధి వెల్లివిరియాలని ఆకాంక్షించారు. అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థించారు.

# ఉచిత పథకాల వల్ల ప్రభుత్వ ఖజానాకు ఆర్థికంగా ప్రమాద ఘంటికలు




**హైదరాబాద్, ఆగస్టు 21:** ఉచిత పథకాల వల్ల ప్రభుత్వ ఖజానాకు ఆర్థికం గా ప్రమాద ఘంటికలు మోగుతున్నాయని హై కోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. పింఛన్లు, ఇత ర బెనిఫిట్లు ఇవ్వడం లేదంటూ పదవీ విరమణ పొందిన ప్రభుత్వ ఉద్యోగులు కోర్టులను ఆశ్ర యిస్తున్నారని న్యాయస్థానం పేర్కొంది. ప్రభుత్వ ఆర్థిక విధానాల్లో కోర్టులు జోక్యం చేసుకో లేనప్పటికీ పన్నుల చెల్లింపు వల్ల వచ్చే ఆదా యాన్ని ఉచితాలకు ఉపయోగించడం సరికాదని ధర్మాసనం ప్రభుత్వానికి స్పష్టం చేసింది. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చట్టబద్ధతను సవాల్ చేస్తూ న్యాయవాది విజయ్ గోపాల్ దాఖలు చేసిన పిటిషన్?పై హైకోర్టు గురువారం మరోసారి విచారణ చేపట్టింది.బాల్య వివాహాల ను నిర్మూలించడానికే : భూసేకరణలో భాగంగా భూమి కోల్పోయిన బాధితులకు అందించే పరిహారానికి సంబంధించిన వివరాలను దాఖలు చేయాలంటూ హైకోర్టు బుధవారం జరిపిన విచారణ సందర్భంగా అదనపు అడ్వకేట్ జనరల్ ఇమ్రాన్?ఖాన్?ను ఆదేశించి ంది. వివరాలు సమర్పించడానికి సమయం కావాలని నాటి విచారణ సందర్భ ంగా ఏఏజీ ధర్మాసనాన్ని కోరారు. బాల్య వివా హాలను నిర్మూలించడానికే కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను అమల్లోకి తీసుకొచ్చామని, బడ్జెట్?లో ఈ పథకాలకు ప్రత్యేకంగా కేటాయింపులు ఉన్నాయని ఏజీ వాదించారు.సమగ్ర కౌంటర్ దాఖలు చేయండి : ప్రభుత్వం దాఖలు చేసిన అఫిడవిట్?లో సమగ్ర వివరాలు లేవంటూ హైకోర్టు తప్పు పట్టింది. ఆర్టికల్ 162ను అఫిడవిట్?లో ఎందుకు ప్రస్తావించాల్సి వచ్చిందని ఏఏజీని హైకోర్టు ప్రశ్నించింది. సంబంధం లేని ఆర్టికల్?ను ప్రస్తావిస్తూ అఫిడవిట్?ను దాఖలు చేయడం తప్పు కాదా? అని ప్రశ్నించింది. పొరపాటున అలా జరిగిందని ఏఏజీ ఒప్పుకోవడంతో దాన్ని సరిదిద్ది సమగ్ర వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని అప్పుడే తదుపరి వాదనలు వింటామని న్యాయస్థానం స్పష్టం చేసింది.నిధుల కొరత ప్రస్తావన : అప్పులు చేసి సంక్షేమ పథకాలను అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోందా అని హైకోర్టు ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. చెల్లింపులకు నిధుల కొరత ఉందని కోర్టుకు హాజరైన అధికారులు పేర్కొన్న విషయాన్ని కోర్టు గుర్తు చేసింది. ఆర్టీసీ వంటి ప్రభుత్వ రంగ సంస్థలను లాభదాయక ంగా మార్చి, ఆ లాభాలను సంక్షేమ పథకాలకు వినియోగించవచ్చని కోర్టు సూచించింది. తాము ఏ రాజకీయ పార్టీని లేదా విధానాన్ని విమర్శించడం లేదని, కేవలం 2014 నుంచి కల్యాణలక్ష్మి పథకంపై జరిగిన వ్యయం వివరాలను మాత్రమే కోరుతున్నామని హైకోర్టు స్పష్టం చేసింది. స్టే ఉత్తర్వును ఎత్తివేయాలని అదనపు అడ్వకేట్ జనరల్ కోరగా, పూర్తి వాదనలు విన్న తర్వాతే నిర్ణయం తీసుకుంటామని పేర్కొంటూ హైకోర్టు విచారణను సోమవారానికి వాయిదా వేసింది. పిటిషన్ ద్వారా ప్రభుత్వాన్ని ప్రశ్నించడం : కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలకు సంబంధించి 2014 నుంచి జారీ చేసిన 8 ప్రభుత్వ ఉత్తర్వులను సవాల్ చేస్తూ న్యాయవాది విజయ్? గోపాల్ వ్యక్తిగత హోదాలో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. జస్టిస్ ఎన్.వి.శ్రవణ్ కుమార్ ఈ అంశంపై విచారణ చేపట్టారు. ప్రభుత్వం తరపున వాదిస్తూ అదనపు అడ్వకేట్ జనరల్ మహమ్మద్ ఇమ్రాన్?ఖాన్ ఈ పిటిషన్ విచారణార్హం కాదని వాదించారు. ప్రభుత్వం ఏదైనా తప్పు చేస్తే పిటిషన్ల ద్వారా సవాలు చేయొచ్చని ఆయన పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఇతర రాష్ట్రాల్లో కూడా కల్యాణ లక్ష్మి వంటి పథకాలు అమలులో ఉన్నాయని ఆయన గుర్తు చేశారు.బడ్జెట్?ను పరిగణనలోకి తీసుకోవాలని విజ్ఞప్తి : ఏఏజీ వాదనల సమయంలో జోక్యం చేసుకున్న న్యాయమూర్తి ఈ పథకాల అమలుకు ఉన్న చట్టపరమైన ప్రాతిపదికపై వివరణ కోరారు. కేవలం ప్రభుత్వ ఉత్తర్వులు, ఆర్థిక శాఖ ఆమోదాలు సరిపోతాయా అని ప్రశ్నించారు. దీనికి స్పందిస్తూ ఈ పథకానికి బడ్జెట్ కేటాయింపులు జరుగుతున్నాయని, శాసనసభ ఈ కేటాయింపులను ఆమోదిస్తుందన్న విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలని ఏఏజీ నొక్కి చెప్పారు. పిటిషనర్ తరపున వాదనలు వినిపిస్తూ చట్టపరమైన అనుమతి లేకుండా కన్సాలిడేటెడ్ ఫండ్ నుంచి నిధులను వినియోగించకూడదని వాదించారు. తన వాదనలను కొనసాగిస్తూ, ఇప్పటికే కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేశామని పిటిషనర్ లేవనెత్తిన నిర్దిష్ట అంశాలను ప్రస్తావిస్తూ సమగ్రమైన కౌంటర్ అఫిడవిట్?ను సమర్పిస్తామని ఏఏజీ హామీ ఇచ్చారు.

## కాంగ్రెస్‌లో సవతుల పోరు.. బీఆర్ఎస్ మళ్లీ పుంజుకుంటోంది: సీపీఐ నారాయణ



**హైదరాబాద్, ఆగస్టు 21:** తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో అంతర్గత కలహాలు తీవ్రమవుతున్నాయని, నాయకుల మధ్య సవతుల పోరు నడుస్తోందని సీపీఐ సీనియర్ నేత నారాయణ సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ నేతల అంతర్గత విభేదాల కారణం వల్ల రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ మళ్లీ పుంజుకుంటోందని ఆయన ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎక్కడా తప్పులు చేయకుండా నిక్కచ్చిగా వ్యవహరించినప్పుడే మంత్రులు, కిందిస్థాయి అధికారులలో భయం ఉంటుందని నారాయణ పేర్కొన్నారు. సీఎం ఇప్పటికైనా రాజకీయాలను పక్కనపెట్టి పూర్తిస్థాయిలో పాలనపైనే దృష్టి సారించాలని సూచించారు. రాష్ట్రంలో నిషేధిత 22ఏ భూము ల నిబంధనలను కొందరు అధికారులు, నాయ కులు దారుణంగా దుర్వినియోగం చేస్తున్నారని విమర్శించారు. ఒకవైపు పాలిటెక్నిక్ విద్యార్థులు నిరసనలు, ఆందోళనలు చేస్తున్నా పట్టించుకునే నాథుడే లేకపోవడం శోచనీయమన్నారు.ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వంలో తమ సీపీఐ పార్టీ భాగస్వామి కాదని, గడిచిన శాసనసభ ఎన్నికల్లో కేవలం సీట్ల సర్దుబాటు మాత్రమే చేసుకున్నామని గుర్తుచేశారు. ప్రజల ప్రయోజనాల దృష్ట్యా తాము ఇస్తున్న సూచనలను కాంగ్రెస్ ప్రభుత్వం లేదని చేశారు. ప్రభుత్వ తీరుతో ప్రజల్లో కాంగ్రెస్ పాలన పట్ల అసంతృప్తి రోజురోజుకూ పెరుగుతోందని హెచ్చరించారు.

## హైకోర్టులో ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపు కేసు విచారణ.. సెప్టెంబర్ 16న తీర్పు




**హైదరాబాద్, ఆగస్టు 21:** తెలంగాణలో ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుల వ్యవహారంపై దాఖలైన పిటిషన్లపై హైకోర్టులో విచారణ జరిగింది. ఎమ్మె ల్యేల అనర్హతపై హైకోర్టులో ఇరుపక్షాల వాద నలు ముగిశాయి. దీంతో సెప్టెంబర్ 16న తీర్పును వెల్లడించనున్నట్లు న్యాయస్థానం తెలిపి ంది. పార్టీ మారిన పది మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ తరఫు న్యాయవాదులు హైకోర్టులో వాదనలు వినిపిం చారు. కాంగ్రెస్‌కు అనుకూలంగా ఆయా ఎమ్మె ల్యేలు ప్రచారం చేసిన వీడియోలను న్యాయ స్థానానికి సమర్పించారు. అభివృద్ధి కోసం మాత్రమే ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నామని ఫిరాయింపు ఎమ్మెల్యేలు అంటున్నారని బీఆర్ఎస్ తరఫు న్యాయవాది గండ్ర మోహన్ రావు కోర్టుకు తెలియజేశారు. ఏఐసీసీ అధికా రిక కార్యక్రమాల్లో ఫిరాయింపు ఎమ్మెల్యేలు పాల్గొన్నారని, వీరి వీడియోలు ఆదీచీ ఆంధ్రజ్యోతిలో ప్రసారం అయ్యాయని తెలిపారు.చెబుతున్నారని, జాతీయ జెండాలో అశోక చక్రం ఉంటుందని గండ్ర మోహన్ రావు.. కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే దానం నాగేందర్.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఎన్నికై, ఎమ్మెల్యే పదవిలో కొనసాగుతూనే కాంగ్రెస్ పార్టీ తరఫున ఎంపీగా పోటీ చేశారని కోర్టుకు వివరించారు. పార్టీ సభ్యత్వం లేని వ్యక్తులకు ఎన్నికల్లో టికెట్ ఇవ్వడం సాధ్యం కాదని అన్నారు. ప్రధాన పత్రికలు, టీవీ ఛానళ్లలో ప్రసారమైన వార్తా కథనాలు, వీడియోలను బీఆర్ఎస్ తరఫు న్యాయవాది గండ్ర మోహన్ రావు న్యాయస్థానం ముందు ఉంచారు. ఇరు పక్షాల వాదనలు పూర్తవడంతో సెప్టెంబర్ 16న తీర్పును వెల్లడించనున్నట్లు హైకోర్టు పేర్కొంది.

# బహిష్కరించక ముందే వెళ్లిపోండి.. కొండా సురేఖపై కాంగ్రెస్ నేతల ఆగ్రహం

**హైదరాబాద్, ఆగస్టు 21:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మంత్రి కొండా సురేఖ కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలు పెను దుమారాన్ని రేపుతున్నాయి. సుస్మిత వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిని చేయొద్దని, అది పూర్తిగా ఆమె సొంత అభిప్రాయమంటూ క్రమశిక్షణ కమిటీకి మంత్రి కొండా సురేఖ వివరణ ఇచ్చిన విషయం తెలిసిందే. దీనిపై ప్రభుత్వ విప్‌లు బీర్ల ఐలయ్య, వేముల వీరేశం, ఎమ్మెల్యేలు బాలు నాయక్, నాయిని రాజేందర్ రెడ్డి స్పందిస్తూ.. కొండా సురేఖపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సుస్మిత వ్యాఖ్యలతో సురేఖకు సంబంధం లేకపోతే ఖండించాలని అన్నారు.సుస్మిత వ్యాఖ్యలపై సురేఖ స్పందించాలి: బీర్ల ఐలయ్యప్రభుత్వంపై ప్రతిపక్షాలు విమర్శలు చేయడం మామూలే అని.. సొంత పార్టీ వాళ్లు విమర్శలు చేస్తే ఎలా అని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎత్తిన జెండాను దించకుండా పార్టీని అధికారంలోకి తెచ్చింది రేవంత్ అని.. ఆయనపైన విమర్శలు చేయడమేంటని ప్రశ్నించారు. సుస్మిత వ్యాఖ్యలపై కొండా సురేఖ స్పందించాలని డిమాండ్ చేశారు. కష్టపడుతున్న సీఎంపై బండలేస్తారా అంటూ మండిపడ్డారు. సొంత పార్టీ నేతలే సీఎంపై విమర్శలు చేయడం బాధాకరమని ఐలయ్య అన్నారు.సీఎంపై అసత్య ఆరోపణలు చేస్తే ఊరుకోం: వేముల వీరేశంకుమార్తె సుస్మిత వ్యాఖ్యలతో సురేఖకు సంబంధం లేకపోతే ఖండించాలని ప్రభుత్వ విప్ వేముల వీరేశం అన్నారు. కొండా సురేఖ భాష పార్టీని ఇబ్బంది పెడుతోందని.. సమంత విషయంలో కూడా ఇలాగే మాట్లాడారని మండిపడ్డారు. 'మీ తప్పుడు భాషకు సీఎం మూల్యం చెలించాలా? మీ ఎంటర్టైన్మెంట్ కోసం పార్టీ బలి కావాలా? అధికారంలోకి



రావడానికి రేవంత్ చెమట చుక్కలు త్యాగం చేశారు. ముఖ్యమంత్రిని వీక్ చేయాలనే కుట్ర చేస్తున్నారు. పార్టీలో జరుగుతున్న వ్యవహారంపై స్పందిస్తున్నాం. సీఎంపై ఎవరు తప్పుగా మాట్లాడినా చర్యలు తీసుకోవాలి. సీఎం నిర్ణయాలను తప్పు పట్టడం దుర్మార్గం. ఆయన నిర్ణయాలు తప్పు పట్టేవాళ్లు పార్టీలో ఉండాల్సిన అవసరం లేదు. సొంత పార్టీ నేతలు ప్రతిపక్షాలకు గొంతు ఇస్తున్నారు. పార్టీకి, ప్రభుత్వానికి తలనొప్పిగా మారిన వారిని పక్కన పెట్టాలి. పార్టీ వేదికలపై మాట్లాడాల్సిన విషయాలను బహిరంగంగా మాట్లాడతారా? మైక్ దొరికితే ఊగిపోతారా? సీఎంపై అసత్య ఆరోపణలు చేసినా, ఏకవచనంతో మాట్లాడితే ఊరుకోం' అని హెచ్చరించారు.సీఎం రేవంత్‌ను బలహీనపర్చాలని చూస్తున్నారు: బాలు నాయక్పార్టీకి వ్యతిరేకంగా రాజ్‌గోపాల్ రెడ్డి మాట్లాడినా, బాలు నాయక్ మాట్లాడినా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బాలు నాయక్ అన్నారు. షోకాజ్ నోటీసులు ఇచ్చి అయిపోయిందని అనుకోవద్దని.. కులం, హోదాలతో సంబంధం లేకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్షాల కుట్రను సొంత పార్టీ వాళ్లు అమలు చేస్తున్నారని ఆరోపించారు. సీఎం రేవంత్‌ను బలహీన పర్చాలని చూస్తున్నారని, పార్టీకి వ్యతిరేకంగా ఎవరు మాట్లాడినా పార్టీ నుంచి సస్పెండ్ చేయాలన్నారు. పార్టీ అధికారంలోకి రావడానికి కారణం రేవంత్ అని అన్నారు. ఎన్ని కుట్రలు చేసినా మళ్లీ వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని బాలు నాయక్ ధీమా వ్యక్తం చేశారు.ఒక్క ఎమ్మెల్యేతోనైనా సరిగా ఉన్నారా: నాయిని రాజేందర్కొండా సురేఖపై ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఏ పార్టీలోకి వెళ్తే ఆ పార్టీని బ్లాక్ మెయిల్ చేస్తున్నారని, ఒక్క ఎమ్మెల్యేతోనైనా సరిగా ఉన్నారా అని ప్రశ్నించారు. కష్టకాలంలో కాంగ్రెస్ పార్టీని వదిలి పోయారని.. వెళ్లేప్పుడు బీఫారంలు తీసుకొని వెళ్లిపోయారని విమర్శించారు. నిరాధార ఆరోపణలు చేసి ప్రతిపక్షాలకు ఆయుధం ఇస్తున్నారన్నారు. ప్రభుత్వంలో ఉంటూ వ్యతిరేకంగా మాట్లాడడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. లక్షలాది మంది త్యాగాన్ని వృధా చేస్తామంటే ఊరుకోమని హెచ్చరించారు. తప్పు చేసిన వారిపై నిర్ణయాలు కఠినంగా తీసుకోవాలన్నారు. కులాన్ని అడ్డుపెట్టుకొని ఏమైనా చేస్తామంటే కుదరదన్నారు. డూప్లికేట్ మనుషులు.. ఒరిజినల్ కాంగ్రెస్ అని మాట్లాడుతున్నారని, ఏమైనా ఉంటే అధిష్ఠానం దగ్గర తీర్చుకోవాలని సూచించారు. పార్లమెంట్‌లో సురేఖ నియోజకవర్గంలో మెజారిటీ తగ్గిందన్నారు. పార్టీ నుంచి బహిష్కరించే ముందే వెళ్లిపోవాలని ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి హితవు పలికారు.

# పోలీస్ శాఖలో కొలువుల జాతర




బెల్లంపల్లి(మంచిర్యాల): పోలీసు ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న నిరుద్యోగులకు ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేయగా తాజాగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు ప్రక్రియ మొదలైంది. ప్రభుత్వం వేల సంఖ్యలో ఖాళీలకు నోటిఫికేషన్ ఇవ్వడంతో నిరుద్యోగుల్లో కొత్త ఆశలు చిగురించాయి. పలువురు కోచింగ్ సెంటర్‌లకు వెళ్తుండడంతో సందడి మొదలైంది.కమిషనరేట్ పరిధిలో వందల పోస్టులు ఖాళీలు...కమిషనరేట్ పరిధిలో వందల సంఖ్యలో పోలీసు కొలువులు ఖాళీ ఉన్నాయి. జిల్లాలో ప్రతి సంవత్సరం పోలీసు ఉద్యోగాల కోసం పెద్ద సంఖ్యలో అభ్యర్థులు పోటీ పడుతుంటారు. స్థానికత(లోకల్ కేడర్) ప్రకారం ఖాళీల వివరాలను సంబంధిత శాఖలు పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డుకు ఇప్పటికే పంపించినట్లు అధికారులు ప్రకటిం చారు దీంతో స్థానిక కేడర్ ఆధారంగా పోస్టుల పంపిణీ జరుగనున్న నేపథ్యంలో జిల్లాకు కూడ గణనీయమైన పోస్టులు వచ్చే అవకాశం ఉందని నిరుద్యోగులు భావిస్తు న్నారు. జిల్లాలో ప్రతి నియామకంలో పోలీసు ఉద్యోగాలకు వేలాది మంది పోటీ పడుతుంటారు.రామగుండం కమిషనరేట్ పరిధిలో మొత్తం 1875 మంది పోలీసులకు గాను 1334 మంది విధులు నిర్వహి స్తున్నారు. 541 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇందులో సివిల్ కానిస్టేబుల్స్‌కు సంబంధించి 1325 పోస్టులకు గా ను 819 మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. 506 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అలాగే ఏఆర్ కానిస్టే బుళ్ల 563కు గాను 485 మంది విధులు నిర్వహిస్తు న్నా రు. 78 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.పరుగుపందెం, పరీక్షలో నెగ్గితేనే...పోలీసు ఉద్యోగం సాధించాలంటే పరుగుపందెంతో పాటు పరీక్షలో సైతం ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. పురుషులైతే రన్నింగ్ 1600మీటర్లు(7.15నిమిషాల్లోపు), లాంగ్‌జంప్ నాలుగుమీటర్లు, షాట్‌పుట్ 6మీటర్లు, మహిళలు పరుగుపందెంలో 800 మీటర్లు (5.20నిమి షాలు), లాంగ్‌జంప్ 2.5మీటర్లు, షాట్‌ఫుట్ 4 మీటర్ల విభాగాల్లో అర్హత సాధించాలి.శ్రీనివాస్, సోమగూడెంపోలీసు ఉద్యోగ సాధనే లక్ష్యంగా ముందుకు వెళ్తాను. దేహదారుఢ్యం కోసం జిమ్‌కు వెళ్తున్నాను. అలాగే రన్నింగ్, ఇతరత్ర కోసం ప్రతి రోజు మైదానంలో ప్రాక్టీస్ చేస్తున్నా. ఎలాగైన మొదటి ప్రయత్నంలోనే ఉద్యోగం సాధించి కల నెరవేరు ్చకుంటాను.పోలీసు కావాలన్నదే కల .వెంకటేశ్, చర్లపల్లిచిన్నప్పటి నుంచి పోలీసు కొలువు సాధించాల నేది ఆశగా పెట్టుకున్నాను. గతసారి నోటిఫికేషన్ విడుద లైన సమయంలో చాలా కష్టపడ్డాను. కొద్ది మార్కుల తేడాతో ఉద్యోగం సాధించలేకపోయాను. ఈసారి ఎలా గైన కానిస్టేబుల్ ఉద్యోగం సాధించి కల నెరవేర్చు కోవడంతో పాటు కుటుంబానికి అండగా ఉంటాను.ఆత్మవిశ్వాసంతో శ్రమించా పట్టుదల, ఆత్మవిశ్వాసం మెండుగా ఉం టే ఉద్యోగం సాధించవచ్చు. ప్రతీరోజు మైదానంలో తప్పని సరిగా కసరత్తులు చేయాలి.

## శక్తి వద్దు.. పాలిటెక్నిక్ ముద్దు

**సిరిసిల్ల:** GO 97 రద్దు కోరుతూ బీఆర్ఎస్వీ నాయకులు రాజన్న సిరిసిల్ల జిల్లాలోని రాజరాజేశ్వర స్వామి పాలిటెక్నిక్ కళాశాల ఎదుట శుక్రవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారిపై పోలీసులు లాఠీచార్జ్ చేశారు. శాంతియుతంగా నిరసన చేపడుతున్న నాయకులపై పోలీసుల అత్యుత్సాహం తగదని ఆ సంఘం రాష్ట్ర నాయకులు కంచర్ల రవి గౌడ్ అన్నారు. GO 97ను రద్దు చేయాలని ప్రజాస్వామ్య పద్ధతిలో శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న తమపై లాఠీచార్జ్ చేసిన పోలీసుల తీరును ఖండిస్తున్నామని పేర్కొన్నారు.విద్యార్థుల డిమాండ్లపై చర్చించకుండా ప్రభుత్వం పోలీసులతో అణచివేయడం సరైన విధానం కాదని ఆయన అన్నారు. విద్యార్థి నాయకులను అరెస్టు చేయడం, వారిపై కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. శక్తి వద్దు.. పాలిటెక్నిక్ ముద్దు అనే నినాదంతో విద్యార్థుల భవిష్యత్తు కోసం పోరాటం కొనసాగుతుందని వెల్లడించారు. ప్రభుత్వం వెంటనే GO 97ను రద్దు చేసి, పాలిటెక్నిక్ విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.



## రాజకీయ కక్ష సాధింపులు ఇక చెల్లవు?

**ఖమ్మం రూరల్ :** ఇది పాత కాలపు ప్రాచీన యుగం కాదని, జెన్ జీల ఆధునిక యుగమని ఈ యుగంలో రాజకీయ కక్ష సాధింపులకు తావు లేదని పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఖమ్మం రూరల్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బెల్లం వేణుగోపాల్‌తో కలిసి ఖమ్మం రూరల్ మండలం, ఏదులాపురం మున్సిపాలిటీ లో విస్తృతంగా పర్యటించారు.ఈ పర్యటనలో భాగంగా గూడూరు పాడులో పర్యటించిన కందాల ఇటీవల రాజకీయ కక్షల నేపథ్యంలో కొందరు వ్యక్తుల దాడిలో గాయపడిన బీఆర్ఎస్ కార్యకర్త మారుతి రామారావు, మరో బాధితుడు బట్టు రామారావును పరామర్శించారు. ఈ సందర్భంగా కందాల మాట్లాడుతూ అకారణంగా పార్టీ కార్యకర్తలపై దాడి చేస్తే సహించేది లేదన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో తగిన రీతిలో గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు.మంచితనంతో ప్రజల మనసులు, మన్ననలు పొందాలని భయభ్రాంతులను చేసి రాజకీయం చేస్తామనుకోవడం సరికాదన్నారు. అనంతరం మంగళ గూడెం లో జరిగిన పలు ఆలయాల విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అదేవిధంగా తీర్థాల, సత్యనారాయణపురం, నాయుడుపేట, పొన్నెకల్ గ్రామాలలో పర్యటించి బాధిత కుటుంబాలను పరామర్శించారు.

# కుభీర్‌లో బీఆర్ఎస్ శ్రేణుల భారీ ర్యాలీ.

**కుభీర్ :** పేదింటి ఆడబిడ్డల వివాహానికి ఆర్థిక ంగా అండగా నిలుస్తున్న కల్యాణలక్ష్మి షాదీముబారక్ పథకాలను యథావిధిగా కొనసాగించాలని బీఆర్ఎస్ ముధోల్ నియోజకవర్గ సమన్వయ సమితి సభ్యుడు డాక్టర్ కిరణ్ కొమ్రెవార్, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ లోలం శ్యాంసుందర్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం నిర్మల్ జిల్లా కుభీర్ మండల కేంద్రంలో పార్టీ అధ్యక్షుడు ఎన్నిల అనిల్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ప్రధాన వీధుల గుండా ర్యాలీ



నిర్వహించి తహసీల్ కార్యాలయం వద్ద బైటాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అంతకు ముందు అన్నబావు సాటే, చత్రపతి శివాజీ, అంబేద్కర్ విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. శ్రీ విఠలే శ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహి ంచారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను నిర్వీర్యం చేయాలని చూస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ కుట్రలను తిప్పికొట్టేందుకు బీఆర్ఎస్ శ్రేణులు సిద్ధంగా ఉన్నారని, బీఆర్ఎస్ ఎల్లప్పుడూ ప్రజలకు అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈపాటికి ఇన్సూరెన్స్ కంపెనీకి ప్రీమియం చెల్లించకపోవడంతో రైతు బీమా పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ ఆందోళనలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ రేకుల గంగాచరణ్, వైస్ ఎంపీపీ మొహియొద్దిన్, సుంకేటపోశెట్టి, ఎన్నిల అనిల్, గంధం పోశెట్టి, బాబు, దొంతుల దేవి దాస్, జి కాశీనాథ్, దేవన్న, చిన్న పార్డి దత్తు, ఏఖినోద్దీన్, గడపాలే దత్తాత్రి, జీవన్, వర్ని రమేష్, చోండి పోతన్న, మాదన్న, నాయకులు పాల్గొన్నారు.

శనివారం , ఆగస్టు 22 , 2026

భవిష్యత్ ప్రజాపాలన
తెలుగు దినపత్రిక



# తొలి టెస్ట్‌లో ఘోర పరాజయం దిశగా పాకిస్థాన్



## నిప్పులు చెరిగిన ఇంగ్లండ్ జట్టు బౌలర్లు

## పెవిలియన్‌కు క్యూ కట్టిన పాక్ బ్యాటర్లు

ఇంగ్లండ్‌తో జరుగుతున్న తొలి టెస్ట్‌లో పాకిస్థాన్ ఘోర పరాజయం దిశగా సాగుతోంది. మూడు టెస్ట్‌ల సిరీస్‌లో భాగంగా లీడ్స్ వేదికగా జరుగుతున్న తొలి టెస్ట్‌లో 238 పరుగుల భారీ లోటుతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన పాకిస్థాన్.. 76 పరుగులకే 6 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఆ జట్టు ఇంకా 160 ప్లస్ రన్స్ వెనుకంజలో ఉంది. ఇంగ్లండ్ బౌలర్లు జోష్ టంగ్, జోఫ్రా ఆర్చర్, ఓలీ రాబిన్సన్ నిప్పులు చెరగడంతో పాక్ బ్యాటర్లు పెవిలియన్‌కు క్యూ కట్టారు. ఓపెనర్లు అజాన్ అవైస్(9), ఇమామ్ ఉల్ హక్(0) తీవ్రంగా నిరాశపర్చగా.. షాన్ మసూద్(29) క్రీజులో నిలబడే ప్రయత్నం చేశాడు. కానీ అతన్ని జోష్ టంచ్ పెవిలియన్ చేర్చాడు. అబ్దుల్లా షఫీక్(15), సౌద్ షకీల్(14), కెప్టెన్ సల్మాన్ అఘా(4) కూడా వెనుదిరగడంతో పాక్ పీకల్లోతు కష్టాల్లో పడింది. క్రీజులో మహమ్మద్ రిజ్వాన్(8 బ్యాటింగ్)తో పాటు అలి ఉస్మాన్(2 బ్యాటింగ్) ఉన్నాడు. మరో సెషన్నర ఆట మిగిలి ఉండగా.. మూడో రోజు ఆటలోనే ఈ మ్యాచ్ ఫలితం తేలనుంది. అదే జరిగితే.. పాకిస్థాన్ ఇన్నింగ్స్ తేడాతో ఓటమి పాలవ్వనుంది. అంతకుముందు 366/8 ఓవర్‌నైట్ స్కోర్‌తో మూడో రోజు ఆటను కొనసాగించిన ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 409 పరుగుల భారీ స్కోర్ చేసింది. జోర్డాన్ కాక్స్(73), కెప్టెన్ జోరూట్(66), హ్యారీ బ్రూక్(91), డాన్ లారెన్స్ సత్తా చాటారు. పాక్ బౌలర్లలో అలి ఉస్మాన్(5/95) ఐదు వికెట్లు తీయగా.. ఖుర్రమ్ షెహ్‌జాద్(3/133) మూడు వికెట్లు పడగొట్టాడు. మహమ్మద్ అబ్బాస్, మహమ్మద్ అలీ తలో వికెట్ తీసారు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ తొలి ఇన్నింగ్స్‌లో 171 పరుగులకే కుప్పకూలింది. అబ్దుల్లా షఫీక్(61) హాఫ్ సెంచరీతో రాణించగా.. ఇమామ్ ఉల్ హక్(42) పర్వాలేదనిపించాడు. ఇంగ్లండ్ బౌలర్లలో ఓలీ రాబిన్సన్(5/51), జోష్ టంగ్(5/46) ఐదేసి వికెట్లతో పాకిస్థాన్ పతనాన్ని శాసించారు. గాయంతో బాబర్ ఆజామ్ ఈ మ్యాచ్‌కు దూరమవ్వడంతో పాక్ బ్యాటింగ్ లైనప్ బలహీనంగా మారింది. ఒక్క బ్యాటర్ కూడా క్రీజులో నిలబడలేకపోయాడు. మరోవైపు జో రూట్ అరుదైన ఘనత నమోదు చేశాడు. క్రీజులో పాతుకుపోయి ఆడిన రూట్ 112 బంతుల్లో 10 ఫోర్ల సాయంతో 66 రన్స్ చేసి పెవిలియన్ కు చేరాడు.

ఈ ఇన్నింగ్స్‌తో టెస్ట్ క్రికెట్ చరిత్రలోనే అత్యధిక హాఫ్ సెంచరీలు చేసిన ఇండియన్ లెజెండ్ సచిన్ టెండూల్కర్ 68 ఫిఫ్టీల రికార్డును రూట్ సమంగా చేసి, చరిత్రకెక్కాడు. వెస్టిండీస్ గ్రేట్ శివనారాయణ్ చంద్రపాల్ 66 ఫిఫ్టీలతో రెండో స్థానంలో నిలిచాడు. ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ అలెన్ బోర్డర్, ఇండియా దిగ్గజం రాహుల్ ద్రవిడ్ 63 ఫిఫ్టీలతో తర్వాతి స్థానాల్లో ఉన్నారు. కెప్టెన్‌గా 42వ సారి యాభై ప్లస్ స్కోరు సాధించిన రూట్ ఈ జాబితాలో ఐదో స్థానానికి చేరుకున్నాడు. సౌతాఫ్రికా మాజీ సారథి గ్రేమ్ స్మిత్ 61 స్కోర్లతో టాప్ స్థానం దక్కించుకున్నాడు.

# జహీర్ ఖాన్ సలహాతోనే నేను ఓపెనర్‌గా..



టీమిండియా మాజీ డాషింగ్ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ విధ్వంసం గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. రెడ్ బాల్ క్రికెట్‌లో దూకుడుగా ఆడిన తొలి బ్యాటర్ సెహ్వాగ్ అనడంలో కూడా ఎలాంటి అతిశయోక్తి లేదు. 99, 199, 299 పరుగుల వద్ద కూడా సిక్సర్ బాదిన ఏకైక డాషింగ్ బ్యాటర్ సెహ్వాగ్. అయితే కెరీర్ ఆరంభంలో సెహ్వాగ్ లోయర్ మిడిలార్డర్‌లో ఆడేవాడు. ఆ తర్వాత ఓపెనర్‌గా ప్రమోషన్ అందుకొని ఆకాశమే హద్దుగా చెలరేగాడు. అప్పటి కెప్టెన్ సౌరవ్ గంగూలీ.. సెహ్వాగ్ కోసం తన ఓపెనింగ్ స్థానాన్ని త్యాగం చేశాడని అంతా అనుకుంటారు. కానీ తనను ఓపెనర్‌గా ప్రమోట్ చేసింది గంగూలీ కాదని తాజాగా సెహ్వాగ్ వెల్లడించాడు. పాకిస్థాన్ మాజీ ప్లేయర్ షోయబ్ అక్తర్‌తో ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ వీరేంద్ర సెహ్వాగ్ ఈ విషయాన్ని పంచుకున్నాడు. ఏడో స్థానంలో బ్యాటింగ్ చేసే తనను ఓపెనర్‌గా ఆడించాలని గంగూలీకి జహీర్ ఖాన్ చెప్పాడని సెహ్వాగ్ గుర్తు చేసుకున్నాడు. ఓపెనర్‌గా తాను విఫలమైతే జట్టు నుంచి తొలగించవద్దని గంగూలీని తాను వేడుకున్నానని, దానికి అతను హామీ ఇచ్చాడని సెహ్వాగ్ చెప్పుకొచ్చాడు. సచిన్ గాయంతో జట్టుకు దూరమవడంతో 2002లో ఇంగ్లండ్‌తో టెస్ట్ మ్యాచ్‌లో సెహ్వాగ్ ఓపెనర్‌గా అరంగేట్రం చేశాడు. తొలి బంతి నుంచే బౌండరీలు బాది టెస్ట్ క్రికెట్‌కు దూకుడు పరిచయం చేసిన సెహ్వాగ్.. 104 టెస్ట్‌ల్లో 23 సెంచరీలు, 32 హాఫ్ సెంచరీలతో 8586 పరుగులు చేశాడు. ఇందులో రెండు ట్రిపుల్ సెంచరీలు ఉన్నాయి. 251 వన్డేలు ఆడిన సెహ్వాగ్ 15 సెంచరీలతో 8273 పరుగులు సాధించాడు. ఇండోర్‌లో జరిగిన మ్యాచ్‌లో అతను 219 పరుగులతో డబుల్ సెంచరీ కూడా సాధించాడు. 2007 టీ20 ప్రపంచకప్ , 2011 వన్డే ప్రపంచ కప్‌లను భారత్ గెలుచుకోవడంలో కీలక పాత్ర పోషించాడు. సెహ్వాగ్‌ను ఓపెనర్‌గా ఆడించా లని జహీర్ ఖాన్ ఇచ్చిన సలహా.. భారత జట్టు రాతనే మార్చేసింది.



# సాత్విక్ చిరాగ్ శెట్టి జోడీ ఓటమి

బ్యాడ్మింటన్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో భారత షట్లర్లు సాత్విక్ సాయిరాజ్ రంకిరెడ్డి - చిరాగ్ శెట్టి ద్వయం పోరాటం ముగిసింది. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్‌లో సాత్విక్- చిరాగ్ శెట్టి జోడీ ఓడిపోయింది. ఈ ద్వయం వరల్డ్ నెం 3 జోడీ లియాంగ్ వి కెన్- వాంగ్ చంగ్ (చైనా)ను క్వార్టర్స్‌లో ఢీ కొట్టింది. వరుస సెట్లలో 18-21 9-21 తేడాతో భారత ద్వయం ఓడిపోయింది. దీంతో వరల్డ్ ఛాంపియన్‌షిప్స్‌లో మూడో పతకం నెగ్గాలన్న సాత్విక్- చిరాగ్ ఆశలు ఆవిరయ్యాయి. సొంత అభిమానుల మధ్య భారీ అంచనాలతో దిల్లీలోని ఇందిరా గాంధీ ఇండోర్ స్టేడియంలో శుక్రవారం జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో, భారత జోడీ సాత్విక్ - చిరాగ్, చైనాకు చెందిన లియాంగ్ వీ కెంగ్ - వాంగ్ చాంగ్‌తో తలపడ్డారు. మ్యాచ్ తొలి సెట్ హోరాహోరీగా సాగింది. తొలి నుంచే ఇరు జట్ల ఆటగాళ్లు అద్భుతమైన నైపుణ్యాన్ని ప్రదర్శించారు. పోటీపడి పాయింట్లు సాధించడంతో ఆట ఉత్కంఠభరితంగా సాగింది. అయితే భారత జోడీ గట్టిగా పోరాడినప్పటికీ, మొదటి సెట్‌ను చైనా ద్వయం 21- 18తో కైవసం చేసుకుంది. దీంతో రెండో సెట్‌లో సాత్విక్ - చిరాగ్ కమ్‌బ్యాక్ ఇస్తారని అభిమానులు ఆశించారు. కానీ, మొదటి సెట్ విజయం ఇచ్చిన ఉత్సాహంతో చైనా జోడీ రెండో సెట్ ఆరంభం నుంచే తమ ఆధిపత్యాన్ని కొనసాగించింది. మరింత దూకుడు పెంచి ధనాధన్ షాట్లతో పాయింట్లు సాధించింది. దీంతో చైనా జోడీ వరుసగా రెండో సెట్‌ను కూడా సొంతం చేసుకుంది. ఫలితంగా లియాంగ్ వీ కెంగ్ - వాంగ్ చాంగ్ ద్వయం సెమీఫైనల్‌కు అర్హత సాధించడమే కాకుండా, పతకాన్ని ఖాయం చేసుకుంది. ఈ టోర్నమెంట్‌లో సాత్విక్- చిరాగ్ జోడీ పతకం తీసుకొస్తుందని అభిమానులు భారీగా ఆశలు పెట్టుకున్నారు. కానీ ఇలా క్వార్టర్స్‌లోనే ఓడిపోయి టోర్నీ నుంచి నిష్క్రమించడంతో అభిమానులు నిరాశకు లోనయ్యారు. ఇటీవల సింగపూర్ ఓపెన్ వంటి అంతర్జాతీయ టోర్నమెంట్లలో టైటిల్స్ గెలిచి అద్భుతమైన ప్రదర్శన చేసిన ఈ జోడీ, సొంత గడ్డపై ఓడిపోవడం భారత అభిమానులను నిరుత్సాహానికి గురిచేస్తుంది. కాగా, గురువారం మహిళల సింగిల్స్‌లో పీవీ సింధు కూడా ప్రీ క్వార్టర్స్‌లో ఓడిపోయింది.

# క్వార్టర్ ఫైనల్స్‌లో ట్రీసా జాలీ



భారత్‌కు తొలి పతకం ఖాయమైంది. భారత స్టార్ ద్వయం ట్రీసా జాలీ- గాయత్రి గోపిచంద్ క్వార్టర్ ఫైనల్‌లో విజయం సాధించింది. ఈ జోడి శుక్రవారం జరిగిన మహిళల డబుల్స్ క్వార్టర్ ఫైనల్‌లో ఫైనల్‌లో చైనాకు చెందిన జియా యి ఫాన్, జాంగ్ షు జియాన్‌పై 16-21, 21-15, 21-13 తేడాతో విజయం సాధించింది. దీంతో ట్రీసా- గాయత్రి జోడీకి పతకం (కనీసం కాంస్యం) ఖాయమైంది. ఈ మ్యాచ్ తొలిసెట్లో భారత ద్వయంపై చైనా జోడీ జియా యి ఫాన్, జాంగ్ షు జియాన్‌దే ఆధిపత్యంగా సాగింది. ట్రీసా- గాయత్రి పోరాడినప్పటికీ ప్రత్యర్థి జోడీ దూకుడుగా ఆడి తొలి సెట్‌ను 21-16తో సొంతం చేసుకుంది. అయితే రెండో సెట్‌లో భారత జోడీ సూపర్ కమ్‌బ్యాక్ ఇచ్చింది. ప్రత్యర్థికి అవకాశం ఇవ్వకుండా ధనాధన్ షాట్లతో ఎటాక్‌కు దిగింది. మ్యాచ్‌లో నిలవాలంటే తప్పక నెగ్గాల్సిన సెట్‌ను ట్రీసా- గాయత్రి ద్వయం 21-15తో సొంతం చేసుకుంది. దీంతో మ్యాచ్ ఫలితం కోసం మూడో సెట్ ఆడాల్సి వచ్చింది. అయితే ఇండియన్ షట్లర్లు అదే జోరును ప్రదర్శించారు. ప్రత్యర్థిని ఒత్తిడిలోకి నెట్టి మూడ సెట్‌ను 21-13 భారీ తేడాతో గెలుచుకున్నారు. మొత్తం గంటా తొమ్మిది నిమిషాల పాటు సాగిన ఆటలో 16-21, 21-15, 21-13 తేడాతో విజయం సాధించిన ట్రీసా- గాయత్రి సెమీస్‌కు దూసుకెళ్లింది. దీంతో మన షట్లర్లకు కనీసం కాంస్య పతకం ఖాయమైంది. కాగా, బీడబ్ల్యూఎఫ్ ప్రపంచ ఛాంపియన్‌షిప్ మహిళల డబుల్స్‌లో భారత్ చివరిసారిగా 2011లో పతకం సాధించింది. లండన్ వేదికగా జరిగిన ఆ పోటీలో భారత షట్లర్ జోడీ జ్వాలా గుత్తా - అశ్విని పొన్నప్ప కాంస్య పతకం గెలుచుకుంది. మళ్లీ 15ఏళ్లకు ఈ విభాగంలో భారత్ పతకం అందుకోనుంది. 2022, 2023 సంవత్సరాలలో ట్రీసా - గాయత్రి జోడీ వరుసగా ఆల్ ఇంగ్లాండ్ ఓపెన్ సెమీఫైనల్స్‌కు చేరుకుంది. 2022లో కామన్వెల్త్ గేమ్స్‌లో కాంస్య పతకాన్ని కూడా గెలుచుకుంది. గతేడాది ప్రారంభంలో టాప్ 10లోకి ప్రవేశించింది. అయితే, ఈ సంవత్సరం ప్రారంభంలో ఆసియా బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్స్, ఉబెర్ కప్‌కు ముందు శిక్షణ తీసుకుంటుండగా ట్రీసా చీలమండకు గాయమైంది. ప్రాక్టీస్ చేస్తుండగా ఆమె అనుకోకుండా ఆమె చీలమండ బెణికింది. దీంతో ట్రీసా రిహాబిలిటేషన్‌కు వెళ్లింది. గాయం నుంచి పూర్తిగా కోలుకొని ఇటీవల ఇండోనేసియా ఓపెన్‌లో ఈ ద్వయం మళ్లీ బరిలోకి దిగింది. ఆపై యూఎస్ ఓపెన్, ఈ నెల ప్రారంభంలో ఫిలిప్పైన్ ఇంటర్నేషనల్ ఛాలెంజ్‌లో విజేతగా నిలిచింది. ఇప్పుడు వరల్డ్ ఛాంపియన్స్‌షిప్స్‌లోనూ పతకం ఖాయం చేసుకుంది.

# సచిన్ రికార్డును సమం చేసిన రూట్



హైదరాబాద్ : పాకిస్తాన్, ఇంగ్లాండ్ మధ్య టెస్ట్ మ్యాచ్ జరుగుతున్న నేపథ్యంలో జో రూట్ అరుదైన ఘనత సాధించాడు. పాక్ తో జరుగుతున్న తొలి టెస్ట్ సందర్భంగా 68వ అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్న ఇంగ్లాండు టెస్ట్ కెప్టెన్ రూట్...

సచిన్ టెండూల్కర్ రికార్డ్ ను సమం చేశాడు. సచిన్ టెండూల్కర్ ఇప్పటి వరకు 68 అర్థ సెంచరీలు టెస్టులలో సాధించారు.ఆ తర్వాత చందర్ పాల్ 66, బోర్డర్ 63, రాహుల్ ద్రావిడ్ 63 అర్ద సెంచరీలు నమోదు చేశారు.

# వందకోట్ల క్లబ్బులోకి డిసి మూవీ




టాలెంటెడ్ డైరెక్టర్ అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వంలో, ప్రముఖ దర్శకుడు లోకేష్ కనగరాజ్ ప్రధాన పాత్రలో నటించిన 'డీసీ' సినిమా బాక్సాఫీస్ వద్ద సరికొత్త చరిత్ర సృష్టిస్తోంది. సన్ పిక్చర్స్ పతాకంపై కళానిధి మారన్ నిర్మించిన ఈ రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ చిత్రం, విడుదలైన మొదటి రోజు నుంచే ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందనను సొంతం చేసుకుంటూ దూసుకెళ్తోంది. విడుదలైన కొద్ది రోజుల్లోనే భారీ వసూళ్లతో ప్రపంచవ్యాప్తంగా బాక్సాఫీస్ రికార్డులను తిరగరాస్తున్న ఈ చిత్రం తాజాగా రూ. 100 కోట్ల క్లబ్‌లో చేరింది. దీంతో దర్శకుడిగా సత్తచాటిన లోకీ నటుడిగా కూడా తన సత్తా ఏంటో నిరూపించుకున్నాడు.

శరత్ చంద్ర చటోపాధ్యాయ క్లాసిక్ నవల 'దేవదాస్' స్ఫూర్తితో, అరుణ్ మాథేశ్వరన్ తనదైన మాస్ అండ్ రా యాక్షన్ శైలిలో తెరకెక్కించిన ఈ చిత్రం టాలీవుడ్ మరియు కోలీవుడ్ సర్కిల్స్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ చిత్రంలో దేవదాస్ పాత్రలో లోకేష్ కనగరాజ్ తన తొలి నటనతోనే విమర్శకుల ప్రశంసలు అందుకోగా, చంద్ర పాత్రలో వామికా గబ్బి మరియు మరో ప్రధాన పాత్రలో సంజనా కృష్ణమూర్తి నటన సినిమాకే ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ముఖ్యంగా రాక్ స్టార్ అనిరుధ్ రవిచందర్ అందించిన ఉత్కంఠభరితమైన నేపథ్య సంగీతం, ముకేష్ జి సినిమాటోగ్రఫీ, ప్రసన్న జి.కె ఎడిటింగ్ ఈ సినిమా స్థాయిని విపరీతంగా పెంచేశాయి.

# నటి షావుకారు జానకి మృతి

## వయోసంబంధ అస్వస్థతో కన్నుమూత
## షావుకారు సినిమాతో పేరు స్థిరం




తెలుగు చిత్రపరిశ్రమలో విషాదం చోటుచేసుకుంది. ప్రముఖ సీనియర్ నటి షావుకారు జానకి కన్నుమూశారు. వృద్ధాప్య సంబంధిత అనారోగ్య సమస్యల కారణంగా శుక్రవారం ఆమె మృతి చెందారు. షావుకారు జానకి ఇటీవల తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. కుటుంబసభ్యులు ఆమెను చెన్నైలోని కావేరి ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ 94 ఏళ్ల వయసులో శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో ఆమె తుది శ్వాస విడిచారు. షావుకారు జానకి మరణంపై నడిగర్ సంఘం అధ్యక్షుడు నాజర్ అధికారిక ప్రకటన విడుదల చేశారు. షావుకారు జానకి భౌతికకాయాన్ని శుక్రవారం సాయంత్రం 5 గంటలనుంచి తేనామ్‌పేట్‌లోని సెనోటాఫ్ రోడ్‌లో.. అభిమానులు, స్నేహితులు, చిత్ర పరిశ్రమకు చెందిన వారు నివాళు లు అర్పించటం కోసం ఉంచుతామని తెలిపారు. టేకుమళ్ల జానకి 1931 డిసెంబర్ 12వ తేదీన తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రిలో జన్మించారు. విజయవారి 'షావుకారు' సినిమాతో 1950లో జానకి సినీరంగ ప్రవేశం చేశారు. మొదటి సినిమా పేరునే తన ఇంటి పేరుగా మార్చుకున్నారు. 'షావుకారు' జానకిగా పాపులర్ అయ్యారు. జానకి తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో దాదాపు 380 చిత్రాలలో నటించారు. ఆమె చివరగా 2023లో వచ్చిన 'అన్నీ మంచి శకునములే' సినిమాలో కనిపించారు.

భారతీయ చలనచిత్ర పరిశ్రమ మరో గొప్ప దిగ్గజాన్ని కోల్పోయింది. నాలుగు తరాల ప్రేక్షకులను తన అద్భుతమైన అభినయంతో మంత్రముగ్ధులను చేసారు. వయోభారంతో పాటు శ్వాసకోశ సంబంధిత అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆమెను కుటుంబ సభ్యులు కొద్ది రోజుల క్రితం చెన్నైలోని కావేరి ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ ఐసీయూలో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతూ ఆమె పరిస్థితి విషమించడంతో శుక్రవారం మధ్యాహ్నం 1:59 గంటలకు కన్నుమూసినట్లు వైద్యులు వెల్లడించారు. ఆమె మరణవార్తతో తెలుగు, తమిళ, కన్నడ సినీ పరిశ్రమల్లో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. కేవలం నాయికగానే కాకుండా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా, ప్రతినాయక ఛాయలున్న పాత్రల్లోనూ వైవిధ్యం చాటుకుని తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. కళారంగానికి ఆమె అందించిన అమూల్యమైన సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం 2022 సంవత్సరంలో దేశ అత్యున్నత పౌర పురస్కారాలలో ఒకటైన ప్రతిష్టాత్మక 'పద్మశ్రీ' అవార్డుతో ఆమెను ఘనంగా సత్కరించింది. ఆమె మృతి పట్ల పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తున్నారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ సోషల్ మీడియా వేదికగా నివాళులు అర్పిస్తున్నారు.

# ఇరుముడి ఎమోషనల్ డ్రామా




రవితేజ హీరోగా 'ఇరుముడి' అనే టైటిల్ ప్రకటించినప్పటి నుంచే ఈ సినిమాపై అంచనాలు నెలకొన్నాయి. ఆ అంచనాలకు తగ్గట్టుగానే ఇందులోని పాటలు, ట్రైలర్‌లో చూపించిన ఫ్యామిలీ ఎమోషన్, థ్రిల్లర్ ఎలిమెంట్స్ సినిమాపై అంచనాలను పెంచాయి. కచ్చితంగా రవితేజకి ఇది కమ్‌బ్యాక్ సినిమా అవుతుందని

అందరూ భావించారు. పీలేరు ప్రాంతంలో త్రినాథ్(రవితేజ) ఆటో నడుపుతూ, అరటిపళ్ల వ్యాపారం చేస్తూ కూతురు మణెమ్మ(నక్షత్ర), భార్య కావేరి(ప్రియా భవానీ శంకర్)తో ఆనందంగా జీవిస్తుంటాడు. ఆ ప్రాంతంలో అందరి ఆడపిల్లలని తన కూతురులానే చూస్తుంటాడు. తనకు మద్యం అలవాటు ఉంటుంది. కాకపోతే అయ్యప్ప స్వామి మాలలో ఉన్నప్పుడు మాత్రం మందు జోలికి వెళ్లడు. అదే ప్రాంతంలో పదో తరగతి చదువుతున్న ఓ విద్యార్థిని అనూహ్యంగా చనిపోతుంది. ఆ మరణం వెనుక ఉన్నది ఎవరు? ఈ చావు త్రినాథ్ కుటుంబాన్ని ఎలా ప్రభావితం చేసిందనేది మిగతా కథ. తెలుగులో చాలా క్రైమ్ థ్రిల్లర్స్ వచ్చాయి. కాకపోతే కుటుంబ, అయ్యప్ప మాల నేపథ్యంలో ఒక ఎమోషనల్ థ్రిల్లర్‌గా 'ఇరుముడి' ప్రత్యేకంగా కనిపిస్తుంది. సినిమా కథ ప్రారంభం ఓ స్కూల్లో టీచర్ సస్పెండ్ అవడంతో మొదలవుతుంది. ఆ తర్వాత కుటుంబం, మణెమ్మతో ఉన్న ఎమోషనల్ బాండింగ్‌ను ఎస్టాబ్లిష్ చేయడానికి కొంత సమయం పడుతుంది. ఎప్పుడైతే పదో తరగతి చదువుతున్న ఓ అమ్మాయి అనూహ్యంగా చనిపోతుందో, అక్కడి నుంచి కథలో ఉత్కంఠ పెరుగుతుంది. అది విరామానికి వచ్చేసరికి ప్రేక్షకుల్లో మరింత ఆసక్తి, ఎమోషన్ కలిగిస్తుంది. ఈ కథను దర్శకుడు హ్యాండిల్ చేసిన తీరు ఆకట్టుకుంటుంది. కథలో మంచి ట్విస్టులు రాసుకున్నారు. ఒక హార్ట్ టచింగ్ ఎమోషనల్ ఫ్యామిలీ డ్రామాగా కథను దర్శకుడు శివ నిర్వాణ నడిపించారు. అదే సమయంలో ఒక బలమైన సందేశం కూడా ఇచ్చారు. ఆ సందేశం కచ్చితంగా గుర్తుపెట్టుకుని పాటించదగ్గదిగా ఉంటుంది. రవితేజ తన మాస్ ఇమేజ్‌ను పక్కన పెట్టి పూర్తిగా ఎమోషనల్ క్యారెక్టర్‌లో నటించారు. త్రినాథ్ పాత్రలో ఆయన పెర్ఫార్మెన్స్ చాలా కొత్తగా ఉంటుంది. ఒకవైపు ఎమోషనల్ తండ్రిగా, మరోవైపు మద్యానికి బానిసైన వ్యక్తిగా, అయ్యప్ప మాల వేసుకున్న భక్తుడిగా, చివర్లో ఒక తండ్రిగా.. తన పాత్రలో చాలా వేరియేషన్స్ ఉన్నాయి. ఆ వేరియేషన్స్ అన్నింటినీ రవితేజ చాలా పరిణతితో కనబరిచారు. అలాగే మణెమ్మ పాత్రలో చేసిన బేబీ నక్షత్ర పాత్ర కూడా చాలా ఎమోషనల్‌గా ఉంటుంది. రవితేజ భార్య పాత్రలో కనిపించిన ప్రియా భవానీ శంకర్ పోషించిన కావేరి పాత్ర కూడా చాలా హుందాగా ఉంటుంది. ఆ పాత్ర ఈ సినిమాకు కావాల్సిన ఎమోషన్‌ను యాడ్ చేసింది. గురుస్వామి పాత్రలో చేసిన సాయికుమార్ పాత్ర ఆయనకు చాలా కొత్తగా, అదే సమయంలో ప్రభావవంతంగా ఉంటుంది. సెకండ్ హాఫ్‌లో ఆ పాత్రకు దర్శకుడు రాసుకున్న ఒక మలుపు కూడా కథకు బలాన్ని చేకూర్చింది. అలాగే అజయ్ ఘోష్ పాత్ర కూడా కావాల్సిన క్యూరియాసిటీని పెంచింది. మిగతా నటీనటులు పరిధి మేరకు కనిపించారు. సీలేరు ప్రాంతంలో తీసిన చిత్రమిది. అన్ని ఒరిజినల్ లొకేషన్స్ కావడంతో కథ నిజంగా అక్కడే జరుగుతున్నట్టుగా అనుభూతిని కలిగించింది. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాణ విలువలు కథకు తగ్గట్టుగా ఉన్నాయి.

# హాయ్ చిత్రం ట్రైలర్ విడుదల



లేడీ సూపర్ స్టార్ నయనతార, టాలెంటెడ్ యంగ్ హీరో కవిన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న రొమాంటిక్ డ్రామా మూవీ 'హాయ్'. ప్రముఖ గీత రచయిత విష్ణు ఎడవన్ చిత్రంతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఆగస్టు 28న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా భారీ ఎత్తున థియేటర్లలో విడుదల కాబోతుండగా తాజాగా ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. తమిళంతో పాటు తెలుగు ట్రైలర్‌ను వదిలింది. ఈ ట్రైలర్ ఫుల్ లవ్, ఫన్ మరియు ఎమోషన్స్‌తో ఆకట్టుకునేలా ఉంది. ప్రేమ వివాహాల కోసం ప్రయత్నించి విఫలమయ్యే సామాన్యుడిగా కవిన్ ఇందులో కనిపించగా, ఆయనకు దేవసేన పాత్రలో నటిస్తున్న నయనతార ఎదురుకావడం జరుగుతుంది. సంప్రదాయాలకు భిన్నంగా ఉండే ఒక స్వతంత్ర భావాలున్న మహిళగా నయనతార లుక్ చాలా ఆకర్షణీయంగా ఉంది. అనుకోని పరిస్థితుల నేపథ్యంలో వీరిద్దరికీ పెళ్లి జరగడం, ఆ తర్వాత వారి మధ్య జరిగే మనస్పర్థలు, భావోద్వేగాలు ఈ సినిమా ప్రధాన కథాంశంగా ట్రైలర్ ద్వారా తెలుస్తోంది. కవిన్, నయనతార ఆన్-స్క్రీన్ కెమిస్ట్రీ చాలా ఫ్రెష్‌గా ఉండి సినిమాపై అంచనాలను పెంచుతోంది. ఇక ఈ చిత్రంలో నయనతార, కవిన్‌లతో పాటు కే. భాగ్యరాజ్, ప్రభు, రాధికా శరత్‌కుమార్ వంటి దిగ్గజ నటీనటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ సినిమాకు జెన్ మార్టిన్ సంగీతం అందిస్తుండగా, రాజేష్ శుక్లా సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వర్తించారు. జి స్టూడియోస్ సౌత్, రౌడీ పిక్చర్స్ మరియు సెవెన్ స్క్రీన్ స్టూడియోస్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించాయి.



# 'స్పిరిట్'లో ప్రకాశ్ రాజ్ లేరు.. క్లారిటీ ఇచ్చిన నిర్మాత

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, సంచలన దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో రూపొందుతున్న 'స్పిరిట్' చిత్రం నుంచి ఒక కీలక అప్‌డేట్ వెలువడింది. ఈ సినిమాలో ప్రముఖ నటుడు ప్రకాశ్ రాజ్ నటించడం లేదని అధికారికంగా స్పష్టత వచ్చింది. చిత్ర నిర్మాత ప్రణయ్ వంగా స్వయంగా ఈ విషయాన్ని వెల్లడించారు.

ఈ చిత్రంలోని జైలర్ పాత్ర కోసం తొలుత ప్రకాశ్ రాజ్‌ను సంప్రదించినప్పటికీ, కొన్ని కారణాల వల్ల అది సాధ్యపడలేదని ఆయన స్పష్టం చేశారు. గత ఏడాది విడుదలైన టీజర్‌లో ప్రకాశ్ రాజ్ వాయిస్ ఓవర్ వినిపించడంతో ఆయన ఈ ప్రాజెక్టులో భాగమయ్యారని అందరూ భావించారు. అయితే, ఆ తర్వాత ఆయన ఈ సినిమా నుంచి తప్పుకున్నట్లు ప్రచారం జరిగింది. తాజాగా నిర్మాత చేసిన ప్రకటనతో ఆ వార్తలకు బలం చేకూరినట్లయింది.

మరోవైపు 'స్పిరిట్' చిత్రంలో మెగాస్టార్ చిరంజీవి అతిథి పాత్రలో కనిపించనున్నారంటూ వస్తున్న ఊహాగానాలకు కూడా ప్రణయ్ వంగా తెరదించారు. ఈ సినిమాలో చిరంజీవి ఎలాంటి క్యామియో చేయడం లేదని ఆయన తేల్చి చెప్పారు.

# ఆదిత్యరాయ్ మూవీలో భాగ్యశ్రీ భోర్సే

## వార్తలను తోసిపుచ్చిన టీ సీరిస్

టాలీవుడ్‌లో తన అందం, నటనతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యంగ్ హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సేకు సంబంధించిన ఓ బాలీవుడ్ వార్త తాజాగా ఆసక్తికరంగా మారింది. బాలీవుడ్ స్టార్ హీరో ఆదిత్య రాయ్ కపూర్, దర్శకుడు మిలాప్ జవేరీ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న భారీ యాక్షన్ లవ్‌స్టోరీలో భాగ్యశ్రీ హీరోయిన్‌గా ఎంపికైందంటూ గత కొద్దిరోజులుగా జోరుగా ప్రచారం జరిగింది. అయితే ఈ వార్తలపై తాజాగా బాలీవుడ్ నిర్మాణ సంస్థ టీ-సిరీస్ స్పందించింది. ఈ ప్రచారాన్ని టీ-సిరీస్ ప్రతినిధులు అధికారికంగా ఖండించారు. ఈ సినిమాలో భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తోందన్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని స్పష్టం చేశారు. సినిమాలో హీరోయిన్‌గా ఎవరు నటించబోతున్నారనే విషయాన్ని త్వరలోనే అధికారికంగా వెల్లడిస్తామని తెలిపారు. ఆదిత్య రాయ్ కపూర్, మిలాప్ జవేరీ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న ఈ ప్రాజెక్ట్‌పై ప్రస్తుతం భారీ అంచనాలు ఉన్నాయి. ప్రేమ, యాక్షన్, ఎమోషన్స్ మేళవింపుతో ఈ చిత్రాన్ని రూపొందించనున్నట్లు దర్శకుడు మిలాప్ జవేరీ గతంలో వెల్లడించారు. ప్రేమకథలను తెరకెక్కించడంలో తనదైన శైలిని చూపించిన మిలాప్ జవేరీ.. 'మర్జావాన్', 'ఏక్ దివానే కీ దివానియత్' వంటి సినిమాలతో గుర్తింపు తెచ్చుకున్నారు. ఈసారి ఆదిత్య రాయ్ కపూర్‌తో మరింత ఇంటెన్స్ లవ్‌స్టోరీని తెరకెక్కించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. భాగ్యశ్రీ బోర్సేకు బాలీవుడ్ కొత్తేమీ కాదు. 'యారియాన్ 2', 'చందు ఛాంపియన్' వంటి చిత్రాల్లో చిన్న పాత్రల్లో కనిపించిన ఆమె.. హీరోయిన్‌గా మాత్రం ఇప్పటివరకు పెద్ద ప్రాజెక్ట్‌లో అవకాశం దక్కించుకోలేదు. ఆదిత్య రాయ్ కపూర్ సినిమా ద్వారా బాలీవుడ్‌లో హీరోయిన్‌గా గ్రాండ్ ఎంట్రీ ఇస్తుందంటూ వచ్చిన వార్తలు కూడా ఇప్పుడు అవాస్తవంగా తేలాయి. భాగ్యశ్రీ బోర్సే రవితేజ నటించిన 'మిస్టర్ బచ్చన్' సినిమాతో టాలీవుడ్‌లోకి హీరోయిన్‌గా అడుగుపెట్టింది. తొలి సినిమాతోనే తన గ్లామర్‌తో పాటు నటనతోనూ తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఆ తర్వాత వరుస అవకాశాలు ఆమె తలుపు తట్టాయి. దుల్కర్ సల్మాన్, రానా దగ్గుబాటి, సముద్రఖని కీలక పాత్రల్లో నటించిన తమిళ చిత్రం 'కాంత' లోనూ భాగ్యశ్రీ నటించింది.



Edited,Printed,Published and Owend by CHITLA DIVYA ,Printed at POTHUGANTI RACHANA , G2, TSRINIVAS, ROAD NO : 4 , RANGAREDDY , Hyderabad- 500035 . Published at H.NO : 177/P , PLOT NO : 402 ANJAMMA RESIDENCY , MANIKONDA , Hyderabad - 500089, Telangana. Editor : CHITLA VIJAYKUMAR REDDY , RNI : TGTEL/26/A0153 e-mail : bhavishyatprajapalana@gmail.com , Cell : 81061 86888